


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


అక్రమ వలసదారుల అంశంపై ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు 05

ఆధార్ పౌరసత్వానికి ఆధారం కాదు : సుప్రీంకోర్టు

హాంగ్‌కాంగ్ అగ్ని ప్రమాదంలో 70 మందికి చేరిన మృతుల సంఖ్య 02

సంపుటి 09, సంచిక: 02 | శుక్రవారం | 28-11-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## 'సిపిఐ శత వార్షికోత్సవాల భారీ బహిరంగ సభ'

# జనవరి 18వ తేదీకి వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్




గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో డిసెంబర్ 26న ఖమ్మంలో తలపెట్టిన 'సిపిఐ శత వార్షికోత్సవాల భారీ బహిరంగ సభ'ను జనవరి 18వ తేదీకి వాయిదా వేసినట్టు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు వెల్లడించారు. ఈ మేరకు సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ అధ్యక్షతన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు కూనంనేని సాంబశివ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీ బహిరంగ సభకు దేశ నలుమూలల నుండి ఐదు లక్షల మంది పాల్గొంటున్నారని, సిపిఐ జాతీయ సమితి ఆధ్వర్యంలో దేశ వ్యాపితంగా జాతాలు, వివిధ కార్యక్రమాలను రూపొందించామని వివరించారు.

**గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్, సిపిఐ 'సీట్ల' సర్దుబాటు**

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో సాధ్యమైన వరకు కాంగ్రెస్, సిపిఐ సీట్ల సర్దుబాటు పట్ల అవగాహన కుదుర్చుకుని పోటీ చేయాలని, సిపిఐ, సిపిఐ(ఎం) పరస్పర పోటీని నివారించాలని నిర్ణయించినట్టు కూనంనేని సాంబశివ రావు తెలిపారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ సాధ్యమైన ఎక్కువ సీట్లలో గెలువాలని పిలుపునిచ్చారు. ఢిల్లీ విద్యార్థులపై మోపిన ఉపా చట్టాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. హిడ్మా ఎన్ కౌంటర్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో విద్యార్థులు ఆందోళన చేపట్టడం పట్ల కేంద్ర ప్రభుత్వం 'ఉపా' చట్టాన్ని ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. దేశ వ్యాపితంగా లక్షలాది మంది హిడ్మా ఎన్ కౌంటర్‌ను వ్యతిరేకించారని, వారందరిపైన కూడా ఇలాంటి నల్ల చట్టాలను ప్రయోగించి, ఎంత మందిని జైలులో పెడుతారని ప్రశ్నించారు. విద్యార్థులపై నమోదు చేసిన 'ఉపా' చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు.

## గ్రామ పంచాయతీ ఎన్నికలకు

# నామినేషన్‌లు షురూ

ప్రజాపక్షం/హైదరాబాద్





రాష్ట్రంలో గ్రామపంచాయతీ ఎన్నికల నామినేషన్‌ల పర్వం మొదలైంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ నేతృత్వంలో 'ఎన్నికల ప్రవర్తన నియమావళి స్క్రీనింగ్' కమిటీ ఏర్పాటు చేశారు. ఈసారి ఫిర్యాదుల స్వీకరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం టియాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. తద్వారా ఓటరు, పోలింగ్ బూత్ వివరాలను తెలుసుకోవచ్చు. అలాగే ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి ఫిర్యాదు కూడా చేయవచ్చు. ఈ నేపథ్యంలో న్యాయపరమైన ఇబ్బందులను అధిగమించేందుకు పంచాయతీ గ్రామీణాభివృద్ధి శాఖలో ప్రత్యేకంగా లీగల్ సెల్‌ను కూడా ప్రారంభించారు. పంచాయతీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న అన్ని రాజకీయ పార్టీలు సైతం గెలుపు గుర్రాల వెటలో పడ్డాయి. ఎన్నికల్లో గెలుపు తరువాయి 2లో

గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో

## ప్రత్యేక లీగల్ సెల్

### అందుబాటులోకి టి-పోల్ యాప్




సర్పంచులు, వార్డు మెంబర్ల ఎన్నికల కోసం నామినేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో పంచాయతీ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనరేట్‌లో ప్రత్యేక లీగల్ సేల్ ఏర్పాటు చేశారు. ముగ్గురు సూపరిడెంట్ స్థాయి అధికారులతో లీగల్ సెల్ ఎన్నికల్లో రిజర్వేషన్‌లను సవాల్ చేస్తూ కోర్టులలో పలు పిటిషన్‌లు దాఖలైన నేపథ్యంలో లీగల్ సెల్‌ను అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్నికలు నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తిచేసే విధంగా, ఎన్నికల ప్రక్రియకు ఎలాంటి ఆటంకం కలగకుండా వెంటనే చర్యలు తీసుకునేలా జిల్లాలతో లీగల్ సెల్ సమన్వయం చేయనుంది. రాష్ట్రంలో అన్ని జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికెఆరులు, జిల్లా పంచాయతీ అధికారులు కేసులకు సంబంధించి వివరాలు, సూచనలు 24 గంటల్లోపు అదనపు అడ్వకేట్ జనరల్, ప్రభుత్వ పీడర్‌కి నివేదించాలని ఆదేశారలు జారీ చేశారు. ప్రతి జిల్లాలో కోర్టు కేసులను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిని తరువాయి 2లో

# ఒకరిపై మరొకరి పోటీ వద్దు

గ్రామ పంచాయతీ ఎన్నికలలో పరస్పర అవగాహనతో ఉండాలని సిపిఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుల సంయుక్త సమావేశం నిర్ణయం

ప్రజాపక్షం/హైదరాబాద్



గ్రామ పంచాయతీ ఎన్నికలలో సిపిఐ, సిపిఐ(ఎం) పరస్పర అవగాహనతో ఒకరిపైన మరొకరు పోటీ చేయకుండా ఉండాలని సిపిఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుల సంయుక్త సమావేశం నిర్ణయం తీసుకున్నది. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన సిపిఐ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సంయుక్త సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సిపిఐ సీనియర్ నాయకులు చాడ వెంకట్ రెడ్డి, తరువాయి 2లో

## తొలి ప్రైవేటు 'స్కైరూట్' వాహకనౌక విక్రమ్-1ను ఆవిష్కరించిన ప్రధాని మోదీ

**హైదరాబాద్:** హైదరాబాద్ కేంద్రంగా వెలిసిన అంతరిక్ష అంకురసంస్థ 'స్కైరూట్ ఇన్ఫినిటీ క్యాంపస్'ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం దృశ్యమాధ్యమ విధానం ద్వారా ప్రారంభోత్సవం చేశారు. దేశ ప్రైవేటు రంగంలో రూపొందించిన మొట్టమొదటి ఆర్బిట్ రాకెట్ (అంతరిక్ష వాహకనౌక) విక్రమ్-1 ను ఆవిష్కరించి ప్రపంచానికి పరిచయం చేశారు. జనరేషన్ -జెడ్ వృత్తి నిపుణులు దేశంకోసం సరికొత్త సాంకేతికతను సృష్టిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన ప్రశంసించారు. స్కైరూట్ కంపెనీకి చెందిన ప్రతిష్ఠాత్మకమైన తొలి ప్రైవేటు తరువాయి 12లో




# రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

### పార్టీలకు అతీతంగా కలసిరావాలి : ఎంపీలతో భేటీలో ఉపముఖ్యమంత్రి భట్టి

ప్రజాపక్షం/హైదరాబాద్

''తెలంగాణ రాష్ట్రంలో వెనుబడిన తరగతుల (బిసి) కు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో సవరణ జరగాలి. ఈ అంశంపై రాష్ట్రానికి చెందిన అన్ని పార్టీల ఎంపిలు కలిసి ఒక వినతి పత్రాన్ని ప్రధానమంత్రికి ఇవ్వాలి. ప్రధాన మంత్రి సమయం ఇస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఢిల్లీకి వచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించాలి'' అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బిసిల రిజర్వేషన్‌కు సంబంధించి రాష్ట్రంలో ఎపిక్ సర్వే జరిగిందని, ఎంపిరికల్ డాటా ఆధారంగా అసెంబ్లీలో బిసిల రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టగా పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా ఆమోదించారని, బిల్లు గవర్నర్ నుంచి కేంద్రానికి వెళ్లి అక్కడ పెండింగ్‌లో ఉందని ఎంపిలకు వివరించారు. రాష్ట్ర ప్రయోజనాలకు అనుకూలంగా పార్లమెంట్ సభ్యులు అందరూ పార్టీలకు అతీతంగా ఒక బృందంగా ఏర్పడి ప్రధానమంత్రికి, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారని డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పార్లమెంట్ సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని గురువారం ప్రజాభవన్‌లో నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ ఎంపిలు మల్లు రవి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, చామల కిరణ్‌కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామ్ రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీ, ఎం.అనిల్‌కుమార్ యాదవ్, బిజెపి ఎంపి రఘునందన్ రావు, నగేష్ పాల్గొన్నారు. పార్లమెంట్‌లో ప్రస్తావించాల్సిన అంశాలపై వారితో చర్చించారు. మొత్తం 12 శాఖలకు సంబంధించిన 47 అంశాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు నేతృత్వంలో ఉన్నతాధికారులు వివరించారు. సమావేశంలో డిప్యూటీ సిఎం మాట్లాడుతూ వెనుబడిన తరగతుల (బిసి) కు సంబంధించిన 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో సవరణ అంశాన్ని పార్లమెంటు సమావేశాల్లో ప్రత్యేకంగా చర్చకు తీసుకురాలని, నిర్దేశిత ఫార్మాట్‌లో వాయిదా తీర్మానం లేదా ప్రశ్నోత్తరాల సమయంలో చర్చకు తీసుకురావాలని సూచించారు.

**సమాచారం కోసం ఢిల్లీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు**


పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఎంపిలు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత తొందరగా అందించేందుకు ఢిల్లీలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశామని, ఈ విభాగాన్ని ఎంపిలు వినియోగించుకోవాలని డిప్యూటీ సిఎం ఎంపిలను కోరారు. అసెంబ్లీ సమావేశాల సమయంలో ప్రభుత్వ శాఖలు ఏ విధంగా పూర్తి సంసిద్ధంగా ఉంటాయో, పార్లమెంటు సమావేశాల సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉండి సమాచారం అందించేందుకు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రానికి సంబంధించిన ఎవరైనా ఎంపిలు తరువాయి 2లో

## చైనా, జపాన్‌ల స్థాయి

# అభివృద్ధే టార్గెట్

### ప్రపంచంతోనే పోటీపడేలా స్కిల్ యూత్

- కొత్త రంగాల్లో, కొంగొత్త మార్గాల అన్వేషణ
- మూడు రీజియన్లుగా రాష్ట్ర ఆర్థికాభివృద్ధి
- తెలంగాణ రైజింగ్ 2047 సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- అభివృద్ధిని ప్రతిబింబించేలా తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ : అధికారుల పవర్ పాయింట్ ప్రజెంటేషన్



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ అభివృద్ధిని ప్రతిబింబించేలా 'తెలంగాణ రైజింగ్2047 పాలసీ డాక్యుమెంట్' ఉండాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేందుకు స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీ డాక్యుమెంట్‌లో కనిపించాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేసుకోవాలని, కోర్ అర్బన్ రీజియన్ ఎకానమి ( క్యూర్), పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీ ( ప్యూర్), తరువాయి 12లో



భారత్- అఫ్గానిస్థాన్

## దుష్ప్రచారం చేశాయ్

ఇమ్రాన్‌ఖాన్ కస్టడీ హత్య వార్తలకు పాక్ ఖండన

**రావల్పిండి:** మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్ ఖాన్ జైలు కస్టడీలో హత్యకు గురయ్యారన్న వార్తలను పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. ఆయన క్షేమంగానే ఉన్నారని వివరణ ఇచ్చింది. అఫ్గానిస్థాన్- భారత్ మీడియా ఈ దుష్ప్రచారం చేశాయని ఆ దేశ సమాచార ప్రసారాల మంత్రిత్వశాఖ విమర్శించింది. ఆ శాఖ నిజనిర్ధారణ విభాగం అధికారి ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు. ఈ రెండు దేశాల మీడియాలో ఇమ్రాన్‌ఖాన్ కస్టోడియల్ హత్యపై 46 నిమిషాలు మాత్రమే ప్రచారం జరిగిందని, వారు స్వతంత్ర పద్ధతులలో రిపోర్టింగ్ చేయకుండా సమన్వయంతో ఈ దుష్ప్రచారం చేశారని దాన్నిబట్టే అర్థమవుతోందని సంబంధిత శాఖ విమర్శించింది. 2013, 2022 కాలంనాటి ఇమ్రాన్‌ఖాన్ ఫొటోలను తరువాయి 12లో




## రాష్ట్ర అభివృద్ధిలో ఆర్ అండ్ బి

# కీలక భూమిక

- విజన్ 2047 అనుగుణంగా ప్రణాళికలు చేయాలి
- గ్లోబల్ సమ్మిట్‌లో ప్రజెంటేషన్ : మంత్రి కోమటిరెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర అభివృద్ధిలో ఆర్‌అండ్‌బి శాఖ కీలక భూమిక వహిస్తున్నదని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బి ప్రధాన కార్యాలయంలో గురువారం విజన్ 2047పై మంత్రి సంబంధిత అధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం తరువాయి 2లో

వక్ఫ్ భూముల వివాదంలో..

## మునంబం నివాసితుల హక్కులకు

# ఎలాంటి హానీ జరుగదు

- కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం హామీ
- బాధిత ప్రజల నుండి పన్నును స్వీకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడి



**కొచ్చి :** వక్ఫ్ ఆస్తిగా చెప్పుకునే తమ భూమిపై యాజమాన్యాన్ని పొందేందుకు పోరాడుతున్న ప్రజల హక్కులకు ఎటువంటి హానీ జరగదని కేరళ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం హామీ ఇచ్చారు. మునంబం నివాసితుల నుండి భూమి పన్నును స్వీకరించాలని కేరళ రాష్ట్ర ప్రభుత్వాన్ని కేరళ హైకోర్టు ఇటీవల ఆదేశించిన తర్వాత బినోయ్ విశ్వం ఈ విషయమై భరోసా ఇచ్చారు. ఆయన గురువారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. 'మునంబం ప్రజల హక్కులు పూర్తిగా పొందే వరకూ వారితో కలిసి పనిచేస్తామని కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది. హైకోర్టు ఆదేశాల తర్వాత మేం కూడా అలాగే చేశాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుండి భూమి పన్నును స్వీకరించడానికి చర్యలు ప్రారంభించింది' అని బినోయ్ విశ్వం చెప్పారు. బాధిత కుటుంబాల నుండి భూమి పన్ను వసూలు చేయాలని తరువాయి 2లో

## నిరంతర పర్యవేక్షణ

# అవసరం



ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం కోర్టు..

డిసెంబర్ 3న పిటిషన్ విచారణకు అంగీకారం

**న్యూఢిల్లీ:** ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలోని దారుణమైన గాలి కాలుష్యంపై దాఖలు అయిన పిటిషన్‌ను డిసెంబర్ 3న విచారించేందుకు సుప్రీం కోర్టు గురువారం అంగీకరించింది. ఈ సమస్యను నిరంతరం పర్యవేక్షించడం అవసరమని కోర్టు పేర్కొంది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తి జోయ్‌మాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం, గాలి కాలుష్య కేసులో అమికస్ క్యూరీగా సహాయపడుతున్న సీనియర్ అడ్వకేట్ అపరాజితా సింగ్ సమర్పించిన వాదనలు పరిగణనలోకి తీసుకుంది. ఆమె ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతంలో పరిస్థితి భయంకరంగా మారిందని అన్నారు. ఈ పరిణామాలను ఒక ఆరోగ్య అత్యవసర పరిస్థితిగా అమె పేర్కొన్నారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పందిస్తూ, 'న్యాయస్థానం వద్ద ఎలాంటి మంత్రదండం లేదు. ఒక న్యాయస్థానం ఏ మాంత్రిక దండం ఊపగలదు? ఢిల్లీ-జాతీయ రాజధాని ప్రాంతానికి ఈ పరిస్థితి ప్రమాదకరమని నాకు తెలుసు. సమస్య ఏమిటో అందరికీ తెలుసు. కానీ పరిష్కారం ఏమిటన్నది అసలు విషయం. కారణాలను గుర్తించాలి. పరిష్కారాలను మాత్రం రంగ నిపుణులే తరువాయి 2లో

మతాతీతంగా

## సోదరభావం ప్రదర్శించండి

టర్కీ పర్యటనలో పోప్ శాంతి సందేశం



**అంకారా:** మతాలు, ఆచారాలకు అతీతంగా ప్రజలు సోదరభావంతో మెలగాలని పోప్ లియో-14 పిలుపు ఇచ్చారు. గురువారం ఆయన టర్కీలో పర్యటించారు. వాటికన్‌సిటీలో పోప్‌గా ఆరునెలల క్రితం బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పెరూ మాజీ అధ్యక్షుడికి 14 ఏళ్ళ జైలు

**లిమా :** దక్షిణఅమెరికా దేశం పెరూలో లంచాలు తీసకున్నారన్న ఆరోపణలు రుజువు కావడంతో ఆ దేశ మాజీ అధ్యక్షుడు మార్టిన్ విజ్కారా (62) కు న్యాయస్థానం 14 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. 2018 మార్చి నుండి 2020 నవంబరు వరకూ ఆయన పెరూ దేశాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహించారు. అంతకుముందు ఆయన దేశ మొదటి ఉపాధ్యక్షుడుగా, ఒక రాష్ట్ర గవర్నరుగాకూడాపనిచేశారు.2011–2014 మధ్యకాలంలో ఆయన మోక్వె గువాప్రాంతగవర్నరుగా పనిచేసినప్పుడు లంచాలు తీసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. నిర్మాణ ప్రాజెక్టులు, నీటిపారుదల వ్యవస్థ, ఆసుపత్రుల నిర్మాణంలో ఉండగా 2.3 మిలియన్ సోల్స్ లంచాలు తీసుకున్నట్లు ఆయనపై ఆరోపణలు రుజువు కావడంతో బుధవారం ఆయనకు న్యాయస్థానం శిక్ష ఖరారు చేసింది.మరో 94,600సోల్స్‌జరిమానాగా విధించింది. తొమ్మిది సంవత్సరాలపాటు పౌర పదవులు చేపట్టకుండా నిషేధం విధించింది.

### హాంగ్‌కాంగ్ అగ్ని ప్రమాదంలో

# వందలమంది గల్లంతు..70కి పెరిగిన మృతుల సంఖ్య

**మూడు నిర్మాణ కంపెనీల అధికారులు అరెస్టు**



**హాంగ్‌కాంగ్ :** హాంగ్‌కాంగ్ తైపో జిల్లాలో బుధవారం మధ్యాహ్నం ఆకాశహర్మ్యాలు దగ్ధమైన భారీ విపత్తులో వందలమంది గల్లంతయ్యారు. వారికోసం తీవ్రంగా గాలిస్తున్నారు. వీరంతా అనేక గంటలసేపు మంటల్లో చిక్కుకు పోవడంతో సజీవదహనమయ్యారని సందేహిస్తున్నారు. వీరిలో చాలామంది టాప్ ఫ్లోర్స్‌లో ఉన్నవారే. వీరిలో ఎక్కువమంది వృద్ధులు, మహిళలు ఉండి ఉంటారని కూడా భావిస్తున్నారు. ఈ కేసులో ఎలాంటి సురక్షిత చర్యలు తీసుకోకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారన్న ఆరోపణలపై మూడు నిర్మాణ కంపెనీలకు చెందిన ముగ్గురు ఎగ్జిక్యూటివ్‌లను పోలీసులు అరెస్టు చేశారు.మరోవైపు ఈ భారీ అగ్ని ప్రమాదంలో మృతుల సంఖ్య 70కి పెరిగింది. పలువురు గాయపడి ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. ఈ ఆరు ఆకాశహర్మ్యాలు ఒకదాని తర్వాత మరొకటిగా అంటుకుని భారీ అగ్ని ప్రమాదానికి దారితీసింది. ఈ ఆకాశహర్మ్యాలు దగ్ధమైన వార్త తెలియగానే వాటి నివాసితుల బంధువులు వివిధ ప్రాంతాల నుండి హుటాహుటి అక్కడికి చేరుకున్నారు. తమ ఆత్మీయులకోసం వెదకుటాట ప్రారంభించారు. వారి జాడ తెలియక తీవ్ర ఆందోళనతో కన్నీరుమున్నీరవుతున్నారు. ఇప్పటివరకూ గుర్తించిన సమాచారం ప్రకారం 279 మంది నివాసితుల జాడ తెలియడంలేదు. ఈ టవర్స్‌లో మొత్తం 4,600 మంది నివాసితులు ఉన్నట్లు అంచనా. ఐతే ప్రమాదం ఎలా జరిగింది? ఆ సమయంలో ఎంతమంది టవర్స్‌లో ఉన్నారు? అనే విషయంపై ఇప్పటికీ ఎవరికీ ఒక స్పష్టత లేదు. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో హాంకాంగ్ ఐలాండ్ ఒక స్పెషల్ ఎడ్మినిస్ట్రేటివ్ రీజియన్‌గా ఉంది. ఈ ప్రాంతంలో ఆకాశాన్ని అంటేవిధంగా ఎత్తుగా నిర్మించిన ఎనిమిది టవర్లు ఉండగా వీటిల్లోని ఏడు టవర్లలో ఉన్న అనేక బ్లాకులు అగ్నికి ఆహుతయ్యాయి. ఇప్పటివరకూ నాలుగు టవర్స్‌లో మంటలను అదుపు చేశారు. గురువారం రాత్రికి మిగిలిన టవర్స్‌లో కూడా మంటలను అదుపు చేయగలమన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 700 అగ్నిమాపక దళాలు ఈ సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తుండగా, మంటలను అదుపు చేసే క్రమంగా ఈ దళ సభ్యుడు హో వై హో (37) మరణించారు. మరోవైపు ఈ మంటలను అదుపు చేయడంలో అధికారులు తీవ్రజాప్యం చేశారని, నిర్లక్ష్యంగా వ్యవహరించారని మృతుల బంధువుల నుండి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు హాంగ్‌కాంగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జాన్ లీ గురువారం పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, పెద్ద నిర్మాణ సంస్థలు టవర్ల నిర్మాణంలో వెదురు దూలాలను నిచ్చెనలుగా, పరంజాలుగా ఉపయోగిస్తున్నాయని, వీటివల్లే ప్రమాదం తీవ్రత పెరిగిందని గుర్తించామని అన్నారు. ఇక మీదట వెదురు దూలాలను నిర్మాణరంగంలో ఉపయోగించకుండా నిషేధించి లోహాలతో తయారు చేసిన బలమైన దూలాలను ఉపయోగించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అగ్ని ప్రమాదం నుండి అనేకమంది నివాసితులు బతికి బయటపడ్డారు. వారంతా ఇప్పుడు అనాథలుగా మారారు. బుధవారం రాత్రంగా షాపింగ్ మాల్స్‌లో, మెట్రో ట్రైన్ స్టేషన్లలో వారు నిద్రించారు. వాలంటీర్లు వారికి అన్ని సదుపాయాలు సమకూర్చేందుకు కృషి చేస్తున్నారు.

### బడ్జెట్‌లో పన్నులభారాన్ని వ్యతిరేకిస్తూ

## బల్గేరియాలో వెల్లువెత్తిన ప్రజా నిరసన

**సోఫియా:** యూరప్ ఆగ్నేయ ప్రాంత దేశం బల్గేరియాలో పన్నుల భారాలను వ్యతిరేకిస్తూ వేలాదిమంది ప్రజలు వీధుల్లోకి వచ్చారు. సందర్భంగా స్వల్ప ఘర్షణలు చెలరేగాయి. దాదాపు 20 వేలమంది ప్రదర్శకులు దేశ పార్లమెంటు చుట్టూ మానవహారం ఏర్పాటు చేశారు. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ నినాదాలు చేశారు. బడ్జెట్‌లో ప్రజలపై భారీగా పన్నులు వేయవద్దని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది బడ్జెట్‌లో భారీగా పన్నులు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. పార్లమెంటులో తుది ఓటింగ్‌కు ముందుగా బడ్జెట్ ముసాయిదాలో ఈ విషయాన్ని ప్రభుత్వం ప్రకటించడంతో ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ బాల్కన్ దేశం వచ్చే ఏడాది యూరోజోన్‌లో చేరడానికి సిద్ధమవుతున్న తరుణంలో "ఉయ్ కంటిన్యూ ద ఛేంజ్ డెమోక్రటిక్ బల్గేరియా" పేరుతో ఏర్పడిన ప్రతిపక్ష సంకీర్ణ కూటమి ఆధ్వర్యంలో ఈ ప్రజా నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా చట్టసభ సభ్యుల కార్లను అడ్డుకునేందుకు ప్రజలు ప్రయత్నం చేశారు. అదేసమయంలో ప్రదర్శకులు సీసాలు, బాణసంచా వస్తువులు విసిరారని, ముగ్గురు గాయపడ్డారని పోలీసులు చెప్పారు. బడ్జెట్ విధానంవల్ల ప్రజలపైన, వ్యాపారులపైన తీవ్ర ప్రభావం పడుతుందని, సామాజిక భద్రతలో ప్రజలిచ్చే వాటా భాగస్వామ్యం పెరగడంవల్ల నష్టం కలుగుతుందని ప్రదర్శకులు ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక సంఘాలు, ప్రజా సమూహాలు, ఆర్థిక నిపుణులు హెచ్చరికలు చేసినప్పటికీ, పార్లమెంటులో తగినంత మెజారిటీ ఉందనే ధీమాతో ప్రభుత్వం ప్రజల వ్యతిరేకతను పట్టించుకోకుండా పన్నుల భారాలతో కూడిన బడ్జెట్‌ను ఆమోదించే అవకాశాలు ఉన్నాయి.

## మయన్మార్‌లో 3000మంది ఖైదీలు విడుదల

**ప్యాంగ్‌యాంగ్:** మయన్మార్‌లో ఎన్నికలు సమీపిస్తున్నతరుణంలో సైనిక జుంటా ప్రభుత్వం 3000 మంది ఖైదీలను విడుదల చేసింది. మరో 5000 మంది ఖైదీలపై కేసులను ఉపసంహరించుకుంది. ప్రభుత్వ హయాంలోని "మయన్మార్ ఇంటర్నేషనల్ టివి" ఈ వార్త ప్రసారం చేసింది. మళ్ళీ ఎలాటి నేరాలు, తప్పులు చేయబోమన్న హామీపై వారిని విడుదల చేశారు. జుంటా ప్రభుత్వ నాయకత్వంలో ఉన్న జాతీయ రక్షణ, భద్రతా మండలి 724 మందికి క్షమాభిక్ష ప్రసాదించింది. 2,361 మంది ఖైదీలకు మినహాయింపులు ఇచ్చి విడుదల చేసింది. అదేవిధంగా 5,580 మందిపై ప్రస్తుతం కొనసాగుతున్న కేసులను రద్దు చేసింది.
డిసెంబరులో అంటే వచ్చేనెల 28వ తేదీన దేశంలో ఎన్నికలు నిర్వహిస్తామని జుంటా ప్రభుత్వ స్వీయ ప్రకటన, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి పూర్వరంగంలో ఈ ఖైదీలను విడుదల చేశారు. మయన్మార్‌లో సెక్షన్ 505 ఎ కింద శిక్షలకు గురైనవారినందరినీ ప్రభుత్వం విడుదల చేసింది. వీరంతా దేశంలో వదంతులు, తప్పుడు ప్రచారం చేశారన్న ఆరోపణలపై అరెస్టయ్యారు.ఎట్టకేలకు విడుదలయ్యారు. వీరు కాకుండా ఆంగ్‌సాన్ సూకీ పార్టీకి చెందిన అనేక వందలమంది రాజకీయ ఖైదీలు గడచిన ఐదు సంవత్సరాలుగా జైళ్ళల్లో మగ్గుతున్నారు. మయన్మార్‌లో 2020 నవంబరులో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత సూకీ నాయకత్వాన గల ఎన్ఎల్‌డి విజయం సాధించింది జుంటా సైనికుల తరపున పోటీ చేసిన పార్టీ ఘోర పరాజయం పొందడంతో, ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న వంకపెట్టి గెలిచిన పార్టీని కుప్పకూల్చి జుంటా సైనిక నాయకత్వం ప్రభుత్వాన్ని స్వాధీనం చేసుకుంది. సూకీ సహా వందలమంది రాజకీయ నాయకులను జైళ్ళలోకి నెట్టింది. దీంతో 2021లో ప్రజాస్వామ్య ఉద్యమం ప్రారంభమైంది. ఈ ఉద్యమంలో వేలాదిమంది యువకులను సైనికులు కాల్చి చంపారు. ఆ తర్వాత దేశంలోని పలు ప్రాంతాలలో ప్రభుత్వ వ్యతిరేక తిరుగుబాటు దళాలు ఏర్పడ్డాయి. ఈ దళాలతో సైన్యం పోరాడుతూ వస్తోంది.

## అవినీతి కేసులో హసీనాకు 21 ఏళ్ళ శిక్ష

### కుమారుడు,కుమార్తెకు ఐదేసేళ్ళు



**ఢాకా:** పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ ప్రధాన మంత్రి షేక్ హసీనాకు మూడు అవినీతి కేసులలో కోర్టు 21 సంవత్సరాలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఆమె కుమారుడు సజీద్ వాజెద్ జోయ్, కుమార్తె సైమా వాజెద్ పుతుల్‌లకు కూడా మొత్తం మూడు కేసులలో ఒక కేసుకు సంబంధించి కోర్టు ఐదేసి సంవత్సరాలు వంతున జైలుశిక్షలు విధించింది. పూర్వాంచల్ న్యూ టౌన్ నివాసిత ప్రాంతాల నిర్మాణ ప్రాజెక్టులో ఆమెకు ప్లాట్ల కేటాయింపు అవినీతి జరిగిందంటూ హసీనా కుటుంబ సభ్యులు, అనుచరులపైన ఆరు కేసులు కోర్టులో నమోదయ్యాయి. మొత్తం ఆరు కేసుల్లోనూ హసీనా ఉమ్మడిగా దోషిగా ఉన్నారు. వీటిల్లో మూడు కేసులో గురువారం వెలువడిన తీర్పులో హసీనాకు 21 ఏళ్ళు జైలుశిక్ష పడింది. మిగిలిన 19మంది నిందితులకు వివిధ రకాలుగా శిక్షలు పడ్డాయి. ప్రజాపనుల మంత్రిత్వ శాఖలోమాజీ పాలనాధికారి సైఫుల్ ఇస్లామ్ సర్కార్‌మాత్రం మూడు కేసుల్లో నిర్దోషిగా విడుదలయ్యారు. ఢాకా కోర్టు–5కు చెందిన ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్లా అల్ మామన్ ఈ తీర్పులు చెప్పారు. సెక్టర్–27లో ఉన్న డిప్లమెటిక్ జోన్‌లోని నివాసిత ప్రాజెక్టులో సీనియర్ అధికారులతో కలిసి అవినీతికి పాల్పడి అక్రమంగా ఆరు ప్లాట్లను హసీనా సొంతం చేసుకున్నారంటూ అవినీతి నిరోధక శాఖ ఆమెపై ఆరు కేసులు బనాయించింది. కేసుల విచారణలో మూడు కేసుల్లో ఆమెకు ఈ శిక్షలు పడ్డాయి. హసీనా సోదరి షేక్ వాజెద్, ఆమె కుమారుడు రద్వాన్ ముజిబ్ సిద్దిఖ్ బొబ్బీ,కుమార్తె అజ్మినా సిద్దిఖ్‌లకు ఈ ప్లాట్లు కేటాయించారన్నదిప్రధానఆరోపణ. ఢాకాలోని మెట్రోపాలిటన్ సీనియర్ స్పెషల్ జడ్జి కోర్టులో అవినీతి నిరోధకశాఖ మార్చి 25న ఆరు ఛార్జిషీట్లు వేరు వేరుగా దాఖలు చేసింది. మొత్తం 29 మందిపై ఈ ఏడాది జులై 31న ఆరోపణలపై విచారణ మొదలైంది.భారతదేశంలోతలదాచుకున్నషేక్ హసీనా ను గతేడాది జులై అల్లర్లలో హింస చెలరేగడానికి ప్రధాన సూత్రధారిగా పేర్కొంటూనవంబరు 17వ తేదీన ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది.

### చైనాలో రైలు ప్రమాదం

### 11 మంది కార్మికులు మృతి



**బీజింగ్:** వాయువ్య చైనా ప్రాంత నగరం కున్మింగ్‌లో ఒక రైలు కార్మికులను ఢీ కొట్టింది.ఈ ప్రమాదంలో11మంది కార్మికులు మరణించారు. మరో ఇద్దరుతీవ్రంగాగాయపడ్డారు. గురువారం ఉదయం ఈ ప్రమాద ఘటన జరిగిందని స్థానిక అధికారులుచెప్పారు.గడచిన దశాబ్దకాలంలో ఇంతటి తీవ్రమైన రైలు ప్రమాదం చైనా చరిత్రలో జరగలేదు. భూకంపాన్ని గుర్తించే తనిఖీ పరికరాల పర్యవేక్షణకు ఈ రైలును ఉపయోగించారు. ఈ రైలు తన పనిలో నిమగ్నమై ఉన్న సమయంలో లుయో యాంగ్ టౌన్ రైల్వే స్టేషన్‌వద్ద ఒక మలుపులోట్రాక్‌లకు మరమ్మతులు చేస్తున్న కార్మికులనుఢీకొంది. సహాయ కార్యక్రమాలు చేపట్టింది.

## ప్రత్యేక లీగల్ సెల్

(మొదటి పేజీ తరువాయి)

నియమించాలని, కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన లీగల్ కేసులను పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారిని నియమించాలని, కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన లీగల్ సెల్‌తో సమన్వయం చేసుకోవాలని పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ సృజన ఆదేశాలు జారీ చేశారు.
అందుబాటులోకి టిపోల్ యాప్
తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం పౌరులు, తమ పోలింగ్ స్టేషన్, ఓటర్ స్లిప్ డౌన్‌లోడ్ చేసుకునేందుకు, ఫిర్యాదులను సులభంగా అప్‌లోడ్ చేసి, వాటి పరిష్కార ప్రగతిని ట్రాక్ చేసుకునేందుకు టిపోల్ మొబైల్ యాప్ అనే అప్లికేషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఈ యాప్ ప్లే స్టోర్ అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు.

## ఎలాంటి హానీ జరుగదు

(మొదటి పేజీ తరువాయి)

రెవెన్యూ శాఖ గతంలో నిర్ణయించిందని, అయితే హైకోర్టు ఆదేశాల మేరకు ఆ చర్యను నిలిపివేసినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం వివరించారు. ఇప్పుడు ఆ అడ్డంకి తొలగిపోయింది. కమ్యూనిస్టు పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం కేరళ హైకోర్టుకు కృతజ్ఞతలు తెలియజేస్తోందన్నారు. ఎవ్వరినీ వారి భూమి నుండి ఖాళీ చేయబోమని రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా చెబుతున్నదని కేరళ రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి పి.రాజీవ్ చెప్పారు.త రిలే నిరసనను ముగించే నిర్ణయం దాని నిర్వాహకులైన మునంబం భూపరిరక్షణ కమిటీదేనని మంత్రి అన్నారు.ఇంతకుముందు ఎవ్వరినీ తొలగించబోమని ముఖ్యమంత్రి పినరయి విజయన్ హామీ ఇచ్చారని, ఆ తర్వాత, సమ్మెను ముగించాలా? వద్దా? అనే నిర్ణయాన్ని నిరసనకారులకే వదిలేశారని, ఆ నిర్ణయం కొనసాగుతోందని పరిశ్రమల శాఖ మంత్రి రాజీవ్ చెప్పారు.మునంబం సమస్య వక్ఫ్ బోర్డు చుట్టూ ఉన్నటువంటి దాదాపు 400 ఎకరాల వక్ఫ్‌భూమిని వక్ఫ్ భూమిగా క్లెయిమ్ చేసుకోవడానికి సంబంధించినది. చాలా సంవత్సరాల క్రితం భూమి కొనుగోలు చేసిన 600కు పైగా కుటుంబాలు గత 411 రోజులుగా నిరసన కొనసాగిస్తున్నాయి. సానుకూల పరిణామాలతో ఆందోళనకారులు తమ నిరసనను ముగించాలని నిర్ణయించుకుంటారని భావిస్తున్నారు.

## ఒకరిపై మరొకరు పోటీ వద్దు

(మొదటి పేజీ తరువాయి)

సయ్యద్ అజీత్ పాషా, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు తక్కల్లపల్లి శ్రీనివాస రావు, ఈటి నరసింహ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, వి.ఎస్ బోస్, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్. వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, జి. నాగయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికలపైన చర్చించారు. గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలలో సిపిఐ,సిపిఐ(ఎం) పరస్పర అవగాహనతో ఒకరిపైన మరోకరు పోటీ చేయకూడదని నిర్ణయించారు. అలాగే ఖమ్మం జిల్లా సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు సామినేని రామారావు హత్య కేసులో పోలీసులు ఇప్పటి వరకు నేరస్తులను పట్టుకోలేదని, ఈ విషయంలో ఎటువంటి పురోగతి లేదని, వెంటనే ఈ కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి, దోషులను అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నామినేషన్‌లు షురూ

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు ఎక్కువగా ఉన్న అభ్యర్థులను రంగంలో దింపేందుకు సిద్ధం అయ్యాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే రాజకీయ పార్టీలు తగిన కసరత్తు పూర్తి చేసుకున్నాయి. నామినేషన్‌ల దాఖలే తరువాయి ప్రచార పర్వంలోకి దూకేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ఈ నెల 29 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామపత్రాలను దాఖలు చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ నెల 30న నామినేషన్‌లను పరిశీలన జరుపుతారు. అదే రోజు సాయంత్రం బరిలో నిలిచిన అభ్యర్థులతో కూడిన తుది జాబితాను ప్రకటించనున్నారు. డిసెంబర్ 3 వరకు ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. తొలిదశలో 4,236 గ్రామాలకు ఎన్నికలు జరగనుండగా, 37,450 వార్డుల్లో పోలింగ్ డిసెంబర్ 3న పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నారు. డిసెంబర్ 11న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు మధ్యాహ్నం ఓట్లు లెక్కించి వార్డు సభ్యులు, సర్పంచ్ ఫలితాలను వెల్లడించనున్నారు. అలాగే తొలి విడతలో ఎన్నికలు జరిగే 189 మండలాల్లోని 4,236 గ్రామాల్లో ఫొటోతో కూడిన ఓటర్ల జాబితాలను ప్రదర్శించనున్నారు.

## కీలక భూమిక

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్అండ్‌బి శాఖ పరిధిలోని పలు ప్రాజెక్టుల పురోగతిపై మంత్రి అధికారులను ఆరా తీశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, భవిష్యత్ అవసరాలకు గాను ఆర్అండ్‌బి శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే ప్రాజెక్టులపై మంత్రికి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గ్లోబల్ సమ్మిట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని, అందుకు తగ్గట్టుగా అధికారులు శాఖ పరమైన విజన్ డాక్యుమెంట్ రూపొందించాలని మంత్రి సూచించారు. వివిధ దేశాల డెలిగేట్స్ వస్తున్న నేపథ్యంలో భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే గ్లోబల్ సమ్మిట్ ప్రపంచ దృష్టిని ఆకర్షించనుందన్నారు. అలాంటి వేదికపై ఆర్అండ్‌బి శాఖ తన ప్రతిభ, ప్రణాళికలు గొప్పగా చెప్పాలన్నారు. హ్యామ్ రోడ్లు, నేషనల్ హైవే ప్రాజెక్టులు, ఆదిలాబాద్, వరంగల్, పెద్దపల్లి ఎయిర్‌పోర్ట్‌లు, రీజనల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఎలివేటెడ్ కారిడార్లు, టిమ్స్, నిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, ఉస్మానియా హాస్పిటల్, హైకోర్టు నూతన భవన నిర్మాణం, జిల్లా కోర్టుల నిర్మాణం వంటి అంశాలపై అధికారులతో మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజన్ ప్రకారం తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమీ లక్ష్యానికి తీసుకెళ్లే బాధ్యత ఆర్అండ్‌బి శాఖ అధికారులు, ఇంజనీర్లపై ఉందన్నారు. వచ్చే 5,10,15 ఏళ్ల ట్రాఫిక్ అవసరాలను అంచనా వేసి సమగ్రమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. రెండేళ్లలో ఆర్అండ్‌బి పరిధిలో కోటి చదరపు అడుగుల నిర్మాణాలు చేపట్టడం గర్వ కారణమని అన్నారు. పలు బృహత్తర ప్రాజెక్టులు, హ్యామ్ రోడ్లు, రీజినల్ రింగ్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కనెక్ట్ అయ్యే రేడియల్ రోడ్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయని పేర్కొ న్నారు. ఎక్స్‌ప్రెస్‌వేలు, ఎలివేటెడ్ కారిడార్లు, కొత్త ఎయిర్ పోర్టులు రాష్ట్ర అభివృద్ధిలో కీలకమని వెల్లడిం చారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రోడ్ల వివరాలు సింగిల్ లేన్, డబుల్ లేన్, ఫోర్ లేన్ వంటి భవిష్యత్ అవస రాలకు అనుగుణంగా ప్రతి రోడ్డుకు సంబంధించి స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో ఆర్అండ్‌బి శాఖ విజన్ డాక్యుమెంట్ వీడియో ప్రదర్శనను సిద్ధం చేయాలని సూచించారు.
ఇప్పటి వరకు చేసిన పనులు, భవిష్యత్ ప్రాజెక్టులు, మన్ననూర్– శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, భారత్ ఫ్యూచర్ సిటీ– బందరు పోర్టు గ్రీన్ ఫీల్డ్ హైవే, హైదరాబాద్–విజయవాడ ఎక్స్‌ప్రెస్‌వే తదితర ప్రాజెక్టులన్నీ విజన్ డాక్యు మెంట్‌లో సమగ్రంగా పొందుపరచాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి, ఆర్‌టిసి చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, ఆర్అండ్‌బి ఈఎన్సీలు మోహన్ నాయక్, జయ భారతి, ఎన్‌హెచ్‌ఎఐ రీజినల్ అధికారి శివ శంకర్, ఆర్అండ్‌బి సిఈలు శ్రీనివాస్ రెడ్డి, బి.వి. రావు, లింగారెడ్డి, నర్సింగ్‌రావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రయోజనాల కోసం పార్లమెంట్‌లో ప్రశ్నించడం, కేంద్ర మంత్రులకు విజ్ఞప్తులు ఇవ్వాలనుకుంటే విషయాన్ని వివరిస్తే నిర్దేశిత ఫార్మాట్‌లో సమాచారాన్ని, విజ్ఞాపన పత్రాలను ఢిల్లీలోని రాష్ట్ర అధికారులు ఎంపిలకు అందిస్తారని వివరించారు. నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, జిఎస్‌టి తదితర విషయాలకు సంబంధించి కేంద్ర నుంచి రాష్ట్రానికి రావలసిన నిధులు, పథకాలకు సంబంధించి గతంలో రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాసిందని, ఆ లేఖలు ఢిల్లీలోని ప్రత్యేక విభాగంలో ఎంపిలకు అందుబాటులో ఉంటాయని, వాటి ఆధారంగా ఎంపిలు పరిశీలించే అవకాశం ఉంటుందన్నారు.
డిసెంబర్ 9 నాటికి ప్రజా ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తి కానున్న సందర్భంగా ప్రభుత్వం సాధించిన విజయాల వివరించడంతోపాటు తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణానికి సంబంధించి '2047 విజన్ డాక్యుమెంట్' ఆవిష్కరణ చేయనున్నట్లు డిప్యూటీ సిఎం తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతానికి కమిటీలు వేస్తున్నాం, కేంద్ర మంత్రులను, ఎంపిలందరినీ ఆహ్వానించాలని భావిస్తున్నామని, ఆసక్తి ఉన్న ఎంపిలు పేర్లు ఇస్తే కమిటీల సభ్యులుగా నమోదు చేస్తామన్నారు. దేశంలో, ప్రపంచంలో ప్రముఖ వ్యక్తులు, సంస్థలతో ఎంపిలకు ఎవరికైనా పరిచయం ఉంటే వివరాలు ఇవ్వాలని, రాష్ట్ర ప్రయోజనాల కోసం వారిని గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానిస్తామని డిప్యూటీ సిఎం తెలిపారు.
**సమిష్టిగా ప్రధానిని కలుద్దాం: ఎంపి ల సూచన**
రాష్ట్ర ప్రయోజనాల విషయంలో అందరం కలిసికట్టుగా ముందుకు వెళదామని మెదక్ బిజెపి ఎంపి రఘునందన్ రావు సమావేశంలో అన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్స్, ఇతర సమస్యలపై ప్రధానమంత్రి సమయం తీసుకుని సమిష్టిగా కలుద్దామని సూచించారు. ఆదిలాబాద్ పటాన్ చెరువు రైల్వే లైన్ సాధ్యాసాధ్యాలు, డిపిఆర్ ఏమైనా చేశారా అని అడిగారు. రాష్ట్రానికి కేటాయించిన ఐఎఎస్, ఐపిఎస్ కేడర్ కేటాయింపు గురించి పూర్తి సమాచారాన్ని అందిస్తే సంబంధిత మంత్రిని పార్టీలకు అతీతంగా కలసి లేఖ ఇద్దామని ప్రతిపాదించారు. రాష్ట్రానికి అవసరం అయిన బొగ్గు గనుల విషయంలో అందరం కలిసి బొగ్గుగనుల శాఖ మంత్రిని కలుద్దామని ప్రతిపాదించారు. రీజనల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్స్, ఇతర రహదారులు, పెండింగ్ అంశాలపై అఖిలపక్ష సభ్యులంతా కలిసి నేరుగా ప్రధానమంత్రికి లేఖ ఇద్దామని మల్లు రవి చెప్పారు. మహబూబ్‌నగర్ ఎయిర్ పోర్ట్‌పై పూర్తి సమాచారానికి సంబంధించి కేంద్రానికి లేఖ రాయాలన్నారు. గద్వాలదోర్నకల్ రైల్వే లైన్ సర్వేపైనా సమాచారాన్ని ఆయన కోరారు. పోలవరం ప్రాజెక్ట్ పూర్తయితే బ్యాక్ వాటర్ వల్ల తమ నియోజకవర్గ ప్రజలు తీవ్రంగా నష్టపోతారని, ముంపు వల్ల లక్షమందికి పైగా ముంపు బారిన పడే అవకాశం ఉందని మహబూబాబాద్ ఎంపి బలరామ్ నాయక్ చెప్పారు. ఈ సమస్యపైనా పరిష్కారం కావాలన్నారు. ములుగు ఏటూరు నాగారం రహదారిని కేంద్రం మంజూరు చేసినా ఇప్పటికి టెండర్ ఖరారు కాలేదని చెప్పారు. అటవీ, పర్యావరణ అనుమతులు రాకపోవడం వల్లే ఆలస్యం అవుతోందని చెప్పారు. దీనిపై కేంద్రాని లేఖ రాయడం కానీ, పార్లమెంట్ లో ప్రస్తావన చేయడం కానీ చేయాలని అన్నారు. కాగా వివిధ ప్రాంతాలకు చెందిన ఎంపిలు వారి నియోజకవర్గాలలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకువచ్చారు.

## నిరంతర పర్యవేక్షణ అవసరం

(మొదటి పేజీ తరువాయి)

సూచించగలరు. దీర్ఘకాలిక పరిష్కారాలు లభిస్తాయని మేము ఆశిస్తున్నాం' అన్నారు. తక్షణమే ఏమని ఆదేశాలు జారీ చేయాలని ప్రశ్నించారు. కొన్ని ఆదేశాలు ఇచ్చిన వెంటనే శుభ్రమైన గాలి పీల్చగలమా అని ప్రశ్నించారు. అదే సాధ్యమైతే ఎంతో బాగుండేదని అన్నారు. ప్రతి ప్రాంతానికీ ప్రత్యేక పరిష్కారాలు అవసరమని, ప్రభుత్వం ఏ కమిటీ ఏర్పాటు చేసిందో వేచి చూద్దామని ఆయన అన్నారు. దీపావళి వచ్చినప్పుడు మాత్రమే ఢిల్లీలో వాయు కాలుష్యంపై చర్చ వస్తుందని, నిజానికి ఈ సమస్యపై నిరంతర పర్యవేక్షణ అవసరమని ఆయన అన్నారు. తీవ్రమైన పరిస్థితుల్లో కాలుష్యకార్యకలాపాలపై పరిమితులు విధించే గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి) క్రింద ఏడాది పొడవునా నిషేధాలు విధించాలన్న కోరిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీని బదులు, దీర్ఘకాలిక, సుస్థిర పరిష్కారాలు అవసరమని అభిప్రాయపడింది.
**ఆందోళనకరంగా వాయు నాణ్యత**
ఢిల్లీలో వాయు నాణ్యత వరుసగా ఆందోళనకరంగా మారుతున్నది. శీతాకాలం మొదలుకాకముందే చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వాలు ఉదాశీన వైఖరి అవలంభించడం ఈ దుస్థితికి ప్రధాన కారణం. రాజధానిలో వాయు నాణ్యత సూచీ (ఎక్యుఐ) 327గా నమోదైంది. రాబోయే వారంలో కూడా దాదాపు ఇలాంటి పరిస్థితే ఉండవచ్చని అంచనా. సుమారు పదిహేను రోజులుగా వాయు కాలుష్య తీవ్రత పెరుగుతూ, 'అత్యంత దారుణం' వర్గంలో చేరింది. ఎయిర్ క్వాలిటీ అర్లీ వార్నింగ్ సిస్టమ్ అంచనా ప్రకారం, కనీసం మరో వారం రోజుల పాటు వాయు కాలుష్యం తగ్గకపోవచ్చు. ఢిల్లీలోని వివిధ మానిటరింగ్ స్టేషన్ల రియల్‌టైమ్ వాయు నాణ్యతను చూపే సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సిపిసిబి) ప్రమాణాల ప్రకారం గాలి నాణ్యత ఏఐక్యూ 0–50 మధ్య ఉండాలి. 51–100 మధ్య ఉంటే సంతృప్తికరం. 101–200ని మోస్తరుగా పేర్కొంటారు. 201–300 మధ్య ఉంటే కాలుష్యం దారుణంగా ఉందని అర్థం. ఇక 301–400 మధ్య ఎక్యూఐ ఉంటే, చాలా దారుణమని భావించాలి. 401–500 మధ్య సూచీ అత్యంత తీవ్రతరమని సంకేతం. పూణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియాలజీకి చెందిన డిసిషన్ సపోర్ట్ సిస్టమ్ (డిఎస్ఎస్) అంచనాల ప్రకారం, ఢిల్లీలో వాయు కాలుష్యానికి వాహనాలు 21.6 శాతం కారణమైతే, పంట అవశేషాల దహనం వల్ల ఏర్పడే కాలుష్యం 0.8 శాతం మాత్రమే. ఇలావుంటే, ఈ శీతాకాలంలో ఢిల్లీలో వాయు నాణ్యత చాలా దారుణంగా మారుతూ, తీవ్రం స్థాయిల్లోకి జారిపోతున్నది. దీనిని దృష్టిలో ఉంచుకొని, కాలుష్యంతో సంబంధం ఉన్న ఆరోగ్య క్షీణతను ముందుగానే గుర్తించడానికి నియమిత పరీక్షలు అత్యవసరమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ముఖ్యంగా పొగతాగేవారు, ఆస్తమా రోగులు, పిల్లలు, అలాగే గుండె లేదా శ్వాస సంబంధిత వ్యాధులు ఉన్నవారు అత్యంత జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. వైద్య నిపుణుల ప్రకారం, విషపూరిత వాయు శ్వాసనాళాల్లో వాపు కలిగించడం, ఊపిరితిత్తుల పనితీరును తగ్గించడం, ఇప్పటికే ఉన్న వ్యాధులను మరింత తీవ్రం చేయడం వంటి సమస్యలు సృష్టిస్తాయి. కాబట్టి ముందుగానే ఆరోగ్య పరీక్షలు మరింత కీలకమవుతున్నాయి. దీర్ఘకాలిక శ్వాస ఇబ్బందులతో బాధపడుతున్న రోగులకు దీర్ఘకాలిక మంటలు లేదా ఊపిరితిత్తుల నిర్మాణ మార్పులను గుర్తించేందుకు ఛాతీ ఎక్స్‌రే సూచించవచ్చు. ప్రధాన లక్షణాలు కనిపించే ముందే శ్వాసనాళాల్లో మంటను గుర్తించగల 'ఫ్రాక్షనల్ ఎక్స్‌హేల్ నైట్రిక్ ఆక్సైడ్' వంటి ఆధునిక పరీక్షలకు డిమాండ్ పెరుగుతోంది. బహిరంగ ప్రదేశాల్లో పనిచేసేవారు, ట్రాఫిక్ సిబ్బంది, రోజువారీ ప్రయాణికులు తరచుగా వాయు కాలుష్యానికి గురవుతారు. ఇలాంటి వారంతా తమ ఊపిరితిత్తుల పనితీరుకు సంబంధించిన స్పిరోమెట్రీ ప్రొఫైల్‌ను ఒకసారి చేయించుకోవాలని, ఆరు నెలలకు ఒకసారి వాటిని పునరావృత పరీక్షలు చేయించుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అలసట లేదా ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది అనుభవించే వారికి పల్స్ ఆక్సిమెట్రీ ద్వారా ఆక్సిజన్ శాతాన్ని పర్యవేక్షించడం ఉపయోగకరమని చెప్తున్నారు. కాలుష్యానికి దీర్ఘకాలికంగా గురయ్యే వారికి వార్షిక ఛాతీ పరీక్ష కూడా సిఫార్సు చేసే అవకాశం ఉందని వైద్య నిపుణులు అంటున్నారు.





# జనరల్

STATE & REGIONAL NEWS

## జనరల్ స్థానాల్లో బిసిలను నిలబెట్టి అగ్రకులాలను ఓడిస్తాం

బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాల్‌రాజ్‌గౌడ్

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** గ్రామపంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో బిసిలు పోటీ చేసి, అగ్రకులాలను ఓడించాలని తెలంగాణ బిసి పొలిటికల్ ఫ్రంట్ పిలుపునిచ్చింది. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్లో గురువారం ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్‌తో కలసి ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిసిల వంచనకు పాల్పడిందని ఆరోపించారు. బిసి రిజర్వేషన్లపై హైకోర్టులో కేసు పెండింగ్ ఉండగానే జిఒ 46 తీసుకొచ్చి, సర్పంచ్ ఎన్నికలు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. బిసిల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిరసనగా కాంగ్రెస్, బిజెపి, బిఆర్‌ఎస్ బిసి ప్రజా ప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫ్రంట్ నేతలు అంబాల నారాయణ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

### ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీపై...

## బిఆర్‌ఎస్, బిజెపి అసత్య ప్రచారం

ప్రభుత్వం ఏ పని చేసినా ప్రతిపక్షాలు బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నాయి

గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వం ఏ మంచి పని చేసినా, ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా ప్రతిపక్ష పార్టీలు రాద్ధాంతం చేస్తూ బురద చల్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయని, అందులో భాగంగానే ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీపై బిఆర్‌ఎస్, బిజెపి అసత్య ప్రచారం చేస్తున్నాయని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీలో ఎలాంటి కుంభకోణానికి ఆస్కారమే లేదని, పాలసీ అత్యంత పారదర్శకమైన పాలసీ అని, హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా చేయడమే పాలసీ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీ అర్థం కాలేదని, వారు పాలసీని పూర్తిగా అర్థం చేసుకుంటే బాగుంటుందని సూచించారు. గాంధీభవన్‌లో గురువారం మంత్రులతో ముఖాముఖీ కార్యక్రమంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. అనేక ఫిర్యాదులపై ఆయన అధికారులతో మాట్లాడారు.

అనంతరం గాంధీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రతిపక్షాలు కావాలనే ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని, ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీలో ఎలాంటి అవినీతి జరగలేదని వారికి కూడా తెలుసునని, కానీ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులతో ప్రజల్లో స్పందన వస్తుండడంతో తట్టుకోలేక ఇలా దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగరాన్ని కాలుష్య రహితంగా మార్చేందుకు పరిశ్రమలను ఓఆర్‌ఆర్ బయటకు పంపాలనే డిమాండ్ ఉందని, ఇది కొత్త డిమాండ్ కాదన్నారు. పైగా ఈ పాలసీని కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చింది కాదని, గతంలో కూడా ఈ పాలసీ ఉందని, దీనిని కాంగ్రెస్ ప్రభుత్వమే కొత్తగా తెచ్చిన పాలసీ మాదిరిగా ప్రతిపక్ష పార్టీలు గొడవ చేస్తున్నాయని విమర్శించారు.

బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో కూడా ఈ పాలసీపై చర్చ జరిగిందన్నారు. బిఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే ఈ విధానాన్ని మారుస్తామని అంటున్నారని, ఆ పార్టీ అధికారంలోకి వచ్చేదిలేదని, పాలసీని మార్చేదిలేదని అని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఇండస్ట్రియల్ పాలసీ రూపకల్పనలో తాను భాగంగా ఉన్నానని, కొత్త ఇండస్ట్రియల్ ల్యాండ్ పాలసీతో రాష్ట్రానికి అదనపు ఆదాయం వస్తుందని మంత్రి చెప్పారు.

### హైదరాబాద్ బుక్ ఫెయిర్ - 2025కి

## ప్రభుత్వం పూర్తి సహకారం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని ఎన్‌టిఆర్ స్టేడియంలో ప్రతి సంవత్సరం చాలా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'హైదరాబాద్ బుక్ ఫెయిర్ – 2025' సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ బుక్ ఫెయిర్ 2025కి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందన్నారు. ముఖ్యంగా, రాష్ట్రంలోని ప్రముఖ సాహితీవేత్తలు, నూతన రచయితలను ప్రోత్సహించేందుకు ప్రదర్శనలో వారికి ప్రత్యేక స్టాళ్లను ఉచితంగా కేటాయించాలని నిర్వాహక కమిటీని కోరారు. పూర్వకాలపు సాహితీవేత్తలు రచించిన సమాజ హిత పుస్తకాలను సేకరించాలని బుక్ నిర్వాహకులకు మంత్రి జూపల్లి కృష్ణారావు సూచించారు. వీటిని ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.కోటి వెచ్చించి అటువంటి పుస్తకాలను కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆనాటి మహానుభావులు రచించిన పుస్తకాలను ప్రతి గ్రామంలో, గ్రామపంచాయతీలో, మహిళా పంచాయతీల్లో, గిరిజన ప్రాంతాల్లో ఈ పుస్తకాలను అందుబాటు ఉంచేలా ప్రయత్నం చేయాలన్నారు. గత సంవత్సరం కంటే ఈ సారి స్టాళ్లను అదనంగా ఏర్పాటు చేయనున్నట్లు, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రచురణకర్తలు పాల్గొంటారని, బుక్ ఫెయిర్ మహోత్సవం డిసెంబర్ 19 నుంచి 29 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు యాకూబ్, ప్రధాన కార్యదర్శి ఆర్.వాసు, ఉపాధ్యక్షుడు బాల్ రెడ్డి, కోశాధికారి నారాయణరెడ్డి, శ్రీనివాస్, దినకర్, జర్నలిస్ట్ ఆజామ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లను తగ్గించి బిసిల గొంతు కోసిందే బిఆర్‌ఎస్

మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రభుత్వం 17 శాతానికి తగ్గించిందని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. 2014లో జరిగిన స్థానిక ఎన్నికల్లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే, 2019లో బిఆర్‌ఎస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను 22 శాతానికి తగ్గించి, బిసిల గొంతు కోసిందని ఆరోపించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క మీడియాతో మాట్లాడుతూ కులగణనలో బిఆర్‌ఎస్ పాల్గొనలేదని, బిసి రిజర్వేషన్లు నిలిచిపోవాలని కోర్టుల్లో అడ్డంకులను సృష్టించిందన్నారు. బిసి రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పోరాటం ఆగబోదని, కేంద్రంపై మరింత ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితోనే కుల గణన, రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తి చేసిందన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం సర్పంచ్ రిజర్వేషన్లకు మండలం యూనిట్‌గా, వార్డు సభ్యుల రిజర్వేషన్లకు గ్రామ పంచాయతీ యూనిట్‌గా పరిగణలోకి తీసుకున్నామని వివరించారు.

కుల గణనను పూర్తి చేసి, అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి, సుప్రీం కోర్టు ఆదేశాల ప్రకారం డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేశామని, ఆ కమిషన్ నివేదిక ఆధారంగానే రిజర్వేషన్లను ఖరారయ్యాయని వివరించారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలను అనుసరించి 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తప్పనిసరిగా పాటించాల్సి వచ్చిందన్నారు. కొన్ని మండలాల్లో ఎస్‌సి, ఎస్‌టి జనాభా అధికంగా ఉండటంతో ఆ పరిమితిని దాటి పోకుండా ఉండేందుకు బిసి రిజర్వేషన్లలో కొంత మార్పు జరిగినట్లు స్పష్టం చేశారు.

**'పిసా చట్టం.. సుప్రీం మార్గదర్శకాల ప్రకారమే' గిరిజనులకు రిజర్వేషన్లు**

భద్రాచలం, ములుగు, ఆదిలాబాద్ వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో పిసా చట్టం, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జనాభా ప్రాతిపదికన 100 శాతం గిరిజనులకు రిజర్వేషన్ల కేటాయించారని, ఇది రాజ్యాంగ బద్ధమైన హక్కు అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. బిఆర్‌ఎస్ నాయకులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య విభేదాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని సీతక్క మండిపడ్డారు. తమిళనాడులో 1981లో బిసిల రిజర్వేషన్ల పెంపు ప్రక్రియ ప్రారంభమైతే, 1992లో రిజర్వేషన్లు పెరిగాయని గుర్తు చేశారు.

## బిసిలను ధోకా చేసిన ప్రభుత్వం

విద్యార్థుల నిరసన ప్రదర్శనలో ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్ల అంశంలో బిసిలను నమ్మించి దోకా చేసిందని బిసి జెఎసి చైర్మన్, ఎంపి ఆర్.కృష్ణయ్య విమర్శించారు. బిసిలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హామీనిచ్చి, ఏకపక్షంగా జిఒ 46 తెచ్చి 23 శాతం రిజర్వేషన్లు కల్పించి, అమలు చేయడంలో 17 శాతానికి కుదించడం తీవ్ర అన్యాయమన్నారు. పంచాయతీ ఎన్నికలను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ బిసి జెఎసి ఆధ్వర్యంలో నిజాం కాలేజీ నుంచి లోయర్‌ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వరకు వందలాది మంది విద్యార్థులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనకు రాష్ట్ర బిసి విద్యార్థి సంఘం కన్వీనర్ మోదీ రాందేవ్, బిసి యువజన సంఘం అధ్యక్షులు అంజి నేతృత్వం వహించగా, ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య పాల్గొన్నారు. బిసి రిజర్వేషన్లపై జీఓ 9 అమలులో ఉన్నా, హైకోర్టులో కేసు ఉన్నా ప్రభుత్వం ఎన్నికలకు ఎలా వెళ్తుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బిసి నేతలు నీలం వెంకటేశ్, ర్యాగ అరుణ్‌కుమార్, కొండా దేవయ్య, భూమన్న, జి.అనంతయ్య, పగిళ్ల సతీశ్, నిఖిల్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.



## బిసిలను నట్టేట ముంచిన రాష్ట్ర ప్రభుత్వం

మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ధ్వజం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం బిసిలను నమ్మించి గొంతు కోసిందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ధ్వజమెత్తారు. బిసిలకు 42శాతం రిజర్వేషన్లపై రెండేళ్లుగా కాలయాపన చేసి, చివరికి బిసిలకు పంచాయతీ ఎన్నికల్లో 23శాతం వరకు రిజర్వేషన్లను తగ్గించి నట్టేటా ముంచిందని విమర్శించారు. ఈ మేరకు గురువారం తెలంగాణ బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వేముల రామకృష్ణ, తెలంగాణ ప్రజాప్రతినిధుల ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద అమరవీరుల స్థూపం వద్ద వందలాదిమంది విద్యార్థులు, బిసి నేతలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జీవో 46 అమలుతో బిసిలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పంచాయతీ ఎన్నికలు తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 12,735 గ్రామ పంచాయతీల్లో కేవలం 2,176 స్థానాల్లోనే బిసిలకు రిజర్వేషన్లు కల్పించారన్నారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలన్నారు. బిసి రిజర్వేషన్ల అంశంపై రానున్న పార్లమెంట్ సమావేశాలను స్తంభింపజేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, తెలంగాణ ప్రజా ప్రతినిధుల ఫోరం యాదయ్య, రాజు, కుమార్ రవి, జగదీష్, ప్రవీణ్ ,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రాన్ని గట్టిగా కోరండి

కేరళ సమస్యల తక్షణ పరిష్కారానికి ముఖ్యమంత్రి పినరయి విజయన్

ఆన్‌లైన్ సమావేశంలో దక్షిణ రాష్ట్రాల ఎంపిలను కోరిన సిఎం



**తిరువనంతపురం :** వన్యప్రాణుల సంరక్షణ చట్టానికి సవరణల ఆమోదం, వాయనాడ్ కొండచరియలు విరిగిపడిన ప్రాంతానికి పునరావాసానికి మరింత ఆర్థిక సహాయం అందించడం వంటి వివిధ అంశాలను కేంద్ర ప్రభుత్వం వద్ద ప్రస్తావించాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దక్షిణ రాష్ట్రాలకు చెందిన పార్లమెంట్ సభ్యులను కోరారు. జంతువుల దాడులను నిరోధించడానికి సంబంధించి వివిధ అడ్డంకులను తగ్గించడానికి రాష్ట్ర శాసనసభ కేంద్ర చట్టమైన వన్యప్రాణుల రక్షణ చట్టానికి సవరణలు చేసిందని ఆయన గురువారం ఇక్కడ పార్లమెంట్ సభ్యులు, రాష్ట్ర మంత్రుల ఆన్‌లైన్ సమావేశంలో చెప్పారు. సవరణలను అమలులోకి తీసుకురావాలంటే రాష్ట్రపతి ఆమోదం అవసరమని, దానిని సాధించడానికి ఎంపిలు కలిసికట్టుగా కృషిచేసి సాధించాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి పినరయి విజయన్ కార్యాలయం విడుదల చేసిన ఒక ప్రకటన తెలియజేసింది. మానవ వన్యప్రాణుల సంఘర్షణను తగ్గించడానికి కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కింద రూ.620 కోట్ల ప్రత్యేక సహాయం అందించేలా కేంద్రంపై వత్తిడి పెంచాలని సమావేశంలో సిఎం పినరయి విజయన్ ఎంపిలను కోరారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద కేంద్రం తన వాటాను పెంచాలని, ఈ పథకం కింద నిర్మించే ఇళ్లకు బ్రాండింగ్ అవసరాన్ని మాఫీచేయాలని ఆయన వారిని కోరారు. వాయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల పునర్నిర్మాణానికి రూ.2,221.03కోట్ల సహాయాన్ని కోరగా, కేంద్రం రూ.260.56 కోట్లు మాత్రమే ఇచ్చిందని, రాష్ట్రానికి అవసరమైన ఆర్థిక సహాయం అందించడానికి కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావాలని పార్లమెంట్ సభ్యులకు ముఖ్యమంత్రి సూచించారు. వీటితోపాటు. రాష్ట్ర రుణ పరిమితిని 3.5శాతానికి పెంచడం, 202425 మరియు 202526లో కేరళ రుణ పరిమితి నుంచి కేంద్రం తగ్గించిన మొత్తాలను పునరుద్ధరించడం, జిఎస్‌టి సంస్కరణల కారణంగా రాష్ట్రానికి జరిగిన నష్టాలకు జిఎస్‌టి పరిహారం అందించడం వంటి అంశాలను కూడా ప్రస్తావించాలని ముఖ్యమంత్రి విజయన్ ఎంపిలను కోరారు.

## పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి

తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ




**ప్రజాపక్షం/హైదారబాద్:** రాష్ట్ర ప్రభుత్వం తాజా మాజీ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. బిల్లులు రాక అనేకమంది సర్పంచ్‌లు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వెంటనే బిల్లులు విడుదల చేసేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ సుధాకర్‌కి గురువారం వినతి పత్రం అంద చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల అంశంపై గత ఆరు నెలల కింద మానవ హక్కుల కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని, ఆ ఫిర్యాదు ఆధారంగా గురువారం విచారణ ఉన్నందున సర్పంచులు అందరూ హాజరు అయ్యామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుంటి మధుసూదన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంపాక నాగయ్య , ఉపాధ్యక్షుడు కేశ బోయిన మల్లయ్య, సముద్రాల రమేష్, నడికుడ రవీందర్రావు, వెంకటరామిరెడ్డి, పాండురంగారెడ్డి, బస్మాపురం సప్న, అంజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లో గెలుపు,ఓటములు సహజం

కెటి.రామారావు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎన్‌టి రామారావు లాంటి మహానాయకులే కల్వకుర్తిలో ఓడిపోయారని, రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. రానున్న రోజుల్లో బిఆర్‌ఎస్ సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలను నియమించనున్నట్టు వెల్లడించారు.సిఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా కాకుండా కేవలం రియల్ ఎస్టేట్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు బిజెపి, కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంఎల్‌ఎ జైపాల్ యాదవ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో గురువారం బిఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సంద ర్భంగా కెటిఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతి, హామీల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ఈ విషయమై కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రజల పక్షాన బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయాలని సూచించారు.

## పాలసీల పేరుతో స్కాములు చేస్తున్నారు

బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోనికి వచ్చిన తర్వాత ప్రజలు చిత్ర, విచిత్రాలు చూడాల్సిన పరిస్థితి వస్తుందని, పాలసీల పేరుతో స్కాములు చేస్తున్నారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. 10వేల ఎకరాల విలువైన భూములను కారుచౌకగా సిఎం రేవంత్‌రెడ్డి తన ఆత్మీయ బంధువులకు అప్పగించేందుకు సిద్ధమయ్యారని, దీనికి సంబంధించి త్వరలోనే ఆ వివరాలు బయటపెడతామన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే హిల్ట్ పి పాలసీ అని అన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ పెరిగిందని చెబుతూ, ఒఆర్‌ఆర్ వద్ద ఎకరం రూ.137 కోట్లు పలికిందని, హైదరాబాద్ నడిబొడ్డున ఉన్న భూములను కారు చౌకగా కట్టబెడుతున్నారని ఆరోపించారు. పారిశ్రామిక భూములను ఒక పథకం ప్రకారమే సిఎం రేవంత్ రెడ్డి తక్కువ ధరకు కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. నాచారం, బాలానగరంలో ఒక గజం స్థలానికి రూ.1,50,000లు మార్కెట్ ధర పలికితే, దీనిని రూ.10వేలకే కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. పారిశ్రామికవాడలోని భూములను ఎవరికి కేటాయించారో వారి పేర్లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్‌ఎస్ నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, అనంత్ పాల్గొన్నారు.

## కెసిఆర్ దీక్ష, అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రం

✻ మాజీ మంత్రి హరీశ్‌రావు




**ప్రజాపక్షం/సిద్దిపేట :** నవంబర్ 29 కెసిఆర్ దీక్ష ఫలితం..అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ రాష్ట్రమని మాజీ మంత్రి హరీహష్‌రావు అన్నారు. నవంబర్ 29, 2009 చరిత్ర మలుపు తిప్పిన రోజని, చారిత్రాత్మక రోజన్నారు. నవంబర్ 29 లేకుంటే డిసెంబర్ 9, జూన్ 2 లేదన్నారు. జూన్ 2 లేకుంటే తెలంగాణ రాష్ట్రం ఎక్కడిదని, రేవంత్‌రెడ్డికి సిఎం పదవి దక్కేనా అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి తెలుగుదేశం పార్టీలో చంద్రబాబు పంచన వుండేవారని హరీష్‌రావు ఎద్దేవా చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన దీక్షా దివాస్ సన్నాహాక సమావేశంలో మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతోనే సిద్దిపేట జిల్లా అయిందని, సిద్దిపేటకు గోదావరి జలాలు, రైలు, మెడికల్ కళాశాల వచ్చిందన్నారు. దేశానికి అన్నంపెట్టె ధాన్యాగారంగా తెలంగాణ మారిందన్నారు. ఆనాడు కెసిఆర్ తెలంగాణ కోసం ఆమరణ దీక్ష చేపట్టినప్పుడు సిద్దిపేట పాత బస్టాండ్ చౌరస్తాలో దీక్ష శిబిరం ఏర్పాటు చేసుకొని.. 1531 రోజులు దీక్షా శిబిరాన్ని నిరంతరంగా నిర్వహించగా. ఎందరో మేధావులు, ఉద్యమకారులు, అన్నివర్గాల నేతలు సందర్శించి సంఘీభావం ప్రకటించినట్లు తెలిపారు. కొన్ని వేల మంది దీక్ష శిబిరంలో పాలుపంచుకున్నట్లు తెలిపారు. 1531 రోజుల దీక్ష శిబిరానికి చిహ్నంగా ఫైలాన్‌ను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. మోడల్ బస్టాండ్ నిర్మాణంతో దాన్ని తొలగించారని, మళ్లీ పెడుతామంటే ఆర్టీసివారు అనుమతి ఇవ్వలేదన్నారు. తెలంగాణ ఉద్యమాల జ్ఞాపకాలకు, నిరహారదీక్షలకు చిహ్నంగా సిద్దిపేట క్యాంపు కార్యాలయం ఎదురుగా ఫైలాన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దశాబ్దాల కలను. కోట్ల మంది కలలను నిజం చేసిన గొప్ప నేత కెసిఆర్ అని ప్రశంసించారు.

**✻ 17 శాతం రిజర్వేషన్లతో బిసిలను నట్టేట ముంచిన రేవంత్‌రెడ్డి :** అబద్ధాలు చెప్పి, మాయమాటలు చెప్పి రేవంత్‌రెడ్డి గద్దెనెక్కారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఓట్ల రాజకీయం తప్ప రాష్ట్ర ప్రజల మీద శ్రద్ధ లేదన్నారు.

42శాతం బిసిలకు రిజర్వేషన్లు ఇస్తానని నమ్మబలికిన రేవంత్‌రెడ్డి బిసిలకు నట్టేట ముంచి కేవలం 17శాతానికి పరిమితం చేశారన్నారు. రాష్ట్రాన్ని సాధించిన కెసిఆర్‌కు, కాంగ్రెస్ నాయకులకు పోలిక లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్. యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫారుక్‌హుస్సేన్, వంటేరు ప్రతాప్‌రెడ్డి, వేలేటి రాధకిషన్‌శర్మ, గుండు భూపేశ్, రాజనర్సు, జంగిటి కనకరాజు, బిఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

## పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలి : డిజిపి బి.శివధర్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి ఆదేశించారు. ఎన్నికల నిర్వహణపై గురువారం డిజిపి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.హైదరాబాద్ కమిషనరేట్ మినహా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్‌పిలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి బి. శివధర్ రెడ్డి మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్‌పిలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిష్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డిజిపి మహేష్ ఎం. భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డిజిపి డి.ఎస్. చౌహాన్, మల్టి జోన్ 1 ఐ.జి.పి. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అడ్వైజర్ ఇ. రాములు పాల్గొన్నారు.




# జనరల్
STATE & REGIONAL NEWS

## బంజారాహిల్స్ డివిజన్లో రూ.3 కోట్ల అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన

ప్రజాపక్షం/హైదరాబాద్ : బంజారాహిల్స్ డివిజన్‌లో అభివృద్ధి కార్యక్రమాలకు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి శ్రీకారం చుట్టారు. సుమారు రూ.3 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేశారు. ఎన్‌బిటి నగర్, వెంగల్ రావు బిల్డింగ్, మిథిలా నిలయ ప్రాంతాల్లో చేపట్టనున్న ఈ పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు సిఎం రేవంత్ రెడ్డికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మేయర్ తన క్యాంప్ కార్యాలయంలో జిహెచ్ఎంసి, జలమండలి, టిజిసిపిడిసిఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.



# ప్రమాదకరంగా 'రైట్ వింగ్' భావజాలం



ప్రజాపక్షం/హైదరాబాద్ : అభివృద్ధి చెందిన, అభివృద్ధి చెందుతున్న దేశాల్లోనూ 'రైట్ వింగ్' భావజాలం ప్రమాదకరంగా మారుతోందని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థలకు, వాటి విలువలకు ప్రమాదకరమని, ఈ భావజాల వ్యాప్తి వల్ల ప్రమాదం పొంచి ఉందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు కలిసి పని చేద్దామని, తద్వారా యావత్ ప్రపంచం ప్రయోజనం పొందాలని తాము ఆశిస్తున్నామని తెలిపారు.
హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో జర్మనీ ప్రతినిధులతో భట్టి విక్రమార్క గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ వివిధ దేశాల రాజకీయ పార్టీలను ఒక చోటకు చేర్చి, పురోగమన ఆలోచనా దిశలో నడిపించే కృషిని తాము అభినందిస్తున్నామని జర్మన్ ప్రతినిధులతో అన్నారు. స్వేచ్ఛ, న్యాయం, ఐక్యత అనే సిద్ధాంతాలతో నడిచే సోషియల్ డెమోక్రటిక్ పార్టీ స్వతంత్ర సంస్థలా పని చేస్తూ, ప్రపంచంలోని పలు రాజకీయ పార్టీలతో కలిసి ప్రోగ్రెసివ్ ఆలోచనను ముందుకు తీసుకెళ్లడం చాలా అభినందనీయమన్నారు. సోషియల్ డెమోక్రటిక్ పార్టీకి 160 ఏళ్ల చరిత్ర ఉన్నదని, తమ కాంగ్రెస్ పార్టీకి కూడా వందేళ్ల చరిత్ర ఉన్నదని వివరించారు. భారతదేశానికి స్వాతంత్రాన్ని తీసుకురావడంతో పాటు దేశ నిర్మాణంలో అత్యంత కీలకంగా నిలిచిన కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిమని ఆయన చెప్పారు.
లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దేశం, ప్రపంచ వ్యాప్తంగా ప్రోగ్రెసివ్ భావజాల వ్యాప్తికి కృషి చేస్తున్నారని,రాహుల్ గాంధీ మార్గ దర్శకత్వంలో ఇటీవల హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్‌ను విజయవంతంగా నిర్వహించామని, ఇందులో 100కు పైగా దేశాలు పాల్గొని, ప్రోగ్రెసివ్ ఆలోచనలు, పేదరిక నిర్మూలన వంటి అంశాలపై విస్తృత చర్చలు చేశామని వివరించారు.

**ప్రజాస్వామ్య విలువలకు రైట్ వింగ్ విఘాతం**

రైట్ వింగ్ భావజాలం వల్ల ప్రజాస్వామ్య విలువలకు విఘాతం కలిగిస్తోందని, విద్వేశ భావం ప్రభలుతోందని, స్వేచ్ఛగా అభిప్రాయాలను పంచకోకుండా, బలవతంగా వారి అభిప్రాయాలను, భావాలను ప్రజలపై రుద్దే ప్రయత్నం పెద్ద ఎత్తున జరుగుతోందని భట్టి విక్రమార్క అన్నారు.
ఈ సమావేశంలో రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, మల్లు రవి, బలరామ్ నాయక్, సురేష్ షెట్కార్, జర్మనీకి చెందిన ఫ్రెడ్రిచ్ ఈబర్ట్ స్టిఫ్టింగ్ సంస్థకు చెందిన ప్రతినిధులు డాక్టర్ సబీనా, మిక్రో గ్యాంథర్, క్రిస్టోఫస్, మాండ్వి కులక్షేత్ర, అనురాగ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

### భారతదేశ ఉగ్రవాద వ్యతిరేక, నిరోధక వ్యూహంలో...

# ఆపరేషన్ సిందూర్ విజయం ఒక 'నిర్వచనీయ క్షణం'

రాష్ట్రపతి ద్రౌపదిముర్ము
చాణక్య డిఫెన్స్ డైలాగ్ మూడవ ఎడిషన్ ప్రారంభ సమావేశంలో కీలక ప్రసంగం



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ విజయం దేశ ఉగ్రవాద వ్యతిరేక నిరోధక వ్యూహంలో 'నిర్వచనీయ క్షణం'గా నిలుస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. భారతదేశం సైనిక సామర్థ్యాన్ని మాత్రమే కాకుండా శాంతి సాధనలో దృఢంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించడానికి దాని 'నైతిక స్పష్టతను కూడా ప్రపంచం గమనించింది' అని నొక్కిచెప్పారు. గురువారం ఇక్కడ ఆర్మీ నిర్వహించిన చాణక్య డిఫెన్స్ డైలాగ్ మూడవ ఎడిషన్ కీలక ప్రారంభ సమావేశంలో ముర్ము ప్రసంగించారు. భారతదేశ నాగరికత నీతి 'వసుదైవ కుటుంబ' ద్వారా మార్గనిర్దేశం చేయబడి వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి ప్రపంచ బాధ్యతతో కలిసి ఉండగలదని మేం నిరూపించాం' అని ఆమె ఉద్ఘాటించారు. 'మా దౌత్యం, మా ఆర్థిక వ్యవస్థ, మా సాయుధ దళాలు కలిసి శాంతిన కోరుకునే భారతదేశాన్ని ప్రదర్శిస్తాయి. కానీ దాని సరిహద్దులను, దాని పౌరులను బలం, దృఢ నిశ్చయంతో రక్షించడానికి సిద్ధంగా ఉన్నాం' అని ముర్ము తెలిపారు. భారతదేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడంలో భారత సాయుధ దళాలు వృత్తి నైపుణ్యం, దేశ భక్తిని ప్రదర్శించాయని రాష్ట్రపతి నొక్కిచెప్పారు. సాంప్రదాయ, ప్రతి తిరుగుబాటు లేదా మానవతావాద భద్రతా సవాల్ సమయంలో మన దళాలు అద్భుతమైన అనుకూలత, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించాయన్నారు. రాష్ట్రపతి ముర్ము తన ప్రసంగంలో పహల్గామ్ దాడి తర్వాత భారతదేశం తీసుకున్న నిర్ణయాత్మక సైనిక చర్య ఆపరేషన్ సిందూర్ గురించి గుర్తుచేసుకున్నారు. మే 7న ప్రారంభంలో భారతదేశం తన సైనిక చర్యను ప్రారంభించిందని, పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లోని బహుళ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను నాశనం చేసిందన్నారు. పాకిస్థాన్ కూడా భారతదేశంపై దాడులు ప్రారంభించిందని, భారతదేశం చేసిన అన్ని తదుపరి ప్రతిదాడులు కూడా ఆపరేషన్ సిందూర్ కిందే జరిగాయన్నారు. మే 10న సాయంత్రం ఒక అవగాహనకు వచ్చిన తర్వాత రెండు అణ్వాయుధ పొరుగుదేశాల మధ్య సైనిక వివాదం ఆగిపోయిందని వివరించారు. రాష్ట్రపతి ముర్ము తన ప్రసంగంలో 'భారత రక్షణ దళాలు దాని కార్యాచరణ పాత్రకు మించి జాతీయ అభివృద్ధికి ఒక స్తంభంగా ఉన్నాయని తెలిసి నేను సంతోషపడ్డాను. మన సరిహద్దులను బలోపేతం చేయడమే కాకుండా మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, టూరిజం, విద్య ద్వారా సరిహద్దు ప్రాంత అభివృద్ధికి కూడా వారు సహాయపడ్డారు' అని తెలియజేశారు. 'నేటి భౌగోళిక రాజకీయ దృశ్యం వేగంగా మారుతోంది' అని రాష్ట్రపతి నొక్కిచెప్పారు. మన సాయుధ దళాలు నిరంతరం ప్రయత్నిస్తాయని నమ్మకం తనకు ఉందని, 2047నాటికి వీక్షిత్ భారత్ లక్ష్యాన్ని సాధించాలనే దృఢ సంకల్పంతో రాణించి ముందుకు సాగండి అని సాయుధ దళాల సుప్రీం కమాండర్ అయిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పిలుపునిచ్చారు. ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ కూడా ఈ సందర్భంగా ప్రసంగించారు.

## 30న చలో హైదరాబాద్‌కు తరలిరండి

మందకృష్ణ మాదిగ, జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపు

ప్రజాపక్షం / ఖైరతాబాద్ : బిసి రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్, బిజెపి రాజకీయ క్రీడలు ఆపి రానున్న పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లును ఆమోదించాలని బిసి జెఎసి డిమాండ్ చేసింది. బిసి రిజర్వేషన్లు కావాలని కోరుకొనే ప్రతి బిసి ఉద్యమకారుడు ఈ నెల 30న హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద జరిగే బిసిల యుద్ధభేరిలో పాల్గొనాలని పిలుపునిచ్చింది. గురువారం హైదరాబాద్‌లోని బిసి భవన్‌లో బిసి జెఎసి ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ, బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో గతంలో ఇచ్చిన 23శాతం రిజర్వేషన్లను పెంచకుండా 17శాతానికి తగ్గించడం అన్యాయమన్నారు. చలో హైదరాబాద్‌లో ఎంఆర్‌పిఎస్ శ్రేణులు పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బిసి యుద్ధం కాంగ్రెస్‌పైనన్నారు. బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, కో-చైర్మన్ వీరస్వామి, జాతీయ, రాష్ట్ర నేతలు విక్రమ్‌గౌడ్, శ్యాం కురుమ, శేఖర్ సగర, దీటి మల్లయ్య, వీరస్వామి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఉద్యమ దిశను మార్చిన దీక్ష దినోత్సవం

మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ స్వపరిపాలన కోసం ప్రాణాలర్పణకు సిద్ధమై, ప్రాంత హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన బిఆర్‌ఎస్ అధ్యక్షుడు కె. చంద్రశేఖర్ రావు చారిత్రాత్మక నిరాహార దీక్షకు ప్రతీకగా నిలిచిన రోజు 'నవంబర్ 29, దీక్ష దినోత్సవం' అని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. దీక్ష దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం తెలంగాణ భవన్‌లో బిఆర్‌ఎస్ యువ నాయకులు ముఠా జై సింహ రూపొందించిన దీక్ష దినోత్సవ పోస్టర్‌ను ఎమ్మెల్సీ సురభి వాణి దేవీ, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌తో కలిసి తలసాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ 'తెలంగాణ వచ్చుడో కెసిఆర్ సచ్చుడో' అంటూ ఉద్యమం దిశను మార్చిన ఆ గర్జన, ఆత్మగౌరవ ఉద్యమానికి కొత్త బాటలు వేసిందన్నారు. మాజీ చైర్మన్ ఎర్రోల్లా శ్రీనివాస్, సీనియర్ బిఆర్‌ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎఐఎస్‌ఎఫ్ ఒయు నూతన కమిటీ ఎన్నిక

అధ్యక్షుడిగా ఉప్పల ఉదయ్ కమార్
కార్యదర్శిగా లెనిన్





ప్రజాపక్షం/హైదరాబాద్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్‌ఎఫ్) ఉస్మానియా విశ్వవిద్యాలయ (ఒయు) అధ్యక్షునిగా ఉప్పల ఉదయ్ కుమార్‌ను, కార్యదర్శిగా లెనిన్‌ను ఎన్నికయ్యారు. ఒయు, ఇంజనీరింగ్ కళాశాల లోని ఇసిఇ ఆడిటోరియం వద్ద ఎఐఎస్‌ఎఫ్ ఒయు 25వ మహాసభ జరిగింది. తొలుత ఎఐఎస్‌ఎఫ్ జెండాను ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. ఈ సభలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలపైన భవిష్యత్తులో చేయాల్సిన పోరాటాలపై చర్చించారు. అనంతరం మహాసభలో మొత్తం 11 మంది కౌన్సిల్ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు నాణ్యమైన ఉచిత విద్యను దూరం చేసే కుట్రలో భాగంగా ఎన్ఇపి 2020 తీసుకొచ్చిందని, పాఠ్యపుస్తకాలను చరిత్రను వక్రీకరిస్తున్నారని, ఫెలోషిప్‌లను రద్దు చేశారని మహాసభ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాష్ట్రంలో మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ విద్యారంగాన్ని సమూలంగా మార్చుతామని మ్యానిఫెస్టోలో పొందుపర్చి, ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని కూడా నియమించలేదని ఆరోపించింది. సిఎం ఇచ్చిన హామీ మేరకు విద్యార్థి కేంద్రంగా రూ వెయ్యి కోట్ల నిధులను ఉపయోగించాలని,లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని మహాసభ నాయకులు తెలిపారు.
**ఎఐఎస్‌ఎఫ్ ఒయు కౌన్సిల్ నూతన కమిటీ:** అధ్యక్షుడు ఉప్పల ఉదయ్ కుమార్, కార్యదర్శి లెనిన్,సహాయ కార్యదర్శులు ఇరుగుదిండ్ల అశ్వన్ ,భగత్, ఉపాధ్యక్షులు దొండి రామ్ ,రమేష్, కోశాధికారి ఆర్ శ్రీశైలం, కౌన్సిల్ సభ్యులు మహేష్, సుమన్, మధు, రాఘవేంద్ర .

## బిసి జాతిని పాలకులుదగా చేశారు

ధూళిపాళ ధనుంజయ నాయుడు

ప్రజాపక్షం/హైదరాబాద్ : 'బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల' బిల్లును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆమోదించకుండా బిసిలను మోసం చేసిందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రంలోని బిసి జాతిని పాలకులు నిలువునా దగా చేశారన్నారు. హైదరాబాద్,హిమాయత్‌నగర్‌లోని రాజబహద్దూర్ గౌర్ హాల్‌లో గురువారం ఆయన బిసి ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, తెలంగాణ రాష్ట్ర గీత పనివారల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డిజి. సాయిల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండ కోటయ్య పాలకూరి బాబు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దూళిపాళ ధనుంజయ మాట్లాడుతూ మాట్లాడుతూ బిసి రిజర్వేష్ల అమలు అంశంలో ప్రధాని వద్దకు అఖిలపక్ష బృందాన్ని తీసుకెళ్లి, కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు సిఎం రేవంత్ రెడ్డి చొరవ చూపలేదని ఆరోపించారు.

# నల్లచెరువులో ఆక్రమణలను హైడ్రా తొలగించలేదు

180 సర్వే నెంబరుతో 176లో
కబ్జాకు ప్రయత్నాలు
స్వయంగా ఖాళీ చేసి వెళ్లిన
చెత్త సేకరణదారులు





సక్కుబాయి లేఔట్‌లో ఆక్రమణలపై హైడ్రా విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : కూకట్‌పల్లి నల్లచెరువు చెంత ఎలాంటి ఆక్రమణలను తొలగించలేదని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో హైడ్రా స్పష్టం చేసింది. చెరువు పూర్తి స్థాయి నిటీ మట్టం పరిధిలోకి వచ్చిన సర్వే నెంబరు 176లో ఉన్న తాత్కాలిక షెడ్డులను హైడ్రా ఇప్పటికే ఖాళీ చేయించిందని, ఇంటింటికీ తిరిగి చెత్తను సేకరించిన ఆటోవాలాలు, స్క్రాప్‌ను వేరు చేసి అమ్ముకునేవారు తాత్కాలికంగా ప్లాస్టిక్ కవర్లతో వేసిన షెడ్డులను హైడ్రా ఇప్పటికే తొలగించిందని పేర్కొంది. చెరువు పరిధిలోకి వస్తున్నందున, ఖాళీ చేయాలని వారిని కోరగానే అక్కడివారు సమ్మతించి వెళ్లిపోయారని తెలిపింది. ఇదంతా కూకట్‌పల్లి నల్లచెరువు ఫుల్‌ట్యాంకు పరిధిలోకి వచ్చే సర్వే నెంబరు 176 వ్యవహారంగా తెలిపింది. చెత్తను సేకరించినవారితో పాటు, స్క్రాప్ అమ్ముకునే వారి నుంచి అద్దెలు కూడా తీసుకుని, వారిని అడ్డం పెట్టుకుని ఆ స్థలాన్ని కబ్జా చేయాలనుకునే వారు సర్వే నెంబరు 180తో ఇప్పుడు అక్కడ పేదల గుడిసెలు అని హైడ్రామా సృష్టిస్తున్నారని స్పష్టం చేసింది. అక్కడ తాత్కాలిక షెడ్డులు వేసుకున్న వారు స్వయంగా ఖాళీ చేసుకుని వెళ్లిపోగా, కొంతమందితో కలిసి కబ్జాదారులు చివరి ప్రయత్నం చేస్తున్నారని, 180 సర్వే నెంబరుతో నష్టపరిహారం కావాలని కూడా కొంత మంది హైకోర్టును ఆశ్రయించిన విషయాన్ని హైడ్రా తెలిపింది. హైడ్రా ఖాళీ చేయిస్తున్నది 176 సర్వే నెంబరులో అని కోర్టుకు వివరించినట్లు పేర్కొంది.
చెత్తను చెరువు పరిధిలోకి తీసుకువచ్చి, జలాలను కాలుష్యం చేస్తున్న విషయం కూడా కోర్టు దృష్టికి తీసుకెళ్లినట్లు హైడ్రా తెలిపింది. సర్వే నెంబరు సరిచూసుకుని వారికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించాలని హైకోర్టు సూచించడంతో, రెండు మూడు రోజుల క్రితం అక్కడ చెత్తను సేకరించేవారు స్వయంగా ఖాళీ చేసి వెళ్లి పోయారని చెప్పింది. వారి బదులు, అక్కడ స్థలాన్ని కొట్టేయాలని చూసే కబ్జాదారుల ప్రయత్నం ఈ గందరగోళం అని హైడ్రా స్పష్టం చేసింది.
జూబ్లీహిల్స్ నియోజకవర్గం, షేక్‌పేట గ్రామంలోని సక్కుబాయి లేఔట్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల ఆక్రమణలపై హైడ్రా విచారణ చేపట్టింది. సర్వేనెంబరు 327లో 25 ఎకరాల పరిధిలో సక్కుబాయి నగర్ మ్యూచ్‌వల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ సొసైటీ పేరుతో లేఔట్ వేశారు. ఇక్కడ పార్కును కాపాడాలంటూ హైడ్రా ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్ర స్థాయిలో విచారించిన హైడ్రా అధికారులకు మరిన్ని ఆక్రమణల గురించి తెలిసింది. పార్కుతో పాటు శ్మశాన వాటిక, చారిత్రక బుల్కాపూర్ నాలా ఆక్రమణలకు గురైనట్టు అధికారులు గుర్తించారు. దీంతో సర్వే నెంబరు 327లో మిగిలి ఉన్న భూమికి సంబంధించిన అంశాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని హైడ్రా కమిషనర్ ఎ.వి. రంగనాథ్ భావించారు. ఇక్కడి ఖాళీ స్థలాలపై సొసైటీకి చెందిన వారితో పాటు, షేక్‌పేట గ్రామ ప్రతినిధులతో హైడ్రా కార్యాలయంలో గురువారం హైడ్రా కమిషనర్ సమావేశమయ్యారు. ఇరు పక్షాల వాదనలు విన్నారు. సంబంధిత పత్రాలను పరిశీలించారు. సక్కుబాయి లేఔట్ వేసిన భూమి ప్రభుత్వానిదని షేక్‌పేట విలేజ్ ప్రతినిధులు సదానందం, అశోక్ కుమార్ ఆరోపించారు. పార్కు స్థలంగా పేర్కొంటున్న ప్రాంతాన్ని తాము ఆలయ ఉత్సవాలకువాడుకుంటున్నామని కమిషనర్‌కు వివరించారు. శ్మశానాన్ని కూడా వదలకుండా సొసైటీ ప్రతినిధులు కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. సొసైటీ ప్రతినిధులు కూడా ఆ భూమి తమకు ఎలా వచ్చిందో సొసైటీ సెక్రటరీ సీతారామయ్య వివరించారు. అధికారిక లేఔట్‌లోని పార్కును కాపాడాలని కోరారు. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో మరింత లోతైన విచారణ చేపట్టాలని రంగనాథ్ ఆదేశించారు. సబంధిత పత్రాలన్ని పరిశీలించి, క్షేత్ర స్థాయిలో వివిధ శాఖల అధికారుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకోవాలని హైడ్రా అదికారులకు సూచించారు. ఇరు పక్షాలకు చెందిన వారు కూడా పూర్తి వివరాలు అందజేయాలన్నారు. తర్వాత అన్ని శాఖల అధికారుల సమక్షంలో సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌తో పాటు, బిఆర్‌ఎస్ నేత మాగంటి సునీత, స్థానిక నివాసితులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## డిఆర్ఎస్ ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో 'స్టైల్ స్పెక్ట్రమ్'

ప్రజాపక్షం/హైదరాబాద్ : గుండ్ల పోచంపల్లిలోని డిఆర్‌ఎస్ ఇంటర్‌నేషనల్ స్కూల్ గురువారం 'స్టైల్ స్పెక్ట్రమ్' ను నిర్వహించింది, ఈ ప్రదర్శనలో 11,12వ తరగతుల విద్యార్థులకు ప్రత్యేక డిజైన్ ప్రాజెక్టులు ఉన్నాయి, ప్రతి ఒక్కటి సృజనాత్మకత, స్థిరత్వం, సాంస్కృతిక ప్రేరణను మిళితం చేసే విభిన్న ఇతివృత్తాలను ప్రదర్శించాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఫ్రీలాన్స్ మోడల్, డిఆర్‌ఎస్ 2016 పూర్వ విద్యార్థిని మేధా రెడ్డి పాల్గొన్నారు. విద్యార్థుల సృజనాత్మకత, ఆవిష్కరణ, ఫ్యాషన్ పట్ల మక్కువకు ప్రేక్షకులు తీవ్రంగా ఆకట్టుకున్నారని డిఆర్‌ఎస్ ఇంటర్‌నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఐ. వేణు గోపాల్ అన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కెసిఆర్ ఒఎస్‌డిని సిట్ విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మళ్లీ వేగం పుంజుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ వ్యక్తిగత సహాయకుడిగా(ఒఎస్‌డి) పనిచేసిన రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ విచారణలో అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## వృథా అవుతున్న నీటిని గుర్తించేందుకు ఆడిట్

జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు ఆడిట్ ప్రక్రియను ప్రారంభించామని జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి అన్నారు. ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో ఈ.డి. మయాంక్ మిట్టల్, ఇతర అధికారులతో కలిసి వాటర్ ఆడిట్‌పై ట్రాన్స్‌మిషన్ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పూణేకు చెందిన కన్సల్టెన్సీ ఏజెన్సీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. లెక్కలోకి రాకుండా పోతున్న నీటిని అరికట్టేందుకు ఆ సంస్థ డిపిఆర్ రూపొందించిందని ప్రతినిధులు అన్నారు. ఎం.డి. అశోక్ రెడ్డి మాట్లాడుతూ జలమండలిలో వాటర్ ఆడిట్‌ను ప్రారంభించామన్నారు. జలమండలి ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ సుదర్శన్, సిజిఎంలు బ్రిజేష్, కిరణ్ కుమార్, జిఎంలు పాల్గొన్నారు.

# గచ్చిబౌలిలో ఆర్.ఎస్. బ్రదర్స్ షోరూం శుభారంభం

ప్రత్యేక అతిథిగా హాజరైన సినీ నటి మీనాక్షి చౌదరి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆర్.ఎస్. బ్రదర్స్ మరో మైలురాయిని అధిగమించింది. తమ 16వ షోరూమ్‌ను హైదరాబాద్ గచ్చిబౌలిలో గురువారం శుభారంభం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సినీ నటి మీనాక్షి చౌదరి హాజరై షోరూంను ప్రారంభించి, అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలోని అన్ని తరాలవారి అవసరాలను ప్రతిబింబిస్తూ, వివాహ వేడుకలకు అవసరమైన కొనుగోళ్ల గమ్యంగా, సర్వాంగసుందరంగా ముస్తాబైన 16వ షోరూం శుభారంభంలో పాలుపంచుకోవడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. సంస్థ చైర్‌పర్సన్ పొట్టి వెంకటేశ్వరు మాట్లాడుతూ పి. వెంకటేశ్వర్లు, ఎస్. రాజమౌళి, టి.ప్రసాద్రావు, దివంగత పి. సత్యనారాయణ స్థాపించిన ఆర్.ఎస్. బ్రదర్స్ రిటైల్ ప్రస్థానంలో ఒక విశిష్టమైన బ్రాండ్‌గా చరిత్ర సృష్టించిందన్నారు. ఎండి ఎస్. రాజమౌళి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా విస్తరించిన సంప్రదాయాల్ని, ఫ్యాషన్లను, వస్త్రాభిరుచుల్ని మేళవించి గచ్చిబౌలి షోరూంలో కొలువుదీర్చామన్నారు.

### రెండు కాదు.. మూడు కాదు

# ఒకే 'మహా'నగరంగా భాగ్యనగర్

దేశంలోనే అతిపెద్ద నగరంగా
గ్రేటర్ హైదరాబాద్
జాతీయ, అంతర్జాతీయ
స్థాయి గుర్తింపు
ఒకే నగరం ఏర్పాటు దిశగా
ప్రభుత్వ యోచన

ప్రజాపక్షం/హైదరాబాద్ : రెండు మూడు కాదు.. ఒకే మహానగరంగా హైదరాబాద్ ఆవతరించనుంది. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోనివి, అనుకొని ఉన్న మున్సిపల్ సంస్థలను ఇప్పటికే జిహెచ్ఎంసిలో విలీనం చేసేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన విషయం తెల్సిందే. అయితే జిహెచ్ఎంసిలో విలీనం చేసిన మున్సిపల్ సంస్థలతో పాటు జిహెచ్ఎంసి ప్రాంతాలను మూడు మున్సిపల్ కార్పొరేసన్‌లుగా విభజిస్తారనే చర్చ జరుగుతుతోంది. హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు శివారు ప్రాంతాల్లో మరో నాలుగు పెద్ద కార్పొరేషన్‌లు ఏర్పాటు చేస్తుందనే ప్రచారం కొనసాగుతోంది. ఓఆర్ఆర్ పరిధిలో ఇప్పటికే విలీనానికి ఆమోదం తెలిపిన 27 మున్సిపల్ సంస్థలను జిహెచ్ఎంసిలోనే కొనసాగిస్తూ, దేశంలోనే సువిశాలమైన నగరంగా చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఒకే నగరంగా ఉండే దేశంలోనే వైశాల్యంలో అతి పెద్ద నగరంగా గ్రేటర్ హైదరాబాద్ అవతరిస్తుంది. అంతేకాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపుతో పాటు పెట్టుబడులకు కేంద్ర బింధువుగా మారేందుకు అవకాశం లభిస్తుంది. అంతేకాకుండా రియల్ ఎస్టేట్ వ్యాపార రంగం కూడా ఊపందుకునే అవకాశం ఉంటుందనే యోచనలో ప్రభుత్వం సమలోచనలు జరుపుతున్నట్లు సమాచారం.


**విలీన ప్రక్రియపై సుదీర్ఘ కసరత్తు..**

మహానగరంలో శివారు మున్సిపల్ సంస్థల విలీనంపై అధికార యంత్రాంగం సుదీర్ఘ కసరత్తు ప్రారంభించింది. నగర శివారు ప్రాంతాల్లోని 27 మున్సిపల్ సంస్థలను విలీనం చేసేందుకు కేబినెట్, జిహెచ్ఎంసి పాలకమండలి ఆమోదం తెలిపిన మరుసటి రోజు నుంచి ఈ ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు. మర్రి చెన్నా రెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ(ఎంసిహెచ్ఆర్‌డి)లో బుధవారం, గురువారం ఈ విలీన ప్రక్రియపై సుదీర్ఘంగా సమలోచనలు జరిపారు. శుక్రవారం కూడా అధికారులు భేటీ కానున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఏకదాటిన భేటీలు కొనసాగుతున్నాయి. జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.బి.కర్ణన్ సారధ్యంలో జిహెచ్ఎంసి పట్టణ ప్రణాళిక విభాగం చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్ నేతృత్వంలో ఈ భారీ కసరత్తు చేపట్టారు. టౌన్‌ప్లానింగ్ విభాగం వివిధ స్థాయిలో అధికారులతో పాటు శివారు మున్సిపల్ సంస్థల అధికారులు సైతం ఈ భేటీకి హాజరైనట్లు తెలిసింది.

### ప్రకటనలు, నేమ్ బోర్డుల.. అనుమతులు మరింత సులభతరం

జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్

ప్రజాపక్షం/హైదరాబాద్ : వాణిజ్య, వ్యాపార సంస్థలకు సంబంధించిన ప్రకటనలు, నేమ్ బోర్డుల అనుమతుల జారీ ఇకపై మరింత సులభంగా, వేగవంతంగా జరగనున్నాయి. అనుమతుల ప్రక్రియను వికేంద్రీకరించే దిశగా మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) కీలక నిర్ణయం తీసుకుంది. అనుమతుల కోసం దరఖాస్తులను తప్పనిసరిగా అధికారిక ఆన్‌లైన్ పోర్టల్ advt.ghmc.gov.in ద్వారా మాత్రమే సమర్పించాలని జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రైవేట్ వర్సిటీల పాలన, పర్యవేక్షణపై దర్యాప్తు

**న్యూఢిల్లీ:** ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు, పరిపాలన, నిధులకు సంబంధించి యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) పర్యవేక్షణపై దర్యాప్తు చేపట్టాలని సుప్రీంకోర్టు గురువారం ఆదేశించింది. అన్ని ప్రైవేట్, ప్రభుత్వేతర, డీమ్డ్ టు బి యూనివర్సిటీల స్థాపనకు దారితీసిన చట్టాలు, నిబంధనలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివరాలను అందించాల్సిందిగా జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా నేతృత్వంలోని ధర్మాసనం కోరింది. ప్రైవేట్ యూనివర్సిటీలు 'లాభాపేక్షతో సంబంధం లేదు' అనే ప్రాతిపదికన పనిచేస్తామని హామీ నెరవేర్చడానికి తీసుకున్న చర్యలను బహిర్గతం చేయాలని కేంద్రం, రాష్ట్రాలు, యూజీసీలను ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 8కి వాయిదా వేసింది. అయేషా జైన్ అనే విద్యార్థి అమిటీ యూనివర్సిటీపై దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులు జారీ చేసింది. అవసరమైన అన్ని పత్రాలు సమర్పించినప్పటికీ యూనివర్సిటీ తన జాబితాలో పేరుమార్పు కోసం చేసిన అభ్యర్థనను తిరస్కరించిందని అయేషా జైన్ పిటిషన్‌లో పేర్కొన్నారు.

### అక్రమ వలసదారుల అంశంపై
## ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు

**బిజెపిపై కాంగ్రెస్ ధ్వజం.. గత 11 ఏళ్లలో చర్య తీసుకోలేకపోయిందని విమర్శ**



**రాయ్‌పూర్:** అక్రమ వలసదారుల అంశంపై ప్రజలను బిజెపి తప్పుదారి పట్టిస్తున్నదని కాంగ్రెస్ ఆరోపించింది. గత 11 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ వారిపై ఏ స్పష్టమైన చర్యలూ తీసుకోలేదని ఛత్తీస్‌గఢ్‌కు కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా కూడా వ్యవహరిస్తున్న సీనియర్ నేత సచిన్ పైలట్ గురువారం బస్తర్ జిల్లా కేంద్రం జగ్దల్‌పూర్‌లో మీడియాతో మాట్లాడుతూ విమర్శించారు. బిజెపి మాటల్లో చెప్పేది ఒకటి.. చేతల్లో చూపే ది మరొకటని వ్యాఖ్యానించారు. దశాబ్దకాలంగా ఎంతమంది అక్రమ వలసదారులను గుర్తించి, దేశం బయటకి పంపించారో కేంద్ర ప్రభుత్వం వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. అక్రమ వలసదారులు ఎవరున్నా, ఎక్కడున్నా వారికి ఇక్కడ ఉండటానికి హక్కు లేదని, ఇక్కడ అక్రమంగా నివసించే వారిపై తప్పనిసరిగా చర్య తీసుకోవాల్సిందేనని, అందుకు తాము కూడా పూర్తిగా మద్దతు ఇస్తామని పైలట్ అన్నారు. కానీ 11 ఏళ్లుగా బిజెపి ప్రసంగాల్లో మాత్రమే అక్రమ వలసదారుల అంశాన్ని ప్రస్తావిస్తూ, ప్రజలను మభ్యపెడుతోంది. 'అస్సాంలో బిజెపి ప్రభుత్వం ఉంది. అక్కడ ఎంతమంది అక్రమ వలసదారులపై చర్య తీసుకున్నారో డేటా చూపాలి' అని ఆయన నిలదీశారు. కాంగ్రెస్ అక్రమ వలసదారుల పక్షంలో ఉందని తప్పుడు ప్రచారం చేస్తూ, ఎన్నికల సమయంలో ప్రజలను మోసగించే గిమ్మిక్కులకు బిజెపి పాల్పడుతున్నదని అన్నారు. ఇది ఎన్నికల సమయంలో ప్రజలను మోసగించడానికి ఉపయోగించే గిమ్మిక్ మాత్రమే, అని పైలట్ అన్నారు. దేశవ్యాప్తంగా న్యాయ-సమత అంశాలపై చర్చించడానికి ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం నుంచి బిజెపి సమ్మేళనం జరుగుతున్నప్పటికీ, రాష్ట్రంలో జరుగుతున్న నేరాలపై ఎవరూ బాధ్యత తీసుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఛత్తీస్‌గఢ్‌లో దోపిడీ, దుర్వినియోగాలు, మహిళలపై నేరాలు జరుగుతున్నాయని, కానీ ఎవ్వరూ బాధ్యత వహించడం లేదని పైలట్ అన్నారు. ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) జరుగుతున్న సందర్భంలో, కాంగ్రెస్ ఇచ్చిన ఆధారాలు, పత్రాలపై చర్య ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. 'బిహార్ ఓటర్ జాబితా నుండి లక్షల మంది పేర్లు ఎలా మాయమయ్యాయి? రాహుల్ గాంధీ ఓటర్ల పేర్ల తొలగింపునకు సంబంధించిన సాక్ష్యాలను చూపిస్తూ పత్రికా సమావేశాన్ని కూడా ఏర్పాటు చేశారు. దురదృష్టవశాత్తూ ఇసి కనీసం విచారణకైనా ఆదేశించలేదు' అని ఆయన అన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాలని డిమాండ్ చేశారు. దళితులు, ఆదివాసీలు, పేదలు, వెనుకబడిన వర్గాల నిజమైన ఓటర్లు బిజెపి లక్ష్యంగా మారవచ్చని కాంగ్రెస్ ఆందోళన వ్యక్తం చేస్తోందని పైలట్ అన్నారు. 'ఈ దేశంలో ఒక్క నిజమైన ఓటరునైనా బయటకు నెట్టివేయడానికి వీల్లేదు. న్యాయం కోసం గళం మేము ఎత్తేందుకు సిద్ధంగా ఉన్నాం' అని పైలట్ హామీ ఇచ్చారు. 'అక్రమ వలసదారులు' లేదా 'ఇన్‌ఫిల్ట్రేటర్స్' అనే పదాన్ని బిజెపి పదే పదే ఉపయోగిస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నదని అంటూ, సమాచారం ఉన్నప్పుడు ఎందుకు చర్య తీసుకోవడం లేదని నిలదీశారు. ఛత్తీస్‌గఢ్‌లో పేద, వెనుకబడిన వర్గాల వారు చాలా మంది ఉన్నారని, వారంతా అక్రమ వలసదారులా అని ప్రశ్నించారు. రేషను పంటలు వేస్తూ, కోతలు కోస్తూ తీరిక లేకుండా ఉంటారని, అలాంటప్పుడు డాక్యుమెంట్లు సేకరించడానికి వారికి సమయం ఎక్కడ ఉంటుందని అడిగారు. వారంతా అక్రమంగా ఈ దేశంలోకి చొరబడినవారిగా ఎలా నిర్ధారిస్తారో తెలియడంలేదన్నారు. టాప్ మావోయిస్టు కమాండర్ హిడ్మా ఎన్‌కౌంటర్‌పై కాంగ్రెస్ వైఖరిని గురించి అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, కాంగ్రెస్‌కు అతి దీర్ఘకాలిక తీవ్రవాద వ్యతిరేక చరిత్ర ఉందని పైలట్ అన్నారు. 'స్వాతంత్ర్యానికి ముందే, కాంగ్రెస్ దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వానికి ప్రాధాన్యం ఇచ్చింది. తీవ్రవాదం ముందు మేమెప్పుడూ తలవంచలేదు. నక్సలిజం, తీవ్రవాదం, వేర్పాటువాదం ఎదురువచ్చినా మేము ఎదుర్కొని ఓడించాం' అన్నారు.

## ఆధార్ పౌరసత్వానికి ఆధారం కాదు'సుప్రీం'



**న్యూఢిల్లీ:** చొరబాటుదారులు ఆధార్ కార్డులు సంపాదించడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తంచేసింది. పౌరులు కానివారు ఆధార్ కలిగిఉంటే... వారికి ఓటు హక్కు కూడా ఇచ్చేయాలా అని ప్రశ్నించింది. ఓటర్ల జాబితాలకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)పై వివాదాలలో భాగంగా అత్యున్నత న్యాయస్థానం గురువారం ఈ వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో 'ఎస్ఐఆర్' కసరత్తును ఎన్నికల సంఘం (ఈసీ) నిర్వహించడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం విచారణ చేపట్టింది. పౌరసత్వానికి ఆధార్ రుజువు కాదని స్పష్టం చేసింది. 'ఆధార్ సామాజిక సంక్షేమ ప్రయోజనాలు అందరికీ చేరేలా చూసుకోవడానికి ఏర్పాటుచేసింది మాత్రమే. రేషన్ కోసం ఆధార్ పొందిన వ్యక్తిని... ఓటర్‌ను చేయాలా? విదేశాలకు చెందినవారు ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే... వారికి కూడా ఓటు హక్కు కల్పించాలా' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఓటరు నమోదు ఫారం 6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధారించుకునే అధికారం ఈసీకి ఉందని తేల్చి చెప్పింది. కొంతమంది పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ... ఎస్ఐఆర్ ప్రక్రియ సాధారణ పౌరులపై రాజ్యాంగ విరుద్ధమైన భారాన్ని మోపుతుందన్నారు. వారిలో అనేకమంది నిరక్షరాస్యులు ఉన్నారన్నారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్ నిర్వహించడాన్ని ప్రత్యేకంగా సవాల్ చేసిన పిటిషన్ల విచారణకు సుప్రీం షెడ్యూల్ చేసింది. డిసెంబరు 1లోపు వీటిపై స్పందన తెలియజేయాలని ఈసీని కోరింది.

### 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్
## పరాజయానికి సిఐఎ, మొసాద్ కుట్ర

**కాంగ్రెస్ మాజీ ఎంపి కేత్కర్ ఆరోపణ**



**ముంబయి:** అమెరికా, ఇజ్రాయెల్ గూఢచారి సంస్థలు సిఐఎ, మొసాద్ 2014 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమికి కుట్రపన్నాయని, వ్యూహరచన చేశాయని కాంగ్రెస్ నాయకుడు, ఆ పార్టీ మాజీ ఎంపి కుమార్ కేత్కర్ ఆరోపించారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ 145 స్థానాలు గెలుచుకుంది. ఐదేళ్ల తర్వాత 2009 ఎన్నికల్లో 206 సీట్లు సాధించింది. ఈ ధోరణి కొనసాగి ఉంటే, కాంగ్రెస్ 250 సీట్లు గెలిచి సులభంగా అధికారాన్ని నిలబెట్టుకొని ఉండేదని కేత్కర్ అన్నారు. అయితే 2014లో పార్టీ సీట్లు 44కి పడిపోయాయని గుర్తుచేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ అధికారంలోకి రాకూడదని భావించిన సిఐఎ, మొసాద్ కలిసి ప్రణాళికను సిద్ధం చేశాయని అన్నారు. కాంగ్రెస్ సీట్లు ఎట్టి పరిస్థితుల్లోనూ 206 కంటే మించకూడదని ఆ రెండు నిఘా సంస్థలు తీర్మానించుకున్నాయని అన్నారు. కాంగ్రెస్‌ను 206 నుంచి కిందకు దించకపోతే, భారత్‌లో తమ ఆటలు సాగవని కొన్ని సంస్థలు భావించాయని కేత్కర్ ఆరోపించారు. స్థిరమైన కాంగ్రెస్ ప్రభుత్వం లేదా కాంగ్రెస్ ఆధ్వర్యంలోని కూటమి మళ్లీ అధికారంలోకి వస్తే, అవి భారత్ విషయాల్లో జోక్యం చేసుకోలేవని, తమ విధానాలను అమలు చేయడం అసాధ్యమవుతుందని ఈ సంస్థలు భావించాయని మాజీ జర్నలిస్టు కూడా అయిన కేత్కర్ ఆరోపించారు. అన్ని రాష్ట్రాలు, నియోజకవర్గాలపై పూర్తివివరాలున్న డేటా సిఐఎ, మొసాద్‌ల వద్ద ఉందని అన్నారు. 2014లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్‌పై అసంతృప్తి ఉన్నప్పటికీ, అది కాంగ్రెస్‌ను 206 నుంచి 44 సీట్లకు దించివేసేంత తీవ్రంగా లేదని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీకి ప్రతిపక్ష నాయకుడి పదవి పొందడానికి కూడా కావాల్సిన సంఖ్య రాలేదని గుర్తుచేశారు. 2014 నాటి తీర్పును ఆయన ప్రజల తీర్పు కాకుండా, అమెరికా, ఇజ్రాయెల్ నిఘా సంస్థల తీర్పుగా అభివర్ణించారు.

## కొలంబో చేరిన 'విక్రాంత్', 'ఉదయగిరి'



**న్యూఢిల్లీ:** భారత తొలి స్వదేశీ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్, బహుళమిషన్ స్టెల్త్ ఫ్రిగేట్ ఉదయగిరి కొలంబో చేరాయి. ఈ విషయాన్ని భారత నేవీ అధికారులు తెలిపారు. శ్రీలంక నౌకాదళం 75వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించనున్న అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (ఐఎఫ్ఆర్) కోసం ఇవి అక్కడికి వెళ్లినట్టు పేర్కొన్నారు. 2025 ఆగస్టు 26న కమిషన్ అయిన ఐఎన్ఎస్ ఉదయగిరికి ఇది తొలి విదేశీ పర్యటన. శ్రీలంక నేవీ వెబ్‌సైట్‌ను ఉటంకిస్తూ, పిటిఐ ఇచ్చిన వివరాలను అనుసరించి నౌకాదళ సహకారానికి ఉదాహరణగా, బంగ్లాదేశ్, భారత దేశానికి చెందిన మూడు యుద్ధనౌకలు ఈనెల 25, 26 తేదీల్లో కొలంబోలోకి చేరాయి. ఐఎఫ్ఆర్ ఈనెల 30వ తేదీ ఆదివారం జరగనుంది.

## వైద్య కళాశాలల్లో భారీ అవినీతి
### 10 రాష్ట్రాల్లో ఇడి మెరుపు దాడులు

**న్యూఢిల్లీ:** వైద్య కళాశాలల అనుమతుల వ్యవహారంలో లంచాలు, గోప్య సమాచారం లీక్ కేసు దర్యాప్తులో భాగంగా దేశవ్యాప్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు చేపట్టింది. గత కొంత కాలంగా దేశంలోని వివిధ వైద్య కళాశాలల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నట్లు విమర్శలు వస్తున్న సంగతి విదితమే. ఈ నేపథ్యంలోనే ఈడీ కీలక దర్యాప్తు చేపట్టింది. గురువారం ఏకకాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, గుజరాత్, రాజస్థాన్, బీహార్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీతో సహా 10 రాష్ట్రాల్లోని 15 ప్రాంతాల్లో మెరుపు సోదాలు నిర్వహిస్తోంది. ఈ ఏడాది జూన్ 30న సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనల కింద ఈ సోదాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ కేసులో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అధికారులతో సహా పలువురు ప్రభుత్వ అధికారులకు లంచాలు చెల్లించారని సీబీఐ తన ఎఫ్ఐఆర్‌లో ఆరోపించింది. వైద్య కళాశాలల తనిఖీలకు సంబంధించిన అత్యంత రహస్య సమాచారాన్ని సదరు అధికారులు లంచం తీసుకుని ఆయా కళాశాలల కీలక అధికారులకు, దళారీలకు చేరవేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ రహస్య సమాచారం సహాయంతో కళాశాలల యాజమాన్యాలు తనిఖీకి ముందు అవసరమైన పారామితులను, మౌలిక వసతులను తారుమారు చేసి, అక్రమంగా అకడమిక్ కోర్సులను నిర్వహించడానికి అనుమతులు పొందాయని దర్యాప్తు సంస్థలు అనుమానిస్తున్నాయి.ఈ భారీ అవినీతి ఆరోపణల నేపథ్యంలో ఈడీ బందాలు ప్రధానంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న ఏడు వైద్య కళాశాలల ప్రాంగణాలలో తనిఖీలు నిర్వహించాయి. అంతేకాకుండా సీబీఐ ఎఫ్ఐఆర్‌లో నిందితులుగా పేర్కొనబడిన కొందరు ప్రైవేట్ వ్యక్తులు, దళారుల నివాసాలు కూడా ఈ సోదాలలో భాగంగా ఉన్నాయి. ఈ సోదాల ద్వారా పెద్ద ఎత్తున అక్రమ లావాదేవీలు, మనీలాండరింగ్ కార్యకలాపాలకు సంబంధించిన పత్రాలు, డిజిటల్ సాక్ష్యాలు లభించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

## మనీలాండరింగ్ కేసులో
### విన్జో వ్యవస్థాపకుల అరెస్ట్





**న్యూఢిల్లీ/బెంగళూరు:** ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫారమ్ విన్జో వ్యవస్థాపకులు సౌమ్యా సిం గ్ రాథోర్, పావన్ నం దాలను మనీ లాండరి ంగ్ ఆరోపణలపై గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్ట్ చేసింది. బెంగళూరులో ని ఇడిజోనల్ ఆఫీసులో బుధవారం విచారణ అనంతరం ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అదే రాత్రి కోర్టులో హాజరు పరిచిన అనంతరం ఒక రోజు కస్టడీలోకి పంపారు. రూ. 43 కోట్లు విలువైన గేమర్ల డబ్బును విన్జో తిరిగి చెల్లించలేదని ఇడిఆరోపించింది. 2025 ఆగస్టు 22న రియల్‌మనీ గేమింగ్ నిషేధించిన తర్వాత కూడా ఈ మొత్తాన్ని కంపెనీ వద్దే ఉంచిందని వెల్లడించింది. విన్జో, గేమ్జ్‌క్రాఫ్ట్ కార్యాలయాలపై గత వారం మనీలాండరింగ్ నిరోధక చట్టం అమలులోభాగంగా దాడులు జరిగాయి. గేమర్లను మనుషులతో కాకుండా అల్గోరిథమ్‌తో ఆడేలా మోసపూరితంగా కంపెనీ వ్యవహరించిందని ఇడి ఆరోపించింది. బ్రెజిల్, అమెరికా, జర్మనీ వంటి దేశాల్లోనూ ఇదే ప్లాట్ ఫారమ్ ద్వారా ఆర్ఎంజి ఆపరేట్ చేసినట్లు పేర్కొంది. విన్జోకు చెందిన బాండ్లు, ఎఫ్‌డి లు, మ్యూచువల్ ఫండ్‌లు సహా రూ. 505 కోట్లు విలువైన ఆస్తులను ఇడి ఫ్రీజ్ చేసింది. ఈ భారత సంస్థ డబ్బులను అమెరికా, సింగపూర్‌కు ఓవర్సీస్ ఇన్వెస్ట్‌మెంట్స్ పేరుతో మళ్లించిందని ఇడి తెలిపింది. అమెరికాలో విన్జో పేరిట ఉన్న ఖాతాలో 55 మిలియన్ డాలర్ల (రూ. 490 కోట్లకు పైగా) నిల్వ ఉన్నప్పటికీ, ఆ కంపెనీ 'షెల్ కంపెనీ' మాత్రమే అని ఇడి తన ఫిర్యాదులో పేర్కొంది. ఇలా వుంటే, విన్జో, గేమ్జ్‌క్రాఫ్ట్ సంస్థల ప్రతినిధులు తమతమ కంపెనీలపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. చట్టాలకు అనుగుణంగానే వ్యవహరిస్తున్నామని, ఎక్కడా ఉల్లంఘన జరగలేదని పేర్కొన్నారు.

## భారత్–మయన్మార్ సరిహద్దులో ఇడి దాడులు..

**న్యూఢిల్లీ/ఐజాల:** డ్రగ్ ట్రాఫికింగ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో భారత్–మయన్మార్ సరిహద్దు ప్రాంతంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) గురువారం మొట్టమొదటిసారిగా దాడులు నిర్వహించింది. మిజోరంలోని ఐజాల్, చాంఫై, అస్సాంలోని శ్రీభూమి (కరీమ్గంజ్), గుజరాత్‌లో అహ్మదాబాద్ ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి. రూ. 35 లక్షల నగదు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్న ఇడి ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 1.41 కోట్లు విలువచేసే 4.72 కేజీల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకుంది. అరెస్టయిన వారి ఆర్థిక లావాదేవీలు మిజోరం, గుజరాత్ కంపెనీలతో ఉందని గుర్తించింది. భారత్ తూర్పు వైపు మయన్మార్‌తో 1,643 కిమీ పొడవైన సరిహద్దును పంచుకుంటుంది. ఆ ప్రాంతాల్లో దాడులు నిర్వహించడం ఇదే మొదటిసారిమొదటిసారి.

## 26 లక్షల మంది ఓటర్ల పేర్లు సరిపోలడం లేదు

**బెంగాల్‌లో ఎస్ఐఆర్ కసరత్తుపై ఇసి**




**న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్ ప్రస్తుత ఓటర్ల జాబితాలలో దాదాపు 26 లక్షల మంది ఓటర్ల పేర్లు 2002 ఓటర్ల జాబితాతో సరిపోలడం లేదని ఎన్నికల సంఘం నివేదించిందని ఒక అధికారి తెలిపారు. గత సారాంశ సవరణ (ఎస్ఐఆర్) కసరత్తులో 20 02 2006 మధ్య వివిధ రాష్ట్రాలలో తయారు చేసిన వాటితో రాష్ట్ర తాజా ఓటర్ల జాబితాను పోల్చిన తర్వాత ఈ వ్యత్యాసం వెలుగులోకి వచ్చిందని ఆయన బుధవారం సాయంత్రం తెలిపారు. ఈసీ వర్గాల ప్రకారం, కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కింద బుధవారం మధ్యాహ్నం నాటికి పశ్చిమ బెంగాల్‌లో ఆరు కోట్లకు పైగా గణన ఫారమ్‌లను డిజిటలైజ్ చేశారు. 'డిజిటలైజ్ చేసిన తర్వాత ఈ ఫారమ్‌లను మ్యాపింగ్ విధానం కిందకు తీసుకువస్తారు. అక్కడ వాటిని మునుపటి ఎస్ఐఆర్ రికార్డులతో సరిపోల్చుతారు. రాష్ట్రంలోని దాదాపు 26 లక్షల మంది ఓటర్ల పేర్లను గత ఎస్ఐఆర్ జాబితాతో ఇంకా సరిపోల్చలేమని ప్రాథమిక పరిశోధనలు చూపిస్తున్నాయి' అని ఒక అధికారి పీటీఐకి చెప్పారు. డిజిటలైజేషన్ కొనసాగుతున్నందున ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన అన్నారు. ఎన్నికల సందర్భంలో 'మ్యాపింగ్' అంటే 2002లో చివరిగా సంకలనం చేయబడిన ఎస్ఐఆర్ జాబితాలతో తాజాగా ప్రచురించబడిన ఓటరు జాబితాను తనిఖీ చేయడానికి సూచిస్తుంది. ఈ సంవత్సరం మ్యాపింగ్ కసరత్తులో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఓటరు జాబితాలు కూడా చేర్చబడ్డాయి. మరింత సమగ్రమై, కచ్చితమైన ధ్రువీకరణ ప్రక్రియను నిర్ధారించడానికి ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం తీసుకున్న చర్య అని ఆయన తెలిపారు. మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉంటే తుది ఓటర్ల జాబితా నుంచి స్వయంచాలకంగా తొలగించబడటం కాదని అధికారి స్పష్టం చేశారు .

## కొత్త కార్మిక కోడ్‌లను
### తక్షణమే ఉపసంహరించుకోవాలి

**అసంఘటిత కార్మికుల కాంగ్రెస్ డిమాండ్..**

**న్యూఢిల్లీ:** మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త కార్మిక కోడ్‌లను అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి కార్మిక వ్యతిరేకమని ఆరోపిస్తూ, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. గురువారం ఇక్కడ జరిగిన మీడియా సమావేశంలో ఈ సంస్థ ఛైర్మన్ ఉదిత్ రాజ్ మాట్లాడుతూ, ఈ కార్మిక కోడ్‌లకు వ్యతిరేక ఉద్యమాన్ని దేశ వ్యాప్తంగా ప్రారంభిస్తామని హెచ్చరించారు. కొత్త కార్మిక కోడ్‌లు ప్రమాదకర ధోరణితో ఉన్నాయని అంటూ, కార్మికుల ప్రయోజనాలను కాపాడిన పాత కార్మిక చట్టాలు హత్యకు గురయ్యాయని వ్యాఖ్యానించారు. 44 కోట్ల మంది అసంఘటిత కార్మికుల సంక్షేమాన్ని భారీ కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టారని విమర్శించారు. కార్మికుల హక్కులను కోడ్స్ తగ్గిస్తున్నాయని, సమ్మె చేసే హక్కు కూడా వారికి లేకుండా పోయిందని ఉదిత్ రాజ్ అన్నారు. ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ 2020, ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ కోడ్ 2020, సోషల్ సెక్యూరిటీ కోడ్ 2020, వేతనాల కోడ్ 2019 అనే నాలుగు కొత్త కోడ్‌లు కార్మికులకు మిక్కిలి హానికరమని, వారి హక్కులను హరించడమేగాక, ఉద్యోగ భద్రతను నాశనం చేస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మార్పు కార్పొరేట్ల ప్రయోజనాలకు ఉద్దేశించింది మాత్రమేనని పేర్కొన్నారు. ఈ కార్మిక వ్యతిరేకమైన కొత్త కోడ్‌లను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో భద్రత, ఆరోగ్యంపై కఠినమైన ఉద్యోగ చట్టాలు ఉండేవని, కానీ ఇప్పుడు తనిఖీ వ్యవస్థను బలహీనపరచి, చాలా సడలింపుల ఫ్రేమ్‌వర్క్‌ను తీసుకొచ్చారని ఉదిత్ రాజ్ చెప్పారు. కొత్త కార్మిక కోడ్‌లలో ఇన్‌స్పెక్షన్ వ్యవస్థ బలహీనపడడంతో కార్మికుల దోపిడీ పెరుగుతుందని, ఉద్యోగ దాతలకు ఎన్నో చట్టపరమైన పరిమితుల నుంచి మినహాయింపులు లభిస్తాయని ఆయన ఆరోపించారు. కొత్త కోడ్‌ల ప్రకారం గిగ్ వర్కర్లను కేవలం రిజిస్ట్రేషన్ వరకే పరిమితం చేశారని, వారికి ఇఎస్ఐసి లేదా ఇపిఎఫ్ఓ కింద ఎలాంటి అవకాశాలు కల్పించలేదని ఆయన గుర్తు చేశారు. 'హైర్ అండ్ ఫైర్' విధానాన్ని బలపరచడం వల్ల అసంఘటిత కార్మికులకు తీవ్రమైన ఇబ్బందులు వస్తాయని, వారి ఉద్యోగ భద్రత పూర్తిగా నశిస్తుందని అన్నారు. ఈ నాలుగు కార్మిక కోడ్‌లతో కార్మికుల హక్కులు కుదించిపెట్టుకు పోతాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని అన్నారు.



## కొత్త కార్మిక కోడ్‌లు రద్దు చేయాలి

**ఎఐయుడబ్ల్యూసి డిమాండ్**

**న్యూఢిల్లీ:** కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త కార్మిక కోడ్‌లను వెంటనే రద్దుచేయాలని అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కాంగ్రెస్ (ఏఐయుడబ్ల్యూసి) డిమాండ్ చేసింది. గురువారం ఏఐయూడబ్ల్యూసీ అధ్యక్షుడు ఉదిత్‌రాజ్ విలేకరులతో మాట్లాడారు. లేబర్‌కోడ్‌లు కార్మిక వ్యతిరేకమని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు.ఇందుకోసం దేశవ్యాప్తంగా కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించనున్నట్లు చెప్పారు. కొత్త కార్మిక కోడ్‌లు ప్రమాదకరమైన ధోరణికి నాంది పలుకుతాయని పేర్కొంటూ, కార్మికుల ప్రయోజనా లను, ముఖ్యంగా అసంఘటిత కార్మికుల ప్రయోజనాలను కాపాడే పాత కార్మిక చట్టాలను ఖూనీ చేశారని దుయ్యబట్టారు. 44 కోట్ల మంది అసంఘటిత కార్మికులను పెద్ద కార్పొరేట్లు , ఆశ్రిత పెట్టుబడిదారుల దయాదాక్షిణ్యాలకు వదిలేశారన్నారు. కొత్త కోడ్‌ల ద్వారా కార్మిక హక్కుల్ని కాలరాశారని, వారు ఇకపై సమ్మె చేయలేరన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు కార్మికులకు అత్యంత హానికరమని, కార్మిక హక్కుల్ని పూర్తిగా హరిస్తాయమని తెలిపారు. కార్మికుల ఉద్యోగ భద్రతను కాలరాయడమేకాక కార్పొరేట్ల ప్రయోజనాలకు కొమ్ముకాస్తాయని ఉదిత్‌రాజ్ ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కేంద్రప్రభుత్వం ఈ కార్మిక వ్యతిరేక కొత్త కోడ్‌లను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దేశ ంలో వత్తి భద్రత, ఆరోగ్యంపై గతంలో కఠినమైన చట్టాలు ఉండేవని, కానీ ఇప్పుడు తనిఖీ వ్యవస్థను రద్దు చేశారని... చాలా సరళతరమైన చట్రాన్ని ప్రవేశపెట్టారని రాజ్ అన్నారు. తనిఖీ వ్యవస్థ బలహీనపడటం వల్ల కార్మికుల శ్రమ దోపిడీ పెరుగుతుందని, యజమానులు అనేక చట్టపరమైన పరిమితుల నుండి మినహాయింపులు పొందుతారని ఆయన ఆరోపించారు.

## సీట్ల సర్దుబాటుపై ఉద్ధవ్, రాజ్ చర్చలు



**ముంబయి:** శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే గురువారం ముంబైలో మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) అధ్యక్షుడు రాజ్ ఠాక్రేను కలిశారు. రాబోయే మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికలకు సీట్ల పంపకాల ఏర్పాట్లపై ఇద్దరు నాయకులు చర్చించినట్లు తెలుస్తోంది. ఉద్ధవ్ సెంట్రల్ ముంబైలోని దాదర్‌లోని రాజ్ నివాసం 'శివతీర్థం' ను సందర్శించారు. ఒకప్పుడు రాజకీయంగా విడిపోయిన బంధువుల మధ్య ఈ సంవత్సరం జరిగిన వరుస సమావేశాలలో ఇది తాజాది. ఇటీవలి కాలంలో వారి పార్టీల మధ్య సయోధ్య, పొత్తుకు సంకేతాలు వస్తున్న నేపథ్యంలో వారు ఒకరికొకరు సన్నిహితంగా ఉంటున్నారు. శివసేన (యూబీటీ), ఎంఎన్ఎస్ ఇంకా అధికారికంగా పొత్తును ప్రకటించనప్పటికీ, ఠాక్రే బంధువులు స్థానిక సంస్థల ఎన్నికలకు, ముఖ్యంగా కీలకమైన బృహన్ ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ), ముంబై మెట్రోపాలిటన్ ప్రాంతం, పూణే, నాసిక్‌లోని ఇతర పౌర సంస్థల ఎన్నికలకు త్వరలో పొత్తు కుదుర్చుకునే సూచనలు ఇచ్చారు. ఈ సమావేశంలో ఉద్ధవ్, రాజ్ పౌర ఎన్నికలకు తమ పార్టీల మధ్య సీట్ల పంపకం, ఓటర్ల జాబితాలో జరిగిన అక్రమాల గురించి చర్చించారని భావిస్తున్నట్లు శివసేన (యూబీటీ) నాయకుడు ఒకరు వెల్లడించారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని తీవ్రంగా లేవనెత్తుతున్నాయి. శివసేన (యూబీటీ) భాగస్వామి అయిన కాంగ్రెస్... ఎంఎన్ఎస్‌తో పొత్తును ప్రతిఘటిస్తున్నట్లు నివేదించబడిన విషయాన్ని కూడా వారు చర్చించారని ఆయన అన్నారు. కాగా ఈ వారం ప్రారంభంలో ఉద్ధవ్, రాజ్ ముసాయిదా ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు, సూచనలను సమర్పించడానికి మరింత సమయం కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ సమర్పించారు. మహారాష్ట్ర ప్రస్తుతం గ్రామీణ, పట్టణ డిసెంబరు 2న 246 మునిసిపల్ కౌన్సిల్‌లు, 42 నగర పంచాయతీలకు ఎన్నికలు జరుగుతాయి. వాటి తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా 336 పంచాయతీ సమితిలు, 32 జిల్లా పరిషత్‌లు, 29 మునిసిపల్ కార్పొరేషన్‌లకు ఎన్నికలు (షెడ్యూల్ ఇంకా ప్రకటించలేదు) జరుగుతాయి. జనవరి 31 నాటికి మొత్తం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలి.

## దివ్యాంగులకూ ఎస్సీ, ఎస్టీ తరహా చట్టం

**న్యూఢిల్లీ:** దివ్యాంగులను కించపరిచే వారిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎస్సీ/ఎస్టీ చట్టం లాంటి కఠినమైన చట్టాలు అవసరమని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. ఈ దిశగా ఆలోచన చేయాలని కేంద్రానికి సూచించింది. యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాకు సంబంధించి పిటిషన్ల విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. కండరాల క్షీణత సమస్యపై అవగాహన కల్పిస్తూ బాధితులతో కలిసి ఓ ప్రదర్శన నిర్వహించాలని సమయ్ రైనాకు సు ప్రీం కోర్టు సూచించింది. ఓ ఆన్‌లైన్ షోలో వెన్నెముక కండరాల క్షీణత(ఎస్ఎంఏ)తో బాధపడుతున్న ఓ చిన్నారికి అవసరమైన ఔషధాల గురించి ప్రస్తావిస్తూ వారిని కించపరిచే విధంగా సమయ్ రైనా మాట్లాడాడు. ఈ షోలో పాల్గొన్న వారిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ అరుదైన వ్యాధిపై పోరాడుతున్న స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన న్యాయస్థానం... ఆ షోలో పాల్గొన్న వారు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశించింది. దీంతో సమయ్ రైనా క్షమాపణలు చెప్పాడు. రణ్‌వీర్ అలహాబాదియా, సమయ్ రైనాకు సంబంధించిన పిటిషన్లను సుప్రీం కోర్టు గురువారం విచారించింది. బాధితుల తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది అపరాజితా సింగ్.. కమెడియన్ వ్యాఖ్యలు చిన్నారులను కించపరిచేలా ఉన్నాయని న్యాయస్థానం దష్టికి తీసుకెళ్లారు. వారు ఎంతో ప్రతిభావంతులని, ఇలాంటి వ్యాఖ్యలు క్రౌడ్ ఫండింగ్‌కు ఇబ్బందిగా మారుతాయన్నారు. వీటితో సీజేఐ జస్టిస్ సుర్యకాంత్ నేతత్వంలోని ధర్మాసనం ఏకీభవించింది. దివ్యాంగులపై ఎవరైనా కించపరిచే వ్యాఖ్యలు చేస్తే... ఎస్సీ/ఎస్టీ చట్టం మాదిరిగా కఠిన చట్టాన్ని తీసుకువచ్చే విషయంపై ఎందుకు ఆలోచించరని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సుప్రీం ధర్మాసనం అడిగింది. దివ్యాంగులకు రక్షణ కల్పించేందుకు కఠిన చట్టాలు తీసుకువచ్చే విషయంపై ఆలోచించాలని సూచించింది. వారికి కావాల్సింది గౌరవ, మర్యాదలని, వారి విజయాలను చాటిచెప్పేందుకు మీ వేదికను (ఆన్‌లైన్ షో) ఉపయోగించాలని యూట్యూబర్‌లకు సూచించింది.వాటితో వచ్చే నిధులను బాధితుల చికిత్సకు అందజేయాలని ఆదేశించింది.

## ఢిల్లీలో ఎన్‌కౌంటర్..గ్యాంగ్‌స్టర్ అరెస్ట్



**న్యూఢిల్లీ:** ఢిల్లీ లోని ద్వారకలో గురువారం కాల్పుల ఘటన చోటుచేసుకుంది. యాంటీ నార్కోటిక్స్ సెల్‌కు, హిమాన్షు భావు గ్యాంగ్‌కు చెందిన అంకిత్‌కు మధ్య కాల్పులు జరగ్గా... అతని కుడి కాలుకు బులెట్ తగిలింది. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత అంకిత్‌ను యాంటీనార్కోటిక్స్ విభాగం అధికారులు అరెస్టు చేశారు. గత నెల చివర్లో రోహిత్ లాంబాపై నలుగురు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా... హిమాన్షు భావు గ్యాంగ్‌కు కాల్పులతో సంబంధం ఉన్నట్లు తేలింది. ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేయగా, ఇద్దరు ప్రధాన షూటర్లు పరారీలో ఉన్నారు. పోలీసులు వారి కోసం గాలిస్తున్నారు. పరారీలో ఉన్న నిందితులను అంకిత్, దీపక్‌గా అధికారులు గుర్తించారు. ఈ ఇద్దరు నిందితులపై ఢిల్లీ పోలీసులు రూ.25 వేలు రివార్డు ప్రకటించారు. నజాఫ్‌గఢ్‌లోని సాయిబాబా మందిర్ సమీపంలోకి నిందితుల్లో ఒకడైన అంకిత్ వస్తున్నట్లు ద్వారకాలోని యాంటీ నార్కోటిక్స్ బందానికి సమాచారం అందింది. ఉదయం 8 గంటల సమయంలో అంకిత్ బైక్‌పై వస్తుండగా పోలీసులు పట్టుకోవడానికి ప్రయత్నించారు. అతను తప్పించుకోవడం కోసం పోలీసులపై మూడు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఒక బుల్లెట్ పోలీసు కానిస్టేబుల్ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌ను తాకింది. ఆత్మరక్షణ కోసం పోలీసులు నిందితుడిపై మూడు రౌండ్లు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతడి కాలికి గాయమైంది. ఆ తర్వాత నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ప్రజాపక్షం
శుక్రవారం, 28 నవంబరు

## రూపాయి పతనం.. సగటుజీవికి శాపం

రూపాయిని డాలర్‌కు ప్రత్యామ్నాయంగా మారుస్తామని కేంద్ర ప్రభుత్వం ఒకవైపు ప్రగల్భాలు పలుకుతుంటే, మరోవైపు ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయి మారకపు విలువ గతంలో ఎన్నడూ లేనంతగా పతనమవుతున్నది. ఈ సంవత్సరంలో ఇప్పటికే, రికార్డు స్థాయిలో 4.3 శాతం తగ్గుదల నమోదైంది. ఈ పతనాన్ని చాలామంది కేవలం వ్యాపార, వాణిజ్య కోణంలోనే చూడడం దురదృష్టకరం. నిజానికి కరెన్సీ విలువ పడిపోతే, శ్రమపడేది కార్మిక, మధ్యతరగతి వర్గాలే. దేశ ఆర్థిక వ్యవస్థలో కరెన్సీ విలువ భారీ పతనాన్ని ఎవరు భరిస్తారనే ప్రశ్న తెరపైకి రాకుండా ధనిక కార్పొరేట్ రంగం నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటుంది. సమస్యను సృష్టించిన వారు నిజాలు ఎందుకు చెప్తారు. రూపాయి విలువ పతన భారాన్ని ప్రధానంగా భరించేది శ్రామికులు, చిన్న ఉద్యోగులు, రోజు వారి కూలీలు, స్వయం ఉపాధి చేసుకునే వర్గాలే అన్నది క్రూర వాస్తవం. ఇది ఆర్థిక సిద్ధాంతాలపై ఆధారపడిన శాస్త్రీయ అధ్యయనం.. భారతీయ ప్రపంచం లోని అనేక దేశాల దయనీయ ముఖచిత్రం. రూపాయి మారకపు విలువ పతనమైతే, అంతర్జాతీయ మార్కెట్‌లో దేశ కొనుగోలు శక్తి క్షీణిస్తుంది. దిగుమతుల రంగం ప్రత్యక్షంగా ప్రభావితమవుతుంది. భారత అవసరాల్లో ఇంధనానిది అగ్రస్థానం. ముడి చమురుకు అధిక మొత్తంలో చెల్లింపుల ప్రభావం కేవలం పెట్రోలు, డీజిల్, గ్యాస్‌పైనే పడుతుందనుకుంటే పొరపాటే. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో దాదాపు అన్ని రకాల ఉత్పత్తి, సేవా రంగాలకు ఇంధనం అత్యవసరం. రవాణా, వ్యవసాయం, పరిశ్రమలు, విద్యుత్ ఉత్పత్తి తదితరావసరాలకు ఇంధనం కీలకం. కాబట్టి, ఇంధన ధర పెరిగితే ఆ ప్రభావం అన్ని ప్రధాన రంగాలపై పడుతుంది. రవాణా ఖర్చులు పెరుగుతాయి. వ్యవసాయ, ఫ్యాక్టరీ ఉత్పత్తుల ఖర్చులు పెరుగుతాయి. ఫలితంగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతాయి. సామాన్య ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతుంది. వస్తుసేవలకు డిమాండ్ తగ్గడం ఉద్యోగ, ఉపాధి రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కార్మికులకు ప్రతిఫలాన్ని డిమాండ్ చేసే పరిస్థితి ఉండదు. తక్కువ ఆదాయం.. తక్కువ కొనుగోళ్లు.. వస్తుసేవలకు తక్కువ డిమాండ్.. వెరసి తక్కువ ఉత్పత్తి.. ఇదో విషవలయం. ఉపాధి కోల్పోయే.. శ్రమకు తగినంత ప్రతిఫలాన్ని పొందలేక, వచ్చినదానితోనే రాజీపడేది కూడా శ్రామికవర్గమే. పెద్ద కార్పొరేట్ సంస్థలు తమ ఉత్పత్తుల ధరలు పెంచి నష్టాన్ని వినియోగదారుల మీదకు నెట్టేస్తాయి. ధనవంతులకు ఇదొక సమస్య కాదు. పెద్దగా పట్టించుకోరు. ప్రభుత్వాలు కూడా రేట్ల పెంపునే ప్రయత్నం చేస్తాయి. నష్టం భరించేది 'పనిచేసే' వర్గమే. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా వేతనాలు పెరగవు. ఇక్కడ మార్కెట్‌లో ధరల నిర్ణయించేది పెట్టుబడిదారీ వర్గం. కార్మికుల జీతభత్యాలను కూడా ఇదే వర్గం నిర్ణయిస్తుంది, శ్రామికుల జీతాలను, జీవితాలను నిర్ధారిస్తుంది. శాసిస్తుంది. రూపాయి మారకపు విలువతోపాటు, సామాన్యుడి బతుకు కూడా పతనమవుతుంది. రోజూ గంటల తరబడి కష్టపడే కార్మికులు, డ్రైవర్లు, డెలివరీ బాయ్స్, కట్టడం కార్మికులు, చిన్న ఉద్యోగులు, ఉపాధి హామీపై పనిచేసే గ్రామీణులు... ఇలా దిగువ, మధ్యతరగతి వర్గాలే అధికభారాన్ని మోయాల్సి వస్తుంది. శ్రమ మార్కెట్‌లో అత్యధిక శాతంగా ఉన్న కాంట్రాక్టు కార్మికులు, నిరుద్యోగులు, ప్రచ్ఛన్న నిరుద్యోగులు, గిగ్ కార్మికుల ఆదాయానికి, ఖర్చులకు పొంతన కుదరదు. ధరలు రాకెట్ వేగంతో దూసుకెళితే, ఆదాయాలు నత్తనడకన సాగుతాయి. నవమానసరాలన్నింటికి ఇదే అసమానతలకు మూలం. కరెన్సీ విలువ పడిపోవడం సాధారణ ఆర్థిక సంఘటన కానేకాదు. సామాన్య వర్గాల జీవన ప్రమాణాలు తగ్గిపోవడం వారి స్వయంకృతం అంతకంటే కాదు. ఈ దుస్థితి సాధారణ ఆర్థిక వక్రత కాదు... వ్యవస్థీకృత అన్యాయం. పెట్టుబడిదారీ వర్గాలకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వాల నిర్వాకం. పాలకుల విధానాల వైఫల్యమే ఆర్థిక వ్యవస్థలోని అసమానతకు కారణం. దేశ సంపదను సృష్టించేది శ్రామికవర్గమే అయినప్పటికీ, ఆ సంపద విలువను కార్పొరేట్ వర్గాలు నిర్ణయిస్తాయి. ఉత్పత్తి వ్యయం పెరిగితే కంపెనీలు వస్తు, సేవల ధరలు పెంచుతాయి.

ప్రభుత్వాలు తాత్కాలిక ఉపశమనాలు తప్ప, ప్రజలకు ప్రత్యక్ష ఆదాయ మార్గాలు కల్పించవు. సమస్యకు తెరదించవు. రూపాయి విలువ పతనం ఎక్కడ చూసినా ఒక సంఖ్యలా కనిపిస్తుంది. కానీ, ఆ సంఖ్యల వెనుక లెక్కలేనన్ని త్యాగాలు... లక్షలాది అస్తవ్యస్త జీవితాలు... అంతులేని శ్రమ దోపిడీ... అదుపులేని కార్పొరేట్ ఆధిపత్యం. అవసరాలకు, ఆదాయానికి మధ్య అంతులేని అగాధం. ఆర్థిక గణాంకాలు ఏ వివరణలు ఇచ్చినా, రూపాయి విలువ పడిపోతే మొదట నష్టపోయేది కార్మికుడే. కష్టం సుదీర్ఘంగా దక్కకపోయేది సామాన్యుడే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కేంద్ర ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన నివారణ చర్యలు తీసుకుంటేగాని, రూపాయి మారక విలువ పతనాన్ని అడ్డుకోవడం సాధ్యం కాదు. సగటు జీవి సమస్యలు తీరవు. జీవితాలు బాగుపడవు. ఆర్థికాభివృద్ధికి నిజమైన అర్థం ఉండదు.

# రేవంత్ సర్కారుకు అడుగడుగునా అవరోధాలు!



ఎస్.కె.జకీర్

రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ కార్యక్రమం తలపెట్టినా అందులో కుంభకోణం ఉందని ప్రచారం చేయాలన్నది బిఆర్‌ఎస్ పార్టీ ఎజండా. రాష్ట్ర రాజధానిలో పారిశ్రామిక అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ప్రకటించిన పాలసీని వివాదాస్పదం చేయడానికి కెటిఆర్, హరీశ్ రావు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. పరిశ్రమలు ఏర్పాటు కాకుండా భూసేకరణకు అడ్డుకోవడం మొదటి కార్యక్రమంగా బిఆర్‌ఎస్ పనిచేస్తోంది.అలాగే పెట్టుబడులు రాకుండానూ ప్రభుత్వంపై బురద జల్లుతోంది.

అభివృద్ధి అవసరాలకు ప్రభుత్వ భూముల్ని అమ్మడం దీర్ఘకాలంగా కొనసాగుతున్న ప్రక్రియ. మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో ఆదాయ వనరుల కోసం అమ్మడం కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ఓ విధానం. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడులను ఉపసంహరించుకోవడం మొదలు డిఫెన్స్, రైల్వే తదితర శాఖలకు చెందిన భూముల్ని అమ్మడం, లీజుకు ఇవ్వడం కేంద్ర ప్రభుత్వానికి రెగ్యులర్ ప్రాక్టీస్‌గా మారింది. ఆ తరహాలోనే ఉమ్మడి రాష్ట్రంతో పాటు తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా ప్రభుత్వ భూముల్ని అమ్మే ఆనవాయితీ మొదలైంది.

కెసిఆర్ హయాంలో ప్రభుత్వం వివిధ కార్పొరేషన్లు, బోర్డులు, అథారిటీల ద్వారా 453.16 ఎకరాల భూముల విక్రయం జరిగినట్లు గణాంకాల ద్వారా తేలింది. దీంతో ప్రభుత్వానికి సుమారు రూ.31వేల 4కోట్ల మేర ఆదాయం వచ్చింది. హెచ్‌ఎండిఎ ద్వారా జరిగిన అమ్మకాల్లో కోకాపేట్‌లో ఒక్కో ఎకరం వంద కోట్ల రూపాయల చొప్పున గరిష్ట ధర పలికినట్లు కెసిఆర్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్నది. రాష్ట్రంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయని, మూడెకరాల సాగుభూమి ఉన్న రైతులు కోటీశ్వరులంటూ నాటి సిఎం కెసిఆర్ గర్వంగా ప్రకటించారు. ప్రభుత్వ భూముల్ని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్, హెచ్‌ఎండిఎ ద్వారా విక్రయం చేయడంతో పాటు రాజీవ్ స్వగృహ ఫ్లాట్లు, ప్లాట్లు కూడా వివిధ దశల్లో నిర్మాణంలో ఉండగానే అమ్ముడుపోయాయి. నగరానికి చుట్టూ ఉన్న వివిధ ప్రాంతాల్లో విడతలవారీగా ఈ భూముల విక్రయాలు 2015–23 మధ్యకాలంలో జోరుగా సాగాయి. కరోనా సమయంలోనూ రియల్ ఎస్టేట్ రంగం అద్భుతం గా ఉన్నదని బిఆర్ఎస్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్నది.

ఒక్కో ప్రాంతంలో ఉన్న మార్కెట్ ధరకు అనుగుణంగా కెసిఆర్ హయాంలో ఖజానాకు నిధులు సమకూరాయి. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2017 వరకు మూడేండ్ల పాటు హెచ్‌ఎండిఎ భూముల విక్రయానికి దూరంగానే ఉన్నది. అప్పటివరకూ టిజిఐఐసి ద్వారానే కొన్ని విక్రయాలు జరిగాయి. 2017 తర్వాత నుంచి హెచ్‌ఎండీఏ ల్యాండ్ సేల్స్‌మీద దృష్టి పెంచింది. ప్రభుత్వ భూముల్ని అమ్మే వ్యాపారిలా కాంగ్రెస్ ప్రభుత్వం మారిందంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటిదాకా బీఆర్ఎస్ అమ్మిన భూముల వివరాలను రేవంత్ ప్రభుత్వం వెలుగులోకి తీసుకువచ్చింది.

మొత్తం 13 వాయిదాల్లో 338.62 ఎకరాల భూ విక్రయాల ద్వారా ప్రభుత్వానికి మొత్తం 11 వేల 875 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఇది కాక తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ద్వారా జరిగిన 114.54 ఎకరాల భూవిక్రయాలతో రూ.19 వేల రూ.129 కోట్ల మేర సమకూరింది. మొత్తం 485.82 ఎకరాలను విక్రయించాలని ప్రణాళిక రూపొందించుకున్నా అందులో నాల్గోవంతు మాత్రమే సాకారమైంది. 13 ఇన్‌స్టాల్‌మెంట్లలో మొత్తం 485.82ఎకరాల భూమిని విక్రయించాలనుకున్నా 114.54 ఎకరాలు అమ్ముడుపోవడంతో ప్రభుత్వానికి రూ.19,129 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ఈ రెండు ఫేజ్లలో మొత్తం 453.16 ఎకరాల భూమిని విక్రయించింది బిఆర్ఎస్ ప్రభుత్వం. ఈ అమ్మకాలద్వారా ఖజానాకు రూ.31వేల 4 కోట్ల మేర ఆదాయం వచ్చింది.

ఇదిలా ఉండగా ''రాష్ట్రంలోని పారిశ్రామిక భూములను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రైవేటు వ్యక్తులకు తెగనమ్ముతున్నారు. రేవంత్‌ది ల్యాండ్ లూటింగ్ పాలసీ'' అని మాజీ మంత్రి హరీశ్ రావు చెలరేగిపోయారు.''రూ.5లక్షల కోట్ల భూములు రూ.5 వేల కోట్లకు అమ్మకమా? బిఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు'' అని కూడా ఆయన నిందించారు. ''దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలి. అబద్ధాలు ప్రచారం చేయడం బిఆర్ఎస్ నాయకులు కెటిఆర్, హరీశ్‌రావుకు వెన్నతో పెట్టిన విద్య. వారు పదేపదే చేస్తున్న రూ.5 లక్షల కోట్ల కుంభకోణం ఆరోపణలు పూర్తిగా నిరాధారం, అవాస్తవం. ఆధారాలులేని ఈ ప్రచారం పచ్చి అబద్ధం, రాజకీయ దురుద్దేశంతో చేస్తున్నదని ఒప్పుకుని రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలి''అని పరిశ్రమల మంత్రి శ్రీధర్ బాబు డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీపై హరీశ్రావు చేసిన విమర్శలను ఆయన తిప్పికొట్టారు.

తిమ్మిని బమ్మిని చేయడంలో కెటిఆర్, హరీశ్‌రావులను మించిన వారు మరొకరు లేరని శ్రీధర్‌బాబు మండిపడ్డారు. 2023 ఆగస్టులో బిఆర్ఎస్ ప్రభుత్వం 19, 20, 21 నెంబర్లతో జారీ చేసిన ఫ్రీహోల్డ్ జీవోల వెనుక రూ. లక్షల కోట్ల గోల్ మాల్ జరిగినట్లు మంత్రి ఆరోపించారు. పారదర్శకంగా రాష్ట్ర ఖజానాకు రూ.4వేల కోట్ల నుంచి రూ.5వేల కోట్ల వరకు ఆదాయాన్ని సమకూర్చేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే కుంభకోణాలు అలవాటైన బీఆర్ఎస్ నేతలకు మింగుడు పడటం లేదన్నారు.

2023 అసెంబ్లీ ఎన్నికలకు నాలుగు నెలల ముందు అప్పటి ప్రభుత్వం నుంచి తీసుకున్న లీజు భూములకు ఫ్రీహోల్డ్ హక్కులు ఇచ్చి 100, 200 శాతం ఛార్జీలు విధించి రూ.లక్షల కోట్లను వసూలు చేయాలని ప్రణాళిక రచించారు. ప్రజలు కెసిఆర్ ను తిరస్కరించడంతో వర్కౌట్ కాలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వంతో సంబంధం లేని సిఎం రేవంత్‌రెడ్డి సోదరులపై నిరంతరం ఆరోపణలు చేయడమే బిఆర్ఎస్ నాయకులు పనిగా పెట్టుకున్నారు. అలాగే రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా, యువతకు ఉద్యోగాలు దక్కకుండా అడ్డంకులు సృష్టించడం బిఆర్ఎస్ ఎజండా. ప్రభుత్వం 9,292 ఎకరాల భూమిని అమ్మకానికి పెట్టిందని దుష్ప్రచారం చేస్తూ ప్రజల్ని తప్పుదోవ పట్టించడానికి తెలంగాణ భవన్ లో వ్యూహరచన జరిగింది. ఈ భూముల్లో పరిశ్రమలకు ప్లాటింగ్ చేసిన ప్రాంతం ఫ్రీహోల్డ్ ప్రాపర్టీ 4,740 ఎకరాలేనని, ఇవి పూర్తిగా ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భూములని ప్రభుత్వం స్పష్టం చేసింది. మిగిలిన భూములు రోడ్లు, డ్రైనేజీ లాంటి మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగిస్తున్నట్టు కూడా తెలిపింది.

రోజురోజుకూ విస్తరిస్తున్న రాజధాని నగరాన్ని భవిష్యత్తు అవసరాలకు తగినట్లు తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం బిఆర్ఎస్ కు కంటగింపుగా మారింది. దీన్ని ఎలాగయినా అడ్డుకొని తీరాలని ఆ పార్టీ కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తున్నది. ఔటర్ రింగ్‌రోడ్డు లోపల, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లో 50,60 ఏళ్ల క్రితం నెలకొల్పిన పారిశ్రామిక ఎస్టేట్లు, పార్కుల భూములను 'మల్టీ యూజ్ జోన్లు'గా మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీ (హెచ్ఐఎల్టీపీ)2025 పేరిట ప్రభుత్వం కొత్త విధానాన్ని అమల్లోకి తెచ్చింది. నగర అభివృద్ధి, భూముల సక్రమ వినియోగం కోసం ఈ పాలసీని తీసుకొస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటిదాకా పారిశ్రామిక ఎస్టేట్లుగా ఉన్న ప్రాంతాల్లో ఇకపై అపార్టుమెంట్లు, టౌన్ షిప్, ఆఫీసులు, స్కూళ్లు, హాస్పిటళ్లు, హోటళ్లు, టెక్ పార్కులు, రీసెర్చ్ సెంటర్లు నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వనుంది.ఈ అనుమతులు పొందేందుకుగాను ఆయా ప్రాంతాల ప్రభుత్వ రిజిస్ట్రేషన్ (ఎస్ఆర్వో) విలువలో డెవలప్‌మెంట్ ఇంపాక్ట్ ఫీజు కింద రోడ్ల వెడల్పు 80 అడుగులలోపు ఉంటే ఆ ప్రాంతానికి 30శాతం, 80 అడుగుల కన్నా ఎక్కువ వెడల్పు రోడ్లు ఉంటే 50 శాతంగా ఫీజు చెల్లించి ఫ్రీ హోల్డ్‌గా మార్చుకోవచ్చు. ఫ్రీ హోల్డ్‌గా మారితే ఆ భూమిపై పూర్తి యాజమాన్య హక్కులు లభించనున్నాయి. దీంతో ఆ భూమిని వారు తమకు నచ్చిన విధంగా వినియోగించుకునేందుకు, విక్రయించుకునేందుకు కూడా హక్కు పొందుతారు. ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో మొత్తం 22 పారిశ్రామిక పార్కులు, స్టాండ్ అలోన్ భూముల యూనిట్లు ఉన్నాయి. మొత్తం 9,292ఎకరాల భూములు కొత్త పాలసీ కిందకు వస్తున్నాయి. అయితే ఇందులో 4,740 ఎకరాలను ప్లాటెడ్ ఏరియాగా నిర్ణయించారు.

ఇక్కడ పెట్టుబడులు పెట్టి, యువతకు, నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తారనే ఉద్దేశంతో నామమాత్రపు ఫీజుకు గత ప్రభుత్వాలు పారిశ్రామికవేత్తలకు భూములను లీజుకు ఇచ్చాయి. వారికి విద్యుత్, నీరు, ఇతర మౌలిక సదుపాయాలను కూడా కల్పించి ప్రోత్సహిస్తూ వచ్చాయి. ఇలా కేటాయించిన వాటిలో కొన్ని పరిశ్రమలు ఇప్పటికీ కొనసాగుతూ నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తున్నవి. మరికొన్ని పరిశ్రమలు మూత పడ్డాయి. బాలానగర్, కాటేదాన్, కూకట్‌పల్లి, జీడిమెట్ల, చర్లపల్లి, మౌలాలి, నాచారం, ఉప్పల్ వంటి పారిశ్రామికవాడలలో పరిశ్రమలు స్థాపించిన సమయంలో అవి నగర శివారులో ఉండేవి. కానీ,ఆ పరిశ్రమలు ఉన్న ప్రాంతాలు ఇప్పుడు నగరం నడిబొడ్డునకు చేరుకున్నట్లయ్యింది. నగరంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో ఆ పరిశ్రమలు నగర పౌరులకు అసౌకర్యంగా, కాలుష్య కారకాలుగా మారుతున్నాయి. ఈ కారణంతో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందే కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం 2013లో ఈ పరిశ్రమలన్నిటినీ నగరానికి అవతల ఏర్పాటు చేసుకోవాలంటూ ఒక విధానాన్ని తీసుకొచ్చింది. అయితే దానిని అమలు చేసే క్రమంలో ఆ సమయానికే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయింది. ఆ తర్వాత కెసిఆర్ ప్రభుత్వం కూడా ఈ ప్రతిపాదనను తీసుకువచ్చింది. కానీ అమలులోకి మాత్రం తీసుకురాలేకపోయింది. ఇప్పుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని సీరియస్‌గా తీసుకున్నది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ లాండ్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీ తీసుకు వచ్చింది.

పారిశ్రామిక ఎస్టేట్లను మల్టీ యూజ్ జోన్లుగా మార్చి ఇంపాక్ట్ ఫీజు వసూలు ద్వారా భూమిని ఇతర అవసరాలకు వినియోగించేందుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వనుంది. ఇంపాక్ట్ ఫీజులోనే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సిఎల్యూ) ఫీజులు కూడా కలిపారు. దీంతో పారిశ్రామికవేత్తలు అప్రూవల్స్ కోసం వేర్వేరు శాఖల వద్దకు తిరగాల్సిన అవసరం లేకుండా పోతుంది. దీనికోసం టిజిఐపాస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మొత్తం ప్రక్రియకు టిజిఐఐసి నోడల్ ఏజెన్సీగా పనిచేయనుంది. మల్టీ యూజ్ కింద అనుమతులు పొందేందుకుగాను పారిశ్రామికవేత్తలు తమకు కేటాయించిన భూమికి సంబంధించి మొత్తం విలువలో 20 శాతాన్ని ప్రారంభ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుంది. మిగతా 80 శాతం ఫీజులను రెండు విడతల్లో చెల్లించవచ్చు. కాగా, దరఖాస్తులను 7 రోజుల్లోగా టిజిఐఐసి స్క్రూటినీ చేస్తుంది. మరో 7 రోజుల్లో ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నేతృత్వంలోని కమిటీ తుది ఆమోదం తెలియజేస్తుంది. తర్వాత వారం రోజుల్లో డిమాండ్ నోటీసును యూనిట్‌దారులకు ఆన్లైన్లో జారీ చేయనున్నారు. ఈ ప్రక్రియ అంతా 45 రోజుల్లో పూర్తవుతుందని ప్రభుత్వం పేర్కొంది. అయితే ప్రతి దశలోనూ గ్రేస్ పీరియడ్‌ను నెల రోజులుగా నిర్ణయించింది. గ్రేస్ పీరియడ్ దాటితే మొత్తం రుసుము ప్రభుత్వ ఖజానాకే వెళుతుందని స్పష్టం చేసింది. ఈ పాలసీ జారీ అయిన తేదీ నుంచి 6 నెలల్లోపు దరఖాస్తులను సమర్పించాలని ఆదేశించింది. ఈ ఆదాయాన్ని భూ మార్పిడి ఫీజులకు, 25 శాతం టిజిఐఐసి వద్దే ఉంచి రాష్ట్ర నలుమూలల పారిశ్రామిక అభివృద్ధికి వినియోగించనుంది. మిగతా మొత్తాన్ని రాష్ట్ర ఆర్థికస్థితిని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది.

హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్ఫర్మేషన్ పాలసీ కాదు, హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ లూటింగ్ పాలసీ అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపణ. ఒఆర్ఆర్ లోపల ఉన్న 9,292 ఎకరాల పారిశ్రామిక పార్కుల భూముల విలువ రూ.5 లక్షల కోట్లు అయితే.. వాటిని రూ.5వేల కోట్లకే ఎందుకు కట్టబెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. మిగతా రూ.4.95 లక్షల కోట్లు కుంభకోణం కాదా? అని హరీశ్ రావు అంటున్నారు. 9,292 ఎకరాల్లో రోడ్లు, డ్రైనేజీలు పోగా 4,740 ఎకరాలే ఉంటుందని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నది బూటకమన్నది మాజీ మంత్రి విమర్శ. ఈ కుంభకోణం రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్ కంటే రెండు రెట్లు అధికమని ఆయన తెలిపారు.

# రుద్రమదేవి అమరత్వానికి 736 ఏళ్లు

*రాణీ రుద్రమదేవి ఆఖరి రక్తపు బొట్టు 1289 సంవత్సరం నవంబర్ 27న చందుపట్ల గ్రామంలో.*

1262 నుంచి 1289 వరకు కాకతీయ సామ్రాజ్యాన్ని పరిపాలించిన రుద్రమదేవి దక్షిణ భారతదేశంలో మొదటి మహిళా పాలకురాలు. కాకతీయులలో ఏకైక మహిళా పాలకురాలుగా పరిపాలించిన రాణి రుద్రమదేవి, రుద్రదేవ మహారాజు, పటోద్ధృతి, రాయగజకేసరి అనే బిరుదులతో సింహాసనాన్ని అధిష్ఠించింది. కాకతీయులు వరంగల్, సూర్యాపేట, పిల్లలమర్రి, చందుపట్ల, పానగల్ మీదుగా శ్రీశైలం వెళ్లేవారు. దారిలో ఉన్న చందుపట్ల ఒకప్పుడు వ్యాపార కేంద్రంగా వర్ధిల్లింది. నల్లగొండ జిల్లా నకిరేకల్ జాతీయ రహదారి నుంచి కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో చారిత్రక చందుపట్ల గ్రామం ఉంది. కాకతీయులు త్రవించిన ' రా' సముద్రం వెనక దక్షిణ దిక్కులో చందుపట్లలో ఈ శాసనం లభించింది. ఈ శాసనం తెలుగులో ఉన్నది. కాయస్థ గంగయ్య సాహిణి మరణించగా అతని మేనల్లుడు దేవుడు జన్నిగ దేవుడు అతని తర్వాత అతని సోదరులు త్రిపురాంతక దేవుడు, అంబదేవుడు మార్జా వాడ ప్రాంతానికి ప్రతినిధులుగా పనిచేశారు. కాయస్థ అనగా ప్రభుత్వ పత్రాలను భద్రపరిచేవారు, కాయస్థ వంశంలో గంగయ సాహిణి తర్వాత అతని మేనల్లులు జన్నిగ దేవుడు. త్రిపురారీ దేవుడు నమ్మకస్తులుగా పనిచేశారు. ఆ తర్వాత పాలన లోకి వచ్చిన కాయస్థ అంబదేవుడు రుద్రమదేవిని ఎదిరించి రుద్రమదేవి రాజ్య భూభాగాలు ఆక్రమించి రాయసహస్రమల్ల అనే బిరుదును పొందాడు. రుద్రమ దేవి పాలనాకాలమంతా యుద్ధాలతోనే గడిచింది. తొలుత స్త్రీ పరిపాలనను, స్త్రీ అధికారాన్ని సహించలేని సామంతులు, దాయాదుల నుంచి ఆమెకు తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యింది. తండ్రి గణపతిదేవుని కాలంలో సామంతులుగా ఉన్న రాజులు రుద్రమ సింహాసనం అధిష్టించగానే ఎదురు తిరిగారు.

అంబదేవుడు రుద్రమదేవికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. ఈ తిరుగుబాటును అణచడానికి 80 సంవత్సరాల వృద్ధ వయసులో పోరాడి రుద్రమ మరణించినట్టు నలగొండ జిల్లాలోని నకిరేకల్ మండలంలోని 1289 నాటి చందుపట్ల శాసనం తెలియజేస్తున్నది.1289నవంబర్27 న శివైక్యం పొందినట్లూ కాకతీయ రుద్రమదేవి,సేనాపతి మల్లికార్జున నాయుడులకు పువ్వుల ముమ్మడి అనే బంటు సోమనాథ దేవాలయానికి కొంత భూమిని దానంగా ఇచ్చినట్లు ఆ శాసనంలో కలదు. ఈ శాసన ం 1957లో బయటపడింది. 1962 లో భారతీ పత్రికలో చందుపట్ల గ్రామానికి చెందిన డాక్టర్ శ్రీ రంగాచార్యులు మా ఊరిలో కాకతీయుల కాలం నాటి శాసనమున్నది పరిశోధన చేయవలసిందిగా కోరాడు. 1987లో ప్రఖ్యాత చరిత్రకారుడు శ్రీ పరబ్రహ్మ శాస్త్రి ఈ శాసనాన్ని వెలుగులోకి తెచ్చి రుద్రమ దేవి మరణాన్ని ప్రపంచానికి తెలియజేశాడు. తెలంగాణలో నల్లమల అడవులు హైదరాబాద్ నుంచి 135 కిలోమీటర్ల దూరంలో మహబూబ్‌నగర్ జిల్లాలోని మన్ననూరులో, అక్కడి నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉండే బౌరాపురం (భ్రమరాంబపురం) మీదుగా కాలినడకన మరో పది కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తే మేడిమల్‌కల్ అనే చెంచుపెంట శివారులో దుర్గమ అరణ్యంలో ఒక శిలాశాసనం ఉంది.. ఇటీవల దొరికిన మెడిమెకల్ శాసనం కూడా చందుపట్ల శాసనం తిరుగులేనిదని బలప రుస్తున్నట్లు చరిత్రకారుడు డాక్టర్ ద్యావనపల్లి సత్యనారాయణ నిర్ధారించారు.

కాయస్థ అంబదేవుని వల్ల రాణి రుద్రమ హతమైనట్లు, సర్వానాంధ్ర మహీ పతిన్ జిత్వ రణముకే యశో లబ్దవాన్అనే ఆంధ్ర దేశంలో ఉన్న రాజులందరినీ ఓడించి కీర్తి పొందానని తన త్రిపురాంతక శాసనంలో అంబ దేవుడు రాయించుకున్నాడు .దీని ద్వారా ప్రత్యక్షంగా 80 సంవత్సరాల వయసులో ఉన్న రుద్రమదేవిని వధించాను అని అనకుండా పరోక్షంగా ఆంధ్రదేశంలో ఉన్న రాజుల అందరిని ఓడించాను అని చెప్పుకున్నాడు.అసమాన ధైర్య సాహసాలతో శత్రువుల గుండెల్ని చీల్చిన రాణీ రుద్రమదేవి ఆఖరి రక్తపు బొట్టు చిందించింది క్కడే. 1289 సంవత్సరం నవంబర్ 27న చందుపట్ల గ్రామంలో జరిగిన యుద్ధంలో రుద్రమ మరణించింది.

శాసన ప్రాధాన్యత:చందుపట్ల శాసనం కాకతీయ చరిత్రలోనే అత్యంత ప్రముఖమైనదేగాక అరుదైన శాసనం. కాకతీయ రుద్రమదేవి మరణకాలాన్ని ప్రస్తావిస్తున్న శాసనం ఇదొక్కటే. శాసనాకాలం శక సంవత్సరం 1211 మార్గశిర శుద్ధ ద్వాదశి అనగా క్రీస్తుశకం1289 నవంబర్ 27. శాసనంలో కాకతీయ రుద్రమదేవి శివలోకానికి విచ్చేసినట్లు (మరణించడం )ఆమెకు శివలోక ప్రాప్తినుద్దేశించి తమ సేనాని మల్లికార్జున నాయకుడు ప్రాంతీయ అధికారి అయిన పువ్వుల ముమ్మడి గారు చందుపట్ల సోమనాథ దేవాలయాలయమునకు భూదానం చేసినట్లు చెప్పబడినది. గతంలో రుద్రమదేవి క్రీస్తు శకం1296 వరకు జీవించి ఉన్నదని చరిత్రకారులు భావించేవారు. ఈ శాసనం లభించాక రుద్రమదేవి 1289 వరకే జీవించినది అని చెప్పుటకు వీలైనది. అదేవిధంగా మహారాణి రుద్రమదేవి, సైనిక అధికారి మల్లికార్జున నాయుడు ఒకేసారి మరణించినట్లు చెప్పబడింది కనుకనే రుద్రమదేవి యుద్ధభూమిలో వీర స్వర్గమలంకరించెనని మన చందుపట్ల శాసనం ద్వారా చెప్పుకోవచ్చు. నల్గొండ అప్పటి కలెక్టర్‌గా ఉన్న పురుషోత్తం రెడ్డి కాకతీయుల కాలం నాటి రుద్రమదేవి మరణాన్ని తెలియజేసే చందుపట్ల శాసనంను శాసన పునరుద్ధరణకు 80000తో ఈ శాసనానికి గద్దె కట్టించి 2007లో ప్రతిష్టించారు. ఆ తరువాత ముక్తేశ్వరరావు నల్గొండ కలెక్టర్‌గా ఉన్నప్పుడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ వారిని ఒప్పించి ఆరు లక్షల యాభై వేల రూపాయలతో 700 కేజీల బరువు గల 12 ఫీట్లు ఎత్తు గల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయించాడు. ఈ విగ్రహాన్ని చందుపట్లలో ప్రతిష్టించారు.

చరిత్రకారుడు శ్రీ పరబ్రహ్మ శాస్త్రి తరువాత రుద్రమదేవి మరణం గూర్చి చందు పట్ల గ్రామ వివేకానంద యువజన మండలి సభ్యులు, కోటగిరి దైవాధీనం, చరిత్ర ఉపన్యాసకులు సూర్యకుమార్, టంగుటూరి సైదులు ఈ ప్రపంచానికి తెలియజేశారు. ప్రభుత్వం అధికారికంగా ప్రతి సంవత్సరం రుద్రమదేవి వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించి కాకతీయు ల శౌర్య పరాక్రమ లను నేటి తరానికి తెలియజేయాలి . వరంగల్‌లో కాకతీయ ఉత్సవాలను నిర్వహించినప్పుడు రుద్రమదేవి అమరత్వం పొందిన శాసనం లభించిన చందుపట్లలో కూడా కాకతీయ ఉత్సవాలను జరపాలని, చందుపట్లను పర్యాటక కేంద్రంగా మార్చాలని. గ్రామానికి ఎన్నో చారిత్రక విశేషాలు ఉన్నాయి కాబట్టి వాటిని భవిష్యత్ తరాలకు అందించాల్సి న బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని ప్రజలుకోరుకుంటున్నారు.

**నర్సింగు కోటయ్య**
అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ హిస్టరీ, 9985930885

# ఆర్‌ఎస్‌ఎస్‌కు 'కొత్త గాడ్‌ఫాదర్'

**పి. ప్రసాద్**

(నిన్నటి తరువాయి)

గృహ నిర్బంధం నుంచి కూడా సావర్కార్ 1937 లో విడుదలై హిందూ మహాసభ అధ్యక్షులుగా ఎన్నిక అయ్యాడు. 1940 లో ఆర్ఎస్ఎస్ రెండవ అధినేతగా గోల్వాల్కర్ ఎన్నికయ్యాడు. అయితే ఆర్ఎస్ఎస్ స్థాపన కంటే ముందే రత్నగిరి జైలులో వున్న సావర్కార్‌ని గోల్వార్కర్ కల్సి స్ఫూర్తి పొందాడు.

1937 ఎన్నికల్లో కొన్ని రాష్ట్రాల్లో భారత జాతీయ కాంగ్రెస్ తన ప్రభుత్వాల్ని ఏర్పాటు చేసింది. వాటి ఆమోదం లేకుండా రెండవ ప్రపంచ యుద్ధంలో 'బ్రిటిష్ ఇండి యా' కూడా పాల్గొంటున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. దీనికి నిరసనగా కాంగ్రెస్ ప్రభుత్వాలు రాజీనామా చేశాయి. ప్రత్యామ్నాయ సర్కార్ల ఏర్పాటు కోసం బ్రిటన్ ప్రయత్నం చేసింది. ఆ వ్యూహంలో భాగంగా ఆర్ఎస్ఎస్, ముస్లిం లీగు కలవడం గమనార్హం. పరస్పర ప్రత్యర్థులైన రెండు మతాలకి చెందిన మతోన్మాద శక్తులు చేయి కలిపాయి. ద్విజాతి సిద్ధాంతం పేరిట పాకిస్తాన్ ప్రత్యేక దేశంగా ఏర్పడాలనే ముస్లిం లీగ్ 1940 నాటి తీర్మానాన్ని ఆర్ఎస్ఎస్ బలపరచడం వాటి నిజస్వరూపాన్ని బయట పెట్టుకున్నది.

8–10–1939న కపర్దికి ముంజీ రాసిన లేఖలో మున్ముందు రాట్నం, రైఫిల్ మధ్య యుద్ధం తప్పదని జోస్యం చెప్పాడు. నిజంగానే హిందూ మహాసభ ఆర్గనైజర్ నాథూరాం గాడ్సే 30–1–48 తేదీన గాంధీని హత్య చేశాడు. ఇది కాకతాళీయ సంఘటన కాదు.

గాంధీ హత్య నాటికి కాంగ్రెస్ పార్టీ గానీ, కాంగ్రెస్ ప్రభుత్వం గానీ హిందూ మతతత్వం పట్ల ఏకశిలా ఖండంగా లేవు. అందులోని పటేల్ నుంచి పంత్ వరకూ హిందూ జాతీయవాదం చేత ప్రభావితులే. అయినా గాంధీ హత్య సందర్భంగా పెల్లుబికిన దేశప్రజల ఆగ్రహావేశాల ఫలితంగా తాత్కాలికంగా ఏకమై ఆర్ఎస్ఎస్ పై నిషేధం విధించాయి. చరిత్రలో ఆర్.ఎస్.ఎస్. తొలిసారి తీవ్రక్లిష్ట స్థితికి గురైనది. 1947 వరకు బ్రిటిష్ ప్రత్యక్ష అండ పొందిన ఆర్ఎస్ఎస్ ఆ తర్వాత కొత్త ప్రతికూల పరిస్థితిని ఎదుర్కొన్నది. పైగా గాంధీ హత్యతో సంక్షోభంలో పడింది. నాటి నుంచి ఆర్ఎస్ఎస్ వ్యూహం, ఎత్తుగడలు కీలకమైనవి. గడ్డుస్థితి నుండి బయట పడడానికి ఓ కుట్ర పన్నింది. 1949 లో ఒక రాత్రి అయోధ్యలోని మసీదులో రాముడి విగ్రహాల్ని చేర్చి వాటిని రాముడే చేర్చినట్లు ఒక కల్పిత ప్రచార కుట్రకు పాల్పడడం గమనార్హం!

1952 తొలి ఎన్నికల్లో పోటీ కోసం జన సంఘం పార్టీని ఆర్ఎస్ఎస్ స్థాపించింది. మూడు శాతం ఓట్లు, నాలుగు సీట్లు వచ్చాయి. ఆ కొద్ది మేరకు కూడా ప్రధానంగా దేశవిభజన సందర్భంగా మత కల్లోలాలు జరిగిన ప్రాంతాలలో కావడం గమనార్హం. 1925 నుంచి 1940 వరకు ఆర్ఎస్ఎస్ మహారాష్ట్రకే పరిమితం. గోల్వార్కర్ సారధ్యంలో 1940 తర్వాత ఉత్తరాదిన విస్తరణ కోసం ప్రయత్నం జరిగింది. ముఖ్యంగా దేశ విభజన సందర్భంగా మత కల్లోలాలు తీవ్రంగా జరిగిన ప్రాంతాలైన బెంగాల్, పంజాబ్, ఢిల్లీ వంటి చోట్లకు కొత్తగా విస్తరించింది.

నెహ్రూ, షేక్ అబ్దుల్లా సర్కార్ల మధ్య 1952లో ఢిల్లీ ఒప్పందం జరిగింది. ఆర్ఎస్ఎస్ ఆర్టికల్ 370 ని వ్యతిరేకించింది. 1962 చైనా, 1965 పాకిస్తాన్ యుద్ధాల్లో రెచ్చగొట్టింది. 1966 లో కుంభమేళాను మొదటిసారి హిందువుల వేడుకను హిందుత్వ వేడుకగా మార్చింది. కొన్ని నెలలకే గోరక్షణ కార్యక్రమం చేపట్టింది. ఆ సమస్య పై 7–11–1966 తేదీన చలో పార్లమెంటు పిలుపు ఇచ్చింది. అది హిందూ సన్యాసుల్ని సమీకరించి అల్లర్లకు దిగింది. నాటి కాల్పుల్లో ఏడుగురు మరణించారు. 1966 కరువు ఆధారంగా తన రాజకీయ పునాదిని పెంచుకుంది. 1967 నాటి జనరల్ ఎన్నికల్లో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఓడింది. ఆ సందర్భంగా కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో ఆర్.ఎస్.ఎస్. కి పునాది పడింది. 1969లో కాంగ్రెస్ పార్టీ చీలింది. ఆ చీలికను అవకాశంగా తీసుకొని క్రియాశీల పాత్రను పోషించింది. 1971 నాటి బంగ్లాదేశ్ ఏర్పాటును స్వాగతించి కీర్తించింది. 1973 నాటి గుజరాత్ విద్యార్థుల నవనిర్మాణ సమితిలో ఆర్ఎస్ఎస్ క్రియాశీల పాత్ర వుంది. జయప్రకాష్ నారాయణ నాయకత్వంలో జరిగిన అధిక ధరల వ్యతిరేక బీహార్ ఉద్యమంలో పాల్గొన్నది. ఎమర్జెన్సీలో నిషేధానికి గురైంది. ఇలా కలిసొచ్చిన లేదా తానే సృష్టించుకున్న లేదా కుట్ర చేసి పొందిన అవకాశాల ద్వారా ఆర్ఎస్ఎస్ పలు ఆటుపోట్ల మధ్య కూడా నిలదొక్కుకోగలిగింది.

ఎమర్జెన్సీని సడలించి ఎన్నికలు ప్రకటించిన నేపథ్యంలో జరిగిన 1977 ఎన్నికల్లో జనతా పార్టీ ఏర్పడింది. దాంట్లో జనసంఘ్ పార్టీ కూడా విలీనమైనది. తొలిసారి హిందుత్వ శక్తులు దేశ పార్లమెంటరీ రాజకీయ స్రవంతిలో భాగమైనవి. ఇలా గాంధీ హత్యతో పౌర సమాజం నుంచి దూరమైన ఏకాకి స్థితి నుంచి ప్రధాన రాజకీయ స్రవంతిలో చేరడానికి ఆర్ఎస్ఎస్‌కు ముప్పై ఏండ్లు పట్టింది. ఎమర్జెన్సీలో నిషేధానికి గురికావడంతో గాంధీని చంపిన గ్రహణం తొలగింది. మొరార్జీ ప్రభుత్వంలో కీలక మంత్రి పదవులు పొందడంతో 30 ఏళ్ళ ఎదురీత దశ ముగిసి వాలు ఈత దశ ప్రారంభమైంది.

1977 జనవరి నుంచి ఆర్ఎస్ఎస్ కి సొంత రాజకీయ పార్టీ లేదు. 1979లో జనతా సర్కార్ సహా జనతా పార్టీ కూడా విచ్ఛిన్నమైనది. 1980 ఎన్నికల్లో తిరిగి ఇందిరా సర్కా ర్ ఏర్పడింది. ఆర్ఎస్ఎస్‌కు వాలు ఈత దశ నుండి ఎదురీత దశలోకి తిరిగి వెళ్లే స్థితి ఏర్పడింది. తిరిగి తన అనుబంధ రాజకీయ పార్టీ పునర్నిర్మాణానికి పూనుకుంది. జన సంఘ్ పేరు బదులు ఈసారి భాజపా పేరిట పార్టీని స్థాపించింది. గాంధీయన్ సోషలిజం తన లక్ష్యంగా ప్రకటించుకుంది. గాంధీ హత్యా నేర కోణాన్ని కప్పిపెట్టుకునే ప్రయ త్నం చేసింది. పైగా తనది కూడా సోషలిజం దారిగా చెప్పుకునే ప్రయత్నమిది. 1980 ముంబై మహాసభ ద్వారా బిజెపి స్థాపనకు పూనుకుంది. దీంతో మరో కొత్త దశ మొదలైంది.

కాలగమనంలో గాంధీ పేరు, సోషలిజం నినాదం కూడా లాభంలేదని ఆర్ఎస్ఎస్ గుర్తించింది. అయోధ్య ఎజెండాను తిరిగి తలకు ఎత్తుకుంది. అద్వానీ రథయాత్ర కొంత బలాన్నిస్తే, సరళీకరణ విధానాలు మరింత కొత్త బలాన్ని ఇచ్చాయి.

నగ్నమైన ఎజండాతో దేశ ప్రజల్లోకి వెళ్లగలిగే స్థితికి చేరింది. ముఖ్యంగా మధ్యతరగతి ప్రజల మానసిక స్థితిని బాబ్రీ మసీదు కూల్చివేతకు ఆమోదనీయంగా అది మలుచుకోగల దశకు చేరుకుంది. భారత రాజకీయ రంగంలో కొత్త పరిణామమిది. బహిరంగ మత విద్వేష ఎజెండాను ఆదరించే ఒక గణనీయ వర్గాన్ని పౌర సమాజంలో సృష్టించింది. ఆర్ఎస్ఎస్ ఫాసిస్ట్ దారిలో అతి పెద్ద విజయమది.

ఆర్ఎస్ఎస్‌కి అమెరికా ప్రత్యక్ష ప్రోత్సాహం ఇచ్చే స్థితి ఏర్పడడం భారత రాజ్య వ్యవస్థలో కీలక పరిణామం. అంతిమంగా అదో ఆంతరంగిక రహస్య రాజ్య వ్యవస్థ ఏర్పాటుకి పునాది వేసింది. అదే 'డీప్ స్టేట్' గా ఉనికిలోకి వచ్చింది. అది 2014 ఎన్నికల్లో బిజెపిని అధికారానికి తేవడానికి తెర వెనక కీలక పాత్రని పోషించింది.

ఓ వైపు డీప్ స్టేట్, మరోవైపు బడా కార్పొరేట్ వ్యవస్థ నడుం బిగించి పథకం ప్రకారం హిందుత్వ మత విద్వేష భావజాలాన్ని కృత్రిమంగా సృష్టించి, సాధారణ హిందువుల మనస్సుల్లో రెచ్చగొట్టిన ఫలితంగా 2014లో ఢిల్లీలో బిజెపి అధికారం చేపట్టింది. మూడోసారి 2024 లో ఆర్.ఎస్.ఎస్. ఆశించిన ఫలితాలు వచ్చి వుంటే, తమ అంచనా ప్రకారం నూరేళ్ళ పండగ రోజుకి మనదేశం నగ్నమైన ఫాసిస్టు రాజ్యంగా ఏర్పడి వుండేది.

నేటి రాజ్యాంగ చట్టం ఎత్తివేత, కొలీజియం వ్యవస్థ రద్దు వంటి కొన్ని చర్యలను చేపట్టకుండా దేశాన్ని నగ్న ఫాసిస్టు రాజ్యంగా మార్చడం సాధ్యం కాదు. అందుకు తగ్గ ఆధిక్యత రాలేదు. ఆ దిశలో గత 16 నెలలుగా వ్యూహాత్మంగా పావులు కదుపుతున్నది. ఆర్.ఎస్.ఎస్.కి 1947 తర్వాత అంతర్జాతీయ ప్రత్యక్ష గాడ్ ఫాదర్ లేదు. సరళీకరణతో తిరిగి కొత్త అంతర్జాతీయ గాడ్ ఫాదర్ దొరికాడు. గోద్రా తర్వాత మోడీ పర్యటన పై అమెరికా బయటకు నిషేధం విధించినా అంతర్గతంగా భారత్ లో తమ భావి వ్యూహానికి అర్హునిగా ఎంచుకుంది.2014 తర్వాత లోతైన బంధం ఏర్పడింది.

విభిన్న జాతులు, భాషలు, కులాలు, మతాలు, సంస్కృతులు సహజీవనంచేసే మన దేశాన్ని ఏకశిలా సదృశ్య హిందూత్వ రాజ్యంగా మార్చడం ఆర్ఎస్ఎస్ కి అంత తేలికైన కాదు. ఇదే వాస్తవాన్ని వర్తమాన చరిత్ర నిరూపిస్తున్నది. ఫ్యూడల్ రాజరిక, మనువాదాల గూర్చి, సనాతన ధర్మాల గూర్చి ఆర్ఎస్ఎస్ ప్రచారం చేయడం తెలిసిందే. దాని అంతిమ లక్ష్యం నిజమైన పూర్వకాల మనువాద రాజ్య వ్యవస్థ నిర్మాణం లేదా పునరుద్ధరణ కాదు. ఆకులు, దుంపలు తిని బ్రతికే పురాతన మనువాద సంస్కృతి పునరుద్ధరణ జరగదు. ఆ వైపు ఆర్.ఎస్.ఎస్. అడుగు వేయలేదు. బడా కార్పొరేట్ల ప్రయోజనాలు నెరవేర్చడం ప్రధానం. ద్రవ్య పెట్టుబడిదారీ వర్గ లక్ష్యాలను నెరవేర్చడం ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా ఉంటుంది. అది శ్రామిక ప్రజలతో పాటు సకల పీడిత, తాడిత వర్గాల ప్రజలకు వ్యతిరేకమైంది.

ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ఓడించే లక్ష్య సాధన కోసం దీక్ష వహిద్దాం. అన్ని రాజకీయరంగంలోనే కాక తాత్విక, సాంఘిక, ఆర్థికరంగాల్లో కూడా ఓడించే బహుముఖ దృష్టితో పనిచేసి సమగ్ర విజయాన్ని సాధించడానికి దీక్ష వహి ద్దాం.

*(అభిప్రాయాలు రచయితవి)*

**('కమ్యూనిజం' మాసపత్రిక సౌజన్యంతో)**

## నిశ్చితార్థ వేడుకలకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇంట్లో జరిగిన ఆయన కుమారుడి నిశ్చితార్థ వేడుకలకు తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి హాజరైనారు. గురువారం హైదరాబాద్‌లోని జరిగిన డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క కుమారుడి నిశ్చితార్థ వేడుకలలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పాల్గొని కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.

## మూడుచింతలపల్లి తహాశీల్దార్‌గా బరీరా ఫరీదా



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండల తహాశీల్దార్‌గా డిప్యూటి కలెక్టర్ బరీరా ఫరీదా గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇదివరకు మూడుచింతలపల్లి తహాశీల్దార్‌గా విధులు నిర్వహించిన సుచరిత మూడుచింతలపల్లికి నూతన తహాశీల్దార్‌గా విచ్చేసిన డిప్యూటి కలెక్టర్ బరీరా ఫరీదాకు పూలబొకే అందజేసి ఘన స్వాగతం పలికారు. డిప్యూటి కలెక్టర్ శిక్షణలో ఉన్న బరీరా ఫరీదా ఒక నెల రోజుల పాటు మూడుచింతలపల్లి తహాశీల్దార్‌గా విధులు నిర్వహించనున్నారు. కాగా ఇదివరకు తహాశీల్దార్‌గా విధులు నిర్వహించిన సుచరిత కలెక్టరెట్ కార్యాలయంలో సేవలు అందించనున్నారు.



## బికెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని చర్చ్ గాగిలాపూర్ గ్రామంలో బికెఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 7వ ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బొంగునూరి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు ఈ విధంగా సేవ చేయడం చాలా అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఎల్లప్పుడు ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుంటూ సమస్యల పరిష్కరించేందుకు ఎల్లప్పుడు వారికి అందుబాటులో ఉంటానని అన్నారు. అధికంగా పేద ప్రజలు ఉండే బస్తీలలో బికెఆర్ ట్రస్టు ద్వారా ఈ వైద్య సేవలు మరింత వేగవంతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకర్ రెడ్డి, కావాలి గణేష్, ప్రేమ్ కుమార్, షఫీ, రాము యాదవ్, గజా, లింగం గౌడ్, కాలనీ వాసులు, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ నిబంధనలు పాటించాలి



**ప్రజాపక్షం/నవాబుపేట్:** స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నియమావళిని పాటించాలని నవాబ్‌పేట్ ఎస్సై జీ.పుండ్లిక్ అన్నారు. గురువారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా మండలంలో 163 బిఎన్ఎస్ఎస్ (144) సెక్షన్ అమల్లో ఉంటుందని సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు. నాయకులు, ప్రజలు, వాహనదారులు నిబంధనలు పాటించాలని చెప్పారు. ఎవరైనా గొడవలు సృష్టించిన, సోషల్ మీడియాలో వ్యక్తిగత విమర్శలు చేసిన చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అలాగే లావాదేవీల వివరాలు లేకుండా అధిక మొత్తంలో నగదును తరలిస్తే సీజ్ చేస్తామని, వ్యక్తి గతంగా రూ.50 వేలకు మించి వాహనాల్లో తీసుకెళ్లినా స్వాధీనం చేసుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ డిసెంబర్ 17వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు. మండల ప్రజలు ఎన్నికల కోడ్ నియమ నిబంధనలు పాటిస్తూ పోలీస్ వారికి సహకరించాలని పేర్కొన్నారు.



## అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** రాజకీయాలతో నిమిత్తం లేకుండా నియోజక వర్గంలోని అన్ని డివిజన్ ప్రాంతాలను అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నానని, దీనికి ప్రజలందరూ సహకరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం వెంకటాపూర్ డివిజన్‌లో రూ. 50లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్ పనులను స్థానిక కార్పొరేటర్ సబిత అనిల్ కిషోర్‌తో కల్సి ప్రారంభించారు. శివనగర్‌లో రూ.32 లక్షల వ్యయంతోనూ, ఆర్టీసీ కాలనీలో రూ.18లక్షల వ్యయంతోనూ సిసి రోడ్డు పనులు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకుని రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి అధికారులు, బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్, సయ్యద్, దేవయ్య గౌడ్, దయా, సైఫ్‌ద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ కాలే శ్రీనివాస్ మృతి



**ప్రజాపక్షం/నవాబుపేట్ :** చించల్‌పేట్ తాజా మాజీ సర్పంచ్ గుండెపోటు తో మృతి చెందిన సంఘటన నవాబుపేట మండలం చించల్ పేట్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చించల్ పేట్ గ్రామం తాజా మాజీ సర్పంచ్ కాలే శ్రీనివాస్ (38) మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా గుండెపోటు రాగా గమనించిన కుటుంబ సభ్యులు వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు తెలిపారు. కాలే శ్రీనివాస్ అంత్యక్రియలు ఈరోజు స్వగ్రామం చించల్ పేట్ లో మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



## బాబురావు సేవలు చిరస్మరణీయం

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** బిఆర్ఎస్ నాయకుడు బాబురావు సేవలు చిరస్మరణీం అని, ఆయన కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని మల్లారెడ్డి హెల్త్ సిటీ చైర్మన్ చామకూర భద్రారెడ్డి అన్నారు. ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన బాబురావు గురువారం ఎన్ఎఫ్‌సినగర్‌లో సంతాప సభకు హెల్త్‌సిటీ చైర్మన్ భద్రారెడ్డి, బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌లుపాల్గొని బాబురావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భద్రారెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు బిఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పనిచేసిన బాబురావు ఆకస్మిక మృతి తమను తీవ్రంగా కలిచి వేసిందన్నారు. బాబురావు కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని వారి పిల్లలకు తమ విద్యాసంస్థల్లో ఉచితంగా విద్యను అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు బండారి అంజనేయులు గౌడ్, బేతాల నర్సింగ్ రావు, చందుపట్ల వెంకట్ రెడ్డి, మాజీ బ్యాంక్ డైరెక్టర్ బొక్క ప్రభాకర్ రెడ్డి,సీనియర్ జర్నలిస్ట్ పిట్టల శ్రీశైలం, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన పోరాటం

### సిపిఐ రాష్ట్ర నాయకుడు కె.యేసురత్నం



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన పరిధిలోని ఇందిరమ్మ ఫేస్2 ప్రాంతంలో నివసించే పేద ప్రజానీకంపై అధికారులు రోడ్లు వెడల్పు చేస్తున్నామంటూ భయభ్రాంతులకు గురి చేయటం మానుకోవాలని, లేదంటే వారిపక్షాన పోరాటం చేస్తామని సిపిఐ రాష్ట్ర నాయకులు కె.యేసురత్నం, బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్‌లు హెచ్చరించారు. గత కొద్ది కాలంగా ఈ ప్రాంతంలో నివసిస్తూ చిన్నా చితకా పనులతో జీవనం గడుపుతున్నారని, బుధవారం మున్సిపల్ అధికారులు స్థానికంగా నివసిస్తూ టైలరింగ్ పనులు చేసుకొనే డబ్బాను తొలగించారన్నారు. పేదలకు అండదండగా ఉంటామని, ఈ మేరకు వారు నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ శ్యాంసుందర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నేతలు ఆశి, యాదయ్య, పొన్నికంటి దస్తగిరి, కుమార్, తులసి, చంద్రవతి, వెంకటేష్, లక్ష్మి, చందు తదితరులు పాల్గొన్నారు.

## 100 ఫీట్ రోడ్డు మాస్టర్ ప్లాన్‌ను మార్చాలని ఎమ్మెల్యేకు వినతి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఎఎస్ రావునగర్ నుండి నేరేడ్‌మెట్ వరకు ప్రతిపాదించిన కాలనీలో 450 కుటుంబాలవారి నివాసాలు నష్టపోతున్న కారణంగా ఈ మాస్టర్ ప్లాన్‌ను మార్చాలని వినాయక్‌నగర్ డివిజన్‌లోని కాకతీయనగర్ నివాసితులు కోరారు. గురువారం కాలనీవాసులు మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డిని కల్సి ఈ మేరకు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ అంశాన్ని తాను గత అసెంబ్లీ సమావేశాల్లో సైతం ప్రస్తావించానని, హెచ్ఎండిఎ అధికారులకు ఈ విషయమై లేఖలు రాసానన్నారు. దీంతో పాటు గౌతంనగర్, మిర్జాలగూడ, మచ్చబొల్లారం డివిజన్ ప్రాంతాల్లో సైతం ఇదే తరహా సమస్య ఉందని, వీటన్నింటిని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు దశరథ్, శ్రీహరి, రాంచందర్, దయానంద్, హేమంత్, ఎమ్మార్ శీను బిఆర్ఎస్ శ్రేణులు బద్దం పరశురాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వరి కొయ్యలకు నిప్పపెడితే రైతులకే నష్టం

### ఎఒ రవికుమార్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** హర్వెస్టర్ మిషన్‌తో వరి పంటను కోసే సమయంలో వరిని పైకి కోయడం వలన కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. దీంతో దున్నె సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరి కొయ్యలను తగులబెడుతున్నారు. దీని వలన రైతులకు అధిక నష్టాలకు వచ్చే అవకాశముందని ఎట్టి పరిస్థితిలోను వరి కొయలను తగులబెట్టొద్దని రైతులకు మూడుచింతలపల్లి వ్యవసాయాధికారి రవికుమార్ సూచించారు. గురువారం ఆయన మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వలన భూసారం కోల్పోతుందని, వరి కొయ్యలను కాల్చితే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని అన్నారు. వరి కొయ్యలను కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూసారాన్ని కోల్పోతుందన్నారు. నత్రజని, ఫాస్పరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుందని ముఖ్యంగా పంటలకు ఉపయోగపడే సూక్ష్మ జీవులు, రైతు మిత్ర పురుగులు నశిస్తాయన్నారు. దీంతో పంట దిగుబడి సరిగా రాకపోవడంతో పాటు భూమికి పీచు పదార్థంగా ఉపయోగపడే అవశేషాలు కాలిపోతాయన్నారు. పంటలకు అవసరమైన ఖనిజ లవణాలు దెబ్బతినడమే కాకుండా పొలాల్లో తిరిగే పాములు, ఉడుములు, నెమళ్లు, తొండలు ఇలా అనే క జీవరాసులు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. పొలాల గట్లు, మొరం గడ్డలపై ఉన్న పచ్చని చెట్లు కాలిపోవడంతో పర్యావరణానికి హాని కల్గుతుందని తెలిపారు.

## కీసర ఆర్డీఓ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై రాంమోహన్



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లా కలెక్టరేట్‌లో అకౌంట్స్ విభాగ అధికారి రాంమోహన్ కీసర ఆర్డీఓ కార్యాలయానికి డిప్యుటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖాధికారి, తెలంగాణా గెజిటెడ్ అధికార్ల సంఘం అధ్యక్షులు వినోద్ కుమార్, ఆధ్వర్యంలో గురువారం ఆయనను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డిఆర్డీఓ సాంబశివరావు, సిపిఓ శేఖర్, జిల్లా ఇంటర్‌మీడియట్ అధికారి కిషన్, డిఈఓ విజయకుమారి, బిసి వెల్ఫేర్ అధికారి ఝాన్సి లక్ష్మి, డిసిఓ వెంకటరెడ్డి, ఎల్డీఎం శివప్రసాద్ తదితరులు పాల్గొని ఆయన పని తీరును కొనియాడారు.

## కలెక్టర్ కార్యాలయం ముందు యువరైతు ఆత్మహత్యాయత్నం



**ప్రజాపక్షం /వికారాబాద్ :** భూసమస్యలు పరిష్కించడం లేదని అవేదన వ్యక్తం చేస్తు , కొడంగల్ నియోజకరవ్గంలోని చిట్లపల్లిగ్రామనికి చెందిన యువరైతు శ్రీనివాస్ వికారాబాద్ కలెక్టర్ ఎదుట ఆత్మహత్యాయాత్నానికి ప్రయత్నించారు. భూ సమస్య పరిష్కారం కోసం రెండుసంవత్సరాలు గా కలెక్టర్ కార్యాలయం చూట్టు తిరుగుతున్నాడు అధికారులు సమస్యను పరిష్కరించకుండా తిప్పుకుంటుండంతో గురువరం కలెక్టర్ కార్యాలయం మెయిన్‌గేట్ ఎదుట ఉరి వేసుకొని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్రీంచడంతో కలెక్టర్ కార్యాలయంలో విదులు నిర్వహిస్తున్న ఓంగార్డు అతన్ని పైనుండి తిప్పి నారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి సొంత నపియోజకరవ్గంలోనే ఇలా ఉంది అంటే జిల్లా రైతుల పరిస్థితి ఎలా ఉందో అని వాపోయారు.



## వైద్య చికిత్సల కోసం సిఎం రిలీఫ్ ఫండ్

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వైద్య చికిత్సల కోసం సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం లభిస్తుందని, అవసరమైన వారు తనను సంప్రదించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సూచించారు. తన క్యాంప్ కార్యాలయంలో గురువారం ఆయన సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను అందచేసారు. అల్వాల్ డివిజన్‌కు చెందిన బాలాజి యాదవ్‌కు రూ. 37500, నవీన్‌రాజుకు రూ.13500,మచ్చబొల్లారం డివిజన్‌కు చెందిన షేక్ జిలానికి రూ.,21వేలు మంజూరయ్యాయని తెలిపారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి రెండు రోజులు జైలు శిక్ష

**ప్రజాపక్షం/చర్లపలి:** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒక వ్యక్తికి రెండు రోజుల జైలు శిక్ష పడిన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ చేస్తుండగా ఇసీఐఎల్‌కు చెందిన దినేష్(26) మారుతీ సుజుకి టాక్సీ కారు( టిజి 08 యు0924)ను ఆపి డ్రైవరుకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష బ్రెత్ అనలైజర్‌తో చెక్ చేయగా రీడింగ్ బిఏసి 313 ఎంజి /100ఎంఎల్ రాగా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు కారులో మద్యం సేవించి ప్రయాణీకులను ఎక్కించుకోని నడుపుతున్నందున అతనిపై కేసు నమోదు చేసి కుషాయిగూడ కోర్టులో హాజరుపర్చగా అట్టి డ్రైవరుకు 12వ స్పెషల్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్షణతో పాటు 3 వేల రూపాయల జరిమానా విధించారు.

# సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖిలు

### మొదటి రోజు అంతంత మాత్రమే



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు సబ్ డివిజన్‌లో మొదటి రోజు నామినేషన్ ధాఖాలు నామాత్రంగా కొనసాగింది. ప్రభుత్వం ఆగమేఘాల మీదుగా పంచాయతీ ఎన్నికల షెడ్యూల్‌ను జారి చేయడంతో అభ్యర్థులు తర్జనభర్జన పడ్డారు. అందుకు తోడు గ్రామాలలో పంచాయతీ రిజర్వేషన్లలో గందరగోళంగా ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలలు అభ్యర్థుల ఎంపికలో ఇబ్బందులకు గురవుతున్నారు. సర్పంచ్ అభ్యర్థిగా పోటి చేదామని ఎదురు చూస్తున్న వ్యక్తులకు ఆశించిన మేరకు రిజర్వేషన్లను రాక పోడంతో గ్రామాలలో అలజడి నెలకొంది. తాండూరు నియోజకవర్గంలోని తాండూరు, పెదేముల్, యాలాల, బషీరాబాద్ మండలాలు తొలి విడతలోనే ఎన్నికలు నిర్వహిస్తుండడంతో పాటు ఈ నెల 27నుండియే నామినేషన్ల ధాఖాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. గ్రామాలలో అభ్యర్థుల ఎంపికనే గ్రామ పార్టీ నాయకులకు తలకు మించిన భారంగా మారింది. నియోజకవరంలోని అత్యాధికంగా గ్రామ పంచాయతీలు జనర్ కేటాగిరికి రావడంతో అయా గ్రామాలలో పది మంది అభ్యర్థులు పోటికి సైం అంటున్నారు. దీంతో అటు అధికార పార్టీకి, ఇటూ ప్రతి పక్షపార్టీల నేతలు అభ్యర్థుల ఎంపికలో తలపట్టుకుంటున్నారు. అంతే గాక తామనే పోటి చేస్తామని చెప్పుకుంటూ వచ్చిన నేతల ఆశలకు రిజర్వేషన్లు భారిగ గండి కొట్టాయి. నామినేషన్ల ధాఖాలు మొదటి రోజు గురువారం నామినేషన్ల ధాఖాలులో అంత స్పందన లేకుండా పోయింది. ఆశించిన మేరకు నామినేషన్లను ధాఖాలు కాలేదు. రిజర్వేషన్లకు తోడు నిబంధనలు సైతం పూర్తి స్థాయిలో అధికారులు ప్రకటించక పోవడంతో అభ్యర్థులు తికమక పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు గ్రామాలలో ఎన్నికలకు సంబంధించిన పూర్తి వివరాలను గ్రామాలలో ప్రకటించాల్సిన అవసరం ఎంతైన ఉంది. పెద్దేముల్ మండల పరిధిలోని తట్టేపల్లి సెక్టార్‌లో బండమీదిపల్లి గ్రామానికి చెందిన నత్తి కృష్ణ తన సర్పంచ్ అభ్యర్థిగా తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి సమర్పించారు. ఆయన వెంట గ్రామ పెద్దలు సైతం మద్దతుగా పాల్గోన్నారు.

**ధామరచెడ్ గ్రామ పంచాయతీలో**

పంచాయతి ఎన్నికల పురష్కరించుకుని బషీరాబాద్ మండల పరిధి ధామర్ చెడ్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి సతీమణి భారతి గురువారం నామినేషన్ ధాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి తాండూరు మాజీ ఎంఎల్ఏ పైలెట్ రోహిత్ రెడ్డి హజరైన ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.ఈ సందర్భంగా భారతి శ్రీనివాస్ రెడ్డి, ధామర్ చెడ్ గ్రామ బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ పైలెట్ రోహిత్‌రెడ్డి సహకారంతో గతంలో అనేక సమస్యలను పరిష్కరించడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దగ్గరపడుతున్న ఇంక పరిష్కరాని కి నోచుకోలేదని విమర్శించారు. తనకు అవకాశం ఇస్తే గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర మీడియా ప్రతినిధి పంజుగుల శ్రీశైల్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు నర్సిరెడ్డి తదితరులు ఉన్నారు.





## పోలింగ్ స్టేషన్ల డేటాను సకాలంలో పొందుపరచాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** జిల్లాలోని ఈఆర్వోలు, సిఈఓ తెలంగాణా వెబ్‌సైట్‌లోని పోలింగ్ స్టేషన్ల డేటాను పిడిఎఫ్ ఫార్మాట్‌లో డౌన్‌లోడ్ చేసి ఎక్సెల్ ఫార్మాట్‌కు మార్చాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఈఆర్వోలను ఆదేశించారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కల్సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి నంబర్లు, ఎపిక్ నంబర్ ద్వారా సెర్చ్ చేసే అవకాశాన్ని వెబ్‌సైట్‌లో ప్రారంభించారని తెలిపారు. 2002 మ్యాపింగ్ డేటాను నూరు శాతం సెర్సింగ్‌తో పూర్తి చేయాలన్నారు. దీని కోసం అవసరమైన అదనపు సిబ్బందిని, కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఉపేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు..

## మీడియా సెంటర్‌ను ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాపక్షం/వికారాబాద్ :** గురువరం నాడు జిల్లా కలెక్టర్ మీడియా సెంటర్‌ను, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, జనరల్ అబ్సర్వర్ షేక్ ఆష్మన్ భాషా తో కలిసి ప్రారంభించారు. గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో భాగంగా మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థుల పత్రికా ప్రకటనలు, సోషల్‌మీడియా ప్రచారంపై మీడియా సెంటర్ ద్వారా నిఘా పెట్ట డం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. హెల్ప్‌లైన్ సెంటర్‌ను పరశీలించారు. జనరల్ అబ్జర్వర్ మాట్లాడు తూ టివిలో వివిధ చానల్స్‌తోపాటు లోకల్ చానల్స్ ను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మనోహర్‌రాజు, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, డిపిఆర్‌ఎ చెన్నమ్మ, ఉద్యానవన శాఖ అధికారి సత్తర్, తదితరులు పాల్గొన్నారు.

## వజ్రేష్ యాదవ్‌కు అభినందనల వెల్లువ

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** డిసిసి అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన తోటకూర వజ్రేష్ యాదవ్‌కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గురువారం పిసిసి సభ్యులు, టిపిసిసిఅధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన తోటకూర వజ్రేష్ యావ్‌ని వారి నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీరంగం మాట్లాడుతూ వజ్రేష్ యాదవ్ నాయకత్వంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతుందని, పార్టీ కార్యకలాపాలు ప్రజలకు మరింత చేరువవుతాయని విశ్వసిస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలని అధిరోహించాలని ఆకాంక్షించారు. సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి పేద కుటుంబానికి చేరేలా పార్టీ ప్రతిష్టమైన ప్రజా వ్యూహాలతో ముందుకెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్, కెపిహెచ్‌బి డివిజన్ తమ్మినేని ప్రవీణ్ కుమార్, బోయిన్‌పల్లి డివిజన్ అధ్యక్షులు మహేష్ యాదవ్, అల్లాపూర్ డివిజన్ అధ్యక్షులు మోయినుద్దీన్, బోయిన్‌పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులుకతదితరులు పాల్గొన్నారు.

## విధులను సజావుగా నిర్వహించాలి

### ఎన్నికల సాధారణ పరిశీలకులు షేక్‌యాస్మీన్ భాష

**ప్రజాపక్షం /వికారాబాద్ :** గురువారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల సాదారణ పరిశీలకులు వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్‌పి స్నేహమెహ్రా కలిసి పాల్గోన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలికులు షేక్ యాస్మిన్ భాష , ఈ సందర్భంగా మాట్లాడుతూ మొదటి విడుత ఎన్నికల నామినేషన్లు ఈ రోజు నుండి ప్రారంభమవుతున్న దృష్ట్యా సంబంధిత నోడల్ అధికారులు అవసరమైన మెటీరియల్స్ తో సిద్ధంగా ఉండాలన్నారు. మొదటి విడుద పోలిం గ్ డిసెంబర్ 11న, రెండవ విడుత 14న మూడో విడుత 17న నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఆర్వోలు, ఏఆర్ఓలు, పిఓ,ఎపిఓలు జోనల్ అధికారులు , సూక్ష్మ పరిశీలకులకు మరోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావాళి కి సంబంధించిన ప్రతిరోజు నివేదికలు పంపే విధంగా ఎంసిసి నోడల్ అధికారి అభ్యర్థుల ఖరారు అయిన తర్వాత అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన రిపోర్టులను ఎక్స్పెంటర్ నోడల్ అధికారి , బ్యాలెట్ పేపర్లను బ్యాలెట్ అధికారి చూడాలని రాజకియ ప్రకటనలకు సంబంధించిన మీడియ సర్టిఫికేషన్,మానిటరింగ్ కమిటి,సోషల్ మీడియా ద్వారా నిర్వర్తించే విదులు సంబంధిత అధికారి చూడాలన్నారు, నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నియమాకల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడుతయాని హెచ్చరించారు. నోడల్ అధికారులు మరోసారి కేటాయించిన విదులను పునచరణ చేసుకోని ఎన్నికల నియమ నిబంధనలను క్షుణంగా చదివి ఎక్కడ తప్పులు దోర్లకుండా విధుల నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ జిల్లాలోమ సమస్యాత్మక పోలీంగ్ స్టేషన్లు 912,అతి సమస్యాత్మక పోలీంగ్ స్టేషన్లు 922 గుర్తించామని,క్లస్టర్ వారిగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ఈకార్యక్రమంలో అబ్సర్వర్ మనోహర రాజు ,తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, డిఆర్ఓ మంగీలాల్ , ఆర్‌డిఓ వాసుచంద్ర తదితరులు పాల్గోన్నారు.



## ఆలయ కమిటీ సభ్యుడికి శుభాకాంక్షలు

**ప్రజాక్షం/ఘట్‌కేసర్ :** సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం ఉత్సవ కమిటీ సభ్యుడుగా ఎన్నికైన సందర్భంగా ఘట్‌కేసర్ మున్సిపాలిటీకి చెందిన మెరుగు నరేష్ గౌడ్‌ని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్,మెరుగు నరేష్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముల్లి జంగయ్య యాదవ్ పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు ప్రాధాన్యం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉద్యమకారులకు తగిన ప్రాధాన్యత ఇచ్చేందుకు కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.వెంకట్‌రాంరెడ్డి సూచించారు. గురువారం షాద్‌నగర్‌లో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పి.వెంకట్‌రాంరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు ఎంతో కృషి చేశారని, వారి సేవలను గుర్తించి స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన ప్రాధాన్యత కల్పిస్తే రాజకీయ పార్టీలకు మనుగడ ఉంటుందన్నారు. సమావేశంలో ఫరూఖ్‌నగర్ మండల అధ్యక్షుడు దొడ్డి రవీందర్, పట్టణ అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, బిసి సంఘం అధ్యక్షుడు మేకల వెంకటేష్, రవికుమార్ గౌడ్, చంద్రశేఖర్ గౌడ్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర అభివృద్ధి ఎమ్మెల్యే మల్‌రెడ్డితోనే సాధ్యం



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితోనే సాధ్యమవుతుందని దళిత చైతన్య వేదిక రాష్ట్ర వ్యవస్థాపన అధ్యక్షుడు ఉక్కుల అశోక్ అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆదిభట్ల మున్సిపాలిటీ 3వ వార్డు చింతపల్లిగూడ గ్రామంలో సిఆర్ఆర్ ఫండ్స్‌తో సిసి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్బండ వర్గాల సంక్షేమానికి ఎమ్మెల్యే రంగారెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు జోగు శేఖర్, కొండ్రు రాములు జోగు బాలయ్య, జోగు నర్సింహ, జోగు యాదయ్య, ఉడుతల రవి గౌడ్, జోగు జంగయ్య, జోగు మహేందర్, జోగు భాస్కర్ పాల్గొన్నారు

## సమస్యల పరిష్కారానికి సహకారం

### బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** కాలనీల సమస్యల పరిష్కారానికి తన సహకారం ఉంటుందని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. గురువారం డివిజన్‌లోని గౌతమి కాలనీలో జలమండలి, జిహెచ్ఎంసి అధికారులతో పాటు కాలనీ సంక్షేమ సంఘాలతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కారం చేస్తామని తెలిపారు. సిసి రోడ్డు, పార్కులు, డ్రైనేజీ మరమ్మతులు అవసరమైన వసతులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జలమండలి డిజిఎం రాజగోపాల్, ఇంజనీరింగ్ విభాగం డిఈ దామోదర్ రావు, జలమండలి మేనేజర్ భవ్య, విద్యుత్ శాఖ ఇమ్రాన్, కాలనీ అధ్యక్షులు సుధాకర్ గౌడ్, నారాయణరావు, రాజు, సాయిబాబా, సుకుమార్, ఆంజనేయులు, శ్రీహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్‌లో ప్రతీ సమస్యనూ పరిష్కరిస్తా

### డిప్యూటీ ఫ్లోర్ లీడర్ నర్సింహ్మారెడ్డి



**ప్రజాపక్షం/హయత్ నగర్ :** మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో ప్రతీ సమస్యను పరిష్కరిస్తానని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పేర్కొన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా సంక్షేమ సంఘ సభ్యులతో కలిసి గురువారం కాలనీల్లో పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కార్పొరేటర్ మాట్లాడుతూ వినాయక్ నగర్ కాలనీలో సంవత్సరాలు నుండి చిన్న వర్షం వస్తే ముంపుకు గురవుతున్నాయని రోడ్ల సమస్యను ఇచ్చిన హామీ ప్రకారంగా పరిష్కరించామని తెలిపారు. రోడ్డుకు అనుగుణంగా రాంపులను, ట్రీ గార్డ్ గోడలను కట్ చేసి రోడ్డు నిర్మాణానికి సహకరించిన కాలనీ వాసులకు అభినందనలు తెలిపారు. వెంకటేశ్వర స్కూల్ పక్కన ఉన్న రోడ్డు వెడల్పు సమస్య కాంట్రాక్టర్ తో మాట్లాడి పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. హయత్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ఉన్న దోబీ ఘాట్ వద్ద రజక సంఘ సోదరులకు తాగునీటి లైను, భూగర్భ డ్రైనేజీ పైప్లైన్ కొరకు కృషి చేస్తానన్నారు. దోబీ ఘాట్ వద్ద స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయడంతో రజక సోదరులు ప్రత్యేక కృతజ్ఞతలు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ సభ్యులు వెంకటేష్, శ్రీనివాసు, నక్క భాస్కర్ గౌడ్, యుగేందర్ రెడ్డి, రాజు యాదవ్, సత్తిపండు, బిక్షపతి, భాస్కర్, శివ కుమార్, అనిల్, కృష్ణమూర్తి, మురళి మహేష్, సోనోజ్, స్థానిక రజక సోదరులు స్వామి, దాసు తదితరులు పాల్గొన్నారు..

## సిపిఐ మండల కార్యదర్శి నర్రా గిరి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/శంషాబాద్:** సిపిఐ శంషాబాద్ మండల కార్యదర్శి నర్రా గిరి జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అన్నెపు ప్రభు సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ కార్యకర్తలు, కార్మిక నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి పనుగంటి పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.యాదగిరి, మండల కార్యదర్శి చందు యాదవ్, నాయకులు ప్రవీణ్‌గౌడ్, రాజుగౌడ్, కార్యదర్శి గిలక రాజు, భవన నిర్మాణ కార్మిక సంగం మండల కార్యదర్శి నరేష్ నాయక్, నాయకుడు శీను పాల్గొన్నారు. నర్రా గిరికి పార్టీ నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో, పార్టీ కార్యకలాపాల బలోపేతంలో గిరి చేస్తున్న సేవలను ఈ సందర్భంగా వారు కొనియా

## కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు 'షేర్ ద విజన్' చేయూత




**ప్రజాపక్షం/రంగారెడ్డి/ఎల్‌బినగర్:** కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు దాతల చేయూత అవసరమని సేవా సంస్థ అధ్యక్షుడు నారాయణరావు అన్నారు. షేర్ ద విజన్ సంస్థ ఆధ్వర్యంలో 200 మంది కండరాల క్షీణత వ్యాధిగ్రస్తులకు రూ. 8 లక్షలు విలువైన బియ్యం నిత్యవసర సరుకులను గురువారం పంపిణీ చేశారు. సైదాబాద్ లోని వినాయక నగర్ కమ్యూనిటీ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నారాయణరావు మాట్లాడుతూ మానవత్వంతో స్పందించే మనసున్న తన మిత్ర బృందంతో కలిసి షేర్ ద విజన్ సంస్థను ప్రారంభించి కొన్నేళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనాథ విద్యార్థులు చదువు కొనసాగించేందుకు, వృద్ధాశ్రమాలకు, మానసిక దివ్యాంగులకు, నిరాశ్రయులైన నిరుపేదలకు జీవనానికి అవసరమైన నిత్యవసర సరుకులను, దుప్పట్లను, వస్త్రలను పంపిణీ చేస్తున్నామని వివరించారు. బాధితుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ తమకు సానుభూతి కాదు, సహకారం కావాలని ప్రభుత్వాన్ని కోరారు. షేర్‌ద విజన్ సంస్థ కోశాధికారి పాల్ సద్గుణ రావు, ఐఎస్ సదన్ పోలీస్ ఎస్ఐ పృథ్వీరాజ్, యాకత్ పుర ప్రాంత నాయకుడు వీరేందర్ యాదవ్, మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కత్తుల బాలకృష్ణ, ప్రధాన కరవికుమార్ రవికుమార్, వినోద్ కుమార్, సతీష్ చంద్ర, శివకుమార్, రమేష్ యాదవ్, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

# సక్రమంగా నోడల్ అధికారుల ఎన్నికల విధులు

### ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ జీవన్ పాటిల్








**ప్రజాపక్షం/రంగారెడ్డి:** గ్రామ పంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను సక్రమంగా నిర్వహిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా ఎన్నికలు సజావుగా నిర్వహించాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ జీవన్ పాటిల్ అన్నారు. గురువారం ఎన్నికల సాధారణ పరిశీలకులు ప్రశాంత్ జీవన్ పాటిల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్సు హాల్‌లో వ్యయ పరిశీలకులు ఆర్య, జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డిలతో కలిసి గ్రామ పంచాయతీ ఎన్నికల నోడల్ అధికారులతో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే చర్యలు , ఎన్నికల పోలింగ్ వరకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. మొదటి విడత ఎన్నికల నామినేషన్లు ప్రారంభమవుతున్న దృష్ట్యా సంబంధిత నోడల్ అధికారి అవసరమైన అన్ని మెటీరియల్స్‌తో సిద్ధంగా ఉండాలన్నారు. మొదటి విడత పోలింగ్ డిసెంబర్ 11న, రెండవ విడత పోలింగ్ డిసెంబర్ 14న, మూడో విడత పోలింగ్ డిసెంబర్ 17న జరగనున్న దృష్ట్యా ఆర్వోలు, ఏఆర్‌ఓలు, పిఓ, ఏపిఓలకు, జోనల్ అధికారులు, సూక్ష్మ పరిశీలకులకు మరోసారి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఎన్నికలను సీరియస్ గా తీసుకోవాలని, నోడల్ అధికారులు అవసరమైతే వారి కార్యాలయం నుండి లేదా ఇతర సిబ్బందిని సహాయకులుగా నియమించుకోవాలన్నారు. ఈ సందర్భంగా బ్యాలెట్ పేపర్ల ముద్రణ, మెటీరియల్ మేనేజ్మెంట్, ఎన్నికల సిబ్బంది, జోనల్ అధికారుల నియామకం, ఎన్నికల ప్రవర్తన నియమావళికి సంబంధించి ప్రతిరోజు నివేదికలు పంపే విధంగా ఎంసిసి నోడల్ అధికారి, అభ్యర్థులు ఖరారు అయిన తర్వాత అభ్యర్థుల ఖర్చులకు సంబంధించిన వివరాలు రిపోర్టులను ఎక్స్పెండిచర్ నోడల్ అధికారి, బ్యాలెట్ పేపర్లను బ్యాలెట్ అధికారి చూడాలని, రాజకీయ ప్రకటనలకు సంబంధించి మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ, సోషల్ మీడియా ద్వారా నిర్వర్తించే విధులు సంబంధిత అధికారి చూడాలన్నారు. అలసత్వానికి తావివ్వవద్దని, ఎన్నికల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే ఎన్నికల నియమాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. నోడల్ అధికారులు వారికి కేటాయించిన విధులను పునఃచరణ చేసుకోని ఎన్నికల నియమ,నిబంధనలను క్షుణ్ణంగా చదివి ఎక్కడ తప్పులు దొర్లకుండా విధులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్, జెడ్పి సిఇఒ కృష్ణారెడ్డి, ఆర్డీవోలు, డిపిఓ వి సురేష్ మోహన్, నోడల్ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

### క్షుణ్ణంగా నామినేషన్ పత్రాల పరిశీలన

నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అభ్యర్థి సమర్పించిన నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని జనరల్ అబ్జర్వర్ పి.ప్రశాంత్ జీవన్ రిటర్నింగ్ అధికారులకు సూచించారు. గురువారం మొదటి దశ పోలింగ్ కు సంబంధించి గురువారం నుండి ప్రారంభమైన నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్దతుప్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెద్దతుప్ర తండా, ముచ్చింతల్, మదనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో మదనపల్లి, మదనపల్లి కొత్త తాండ, మదనపల్లి పాత తాండ గ్రామాల పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ పి.ప్రశాంత్ జీవన్, రంగారెడ్డి జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ జీవన్ మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా దరఖాస్తు ఫారాలు తీసుకొనివారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. దాఖలైన నామినేషన్లకు సంబంధించి జిల్లా కేంద్రానికి సకాలంలో రిపోర్టులు పంపించాలన్నారు. ప్రతి నామినేషన్ సెంటర్ వద్ద హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, విధుల్లో ఉన్న ప్రభుత్వ సిబ్బంది నామపత్రాలు దాఖలు చేసే విషయంలో అభ్యర్థులకు అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను తు.చ తప్పకుండా పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించాలన్నారు. జనరల్ అబ్జర్వర్ వెంట శంషాబాద్ ఎంపిడిఓ మున్ని, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు,తదితరులు ఉన్నారు.

## లివికేఫ్ కిచెన్ ప్రారంభించిన కెటిఆర్

**ప్రజాపక్షం/శంకర్ పల్లి:** శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామ పరిధిలో లివి కేఫ్ అండ్ కిచెన్‌ను మాజీ మంత్రులు కె.తారకరామారావు, హరీష్ రావు, శ్రీనివాస్‌గౌడ్‌లు గురువారం ప్రారంభించారు. మాజీ స్పీకర్ మధుసూదనాచారి కుమారుడు నూతనంగా ఏర్పాటు చేసిన లివి కేఫ్ అండ్ కిచెన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రమాణాలతో మోకిలలో లివి కేఫ్ అండ్ కిచెన్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శంకర్‌పల్లి మాజీ ఎంపిపి గోవర్ధన్‌రెడ్డి, శంకర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజు నాయక్, సొసైటీ చైర్మన్ బద్దం శశిధర్ రెడ్డి, బిఆర్‌ఎస్ మండల్ల అధ్యక్షుడు గండిచేర్ల గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షుడుమన్నె లింగం ముదిరాజ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫరీద్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బిసోళ్ల శ్రీధర్, నాయకులు పట్లోళ్ల ఉపేందర్ రెడ్డి, పొద్దుటూరు మాజీ సర్పంచ్ ఏనుగు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం



### డిఎంహెచ్ఒ లలితాదేవి
### బస్తీ దవాఖానాల ఆకస్మిక తనిఖీ
### ఆలస్యంగా వచ్చిన వైద్యులకు మెమో జారీ

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** వైద్యులు రోగులకు అందుబాటులో ఉంటు, మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని రంగారెడ్డి జిల్లా వైద్య,ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.లలితాదేవి అన్నారు. గురువారం ఎల్‌బి నగర్ నియోజకవర్గ పరిధిలోని గుంటి జంగయ్య కాలనీ, చంపాపేట్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానాలను డిఎంఅండ్‌హెచ్ఒ లలితాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా ఆసుపత్రికి ఆలస్యంగా వచ్చిన వైద్యాధికారులను, సిబ్బందిపై డిఎంహెచ్ఒ లలితాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు డాక్టర్లకు మెమోలు జారీ చేశారు. సమయపాలన పాటించాలని సూచించారు. వైద్యం కోసం నిరీక్షిస్తున్న రోగులను మాట్లాడి, అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రికార్డులను, అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించి సిబ్బంది మాట్లాడారు. నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు నిరుపేదలు వస్తారని, వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. మందులు అందుబాటులో ఉన్నాయా లేదో స్టోర్‌ను పరిశీలించారు. మందులు అందుబాటులో ఉండేటట్లు చూసుకోవాలని, సిబ్బందికి సూచించారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి లలితాదేవి హెచ్చరించారు.

# 'ఎన్‌సిసి'తో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు

### ఎమ్మెల్యే గాంధీ



**ప్రజాపరక్షం/మియాపూర్:** ఎన్‌సిసితో విద్యార్థుల్లో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని మియాపూర్ జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో ఎన్‌సిసి దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఎమ్మెల్యే గాంధీ, మండల విద్యాధికారి వెంకటయ్య, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతిప్రజ్వలన చేసి ఎమ్మెల్యే గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి ప్రధాన లక్ష్యం విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం అని పేర్కొన్నారు. స్వాతంత్రం అనంతరం దేశ అవసరాల నేపథ్యంలో పుట్టుకొచ్చిన ఎన్‌సిసి, నేడు యూనిఫాం ధరించిన యువజన సంస్థగా ఎదిగిందని తెలిపారు. విద్యార్థులకు ప్రాథమిక సైనిక శిక్షణ, డ్రిల్, అస్త్ర వినియోగం వంటి అంశాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. అలాగే, విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్య అభివృద్ధికి ప్రతిపాఠశాలలో యోగ, కరాటే వంటి కార్యక్రమాలను విధిగా నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా పాఠశాల సిబ్బందిని ఎమ్మెల్యే గాంధీ అభినందించారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వసుందర సేవలను కొనియాడారు. అనంతరం ఎన్‌సిసిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికేట్‌లు అంద జేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వసుంధర, ఎంపిపి ప్రధానోపాధ్యాయుడు యూసఫ్, ఉపాధ్యాయులు మదన్‌మోహన్, బాల్‌రెడ్డి, వీణ, శ్రీలక్ష్మి, ఎన్‌సిసి ఇంచార్జ్ హిమబిందు, స్థానిక నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గంగాధర్, మహేందర్ ముదిరాజ్, మహమ్మద్‌ఖాజా, జాఖిర్, వెంకటేశ్వరరావు, సుప్రజ, చంద్రకళ, జ్యోతి, నరేష్ నాయక్, వెంకటేష్‌గౌడ్, సాంబయ్య, రాజేశ్వరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

### ఫరూఖ్‌నగర్ ఎంపిడిఒ బన్సీలాల్

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** బాల్య వివాహాలను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఫరూఖ్‌నగర్ ఎంపిడిఒ బన్సీలాల్ అన్నారు. గురువారం షాద్‌నగర్ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బన్సీలాల్ మాట్లాడుతూ బాల్య వివాహాలను అపేద్దాం.. నారీ శక్తిని చాటుదాం.. బాల్యవివాహాలకు శాశ్వత విముక్తి కల్పించే దృక్పథం చేయాలని సూచించారు. బాల్యవివాహాల నిర్మూలనకు ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మారుతున్న కాలంతోపాటు గ్రామీణ ప్రజలు మారి ఇలాంటి వివాహాలకు బాలికలను దూరంగా ఉంచి చక్కని చదువుల ద్వారా వారికి భవిష్యత్ అందించాలన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాస్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటమ్మ, విజయలక్ష్మి, సంధ్యారాణి, దివ్య, లక్ష్మి బాయి, అండాలు, పద్మ, శివరాణి, జయలక్ష్మి, సమంత, జ్యోత్స్న, గీత, ప్రశాంతి బృందం పాల్గొన్నారు.




## పకడ్బందీగా స్థానిక ఎన్నికల నిర్వహణ

### శంషాబాద్ డిసిపి రాజేష్

**ప్రజాపక్షం/కొత్తూరు:** స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు పోలీస్ అధికారులు తగిన భద్రత కల్పించాలని శంషాబాద్ డిసిపి రాజేష్ సూచించారు. గురువారం కొత్తూరు మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి ఎన్నికల రిటర్నింగ్ అధికారుల నుండి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిసిపి రాజేష్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని విధాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో గట్టి బందోబస్తును ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఓటర్లను ప్రలోబాలకు గురి చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు ప్రజలందరు సహకరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐ నర్సయ్య, ఎస్ఐ గోపాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




# కోలాహలంగా నామినేషన్ల పర్వం





### తొలి రోజు పోటాపోటీగా దాఖలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో రాజకీయ పార్టీల నేతలు ఎంతో ఉత్సాహం చూపిస్తున్నారు. గురువారం నామినేషన్ల ప్రక్రియ మొదటి రోజు కావడంతో షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్. కేశంపేట, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల్లోని పంచాయతీల్లో నామినేషన్లు దాఖలయ్యాయి. కొత్తూరు మండలంలో సర్పంచ్ పదవికి 11 నామినేషన్లు, వార్డు స్థానాలకు 22మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఫరూఖ్‌నగర్ మండలంలో సర్పంచ్ పదవికి 34మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా వార్డు స్థానాలకు 19మంది వేసినట్లు ఎన్నికల అధికారి బన్సీలాల్ తెలిపారు. జిల్లేడు చౌదరిగూడ మండలంలో సర్పంచ్ పదవికి 29మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా వార్డు స్థానాలకు 05మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కేశంపేట మండలంలో సర్పంచ్ స్థానానికి 24మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 7మంది అభ్యర్థులు వార్డు స్థానాలకు నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కొందుర్గు మండలంలో సర్పంచ్ పదవి కోసం 13మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 26మంది వార్డు స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు. నందిగామ క్లస్టర్ పరిధిలో సర్పంచ్ పదవికి నాలుగు నామినేషన్లు రాగా వార్డు స్థానాలకు మూడు నామినేషన్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**మామిడిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన శ్రీపాల్‌రెడ్డి...** చరిత్ర కలిగిన మామిడిపల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పాకనాటి శ్రీపాల్‌రెడ్డి మొదటి నామినేషన్ దాఖలు చేశారు. గురువారం కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు కారె శేఖర్, కామెల్లిగారి సత్యనారాయణ గౌడ్, చీపిరి సాయికుమార్, శరత్ కృష్ణ చారి, దిలీప్‌కుమార్, మదన్‌మోహన్‌గౌడ్, పి.మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## భారత ఆల్‌రౌండర్ దీప్తి శర్మకు రికార్డు ధర

### లారాకు 1.10 కోట్లు..



మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ మెగా వేలం ఆసక్తికరంగా సాగింది. ఇటీవలే వరల్డ్ కప్‌లో అదరగొట్టిన దీప్తి శర్మ రూ.3.20 కోట్లు పలికింది. మ్యాచ్ విన్నర్ అయిన దీప్తిని ఆర్‌టిఎం ద్వారా యుపి వారియర్స్ సొంతం చేసుకుంది. ప్రపంచకప్‌లో రెండు శతకాలతో రెచ్చిపోయిన లారా వొల్వార్డ్ ను రూ.1.20 కోట్లు ఢిల్లీ క్యాపిటల్స్ పట్టేసింది. అయితే.. ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీకి మాత్రం వేలంలో చుక్కెదురైంది. ఇప్పటివరకూ వేలంలో ఏ ఫ్రాంచైజీ ఎవరిని కొనుగోలు చేసిందో చూద్దాం. డబ్ల్యూపిఎల్ నాలుగో సీజన్ వేలంలో స్టార్ ఆటగాళ్లపై కాసుల వర్షం కురుస్తోంది. గురువారం మధ్యాహ్నం 3:00 గంటల తర్వాత ఢిల్లీలో మెగా వేలం మొదలైంది. ఆక్షనీర్ మల్లికా సాగర్ నిర్వహిస్తున్న ఈ వేలంలో న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవినె రూ.2 కోట్లు పలికింది. ఆల్‌రౌండర్ అయిన డెవినె కోసం ఢిల్లీ, గుజరాత్ జెయింట్స్ పోటీపడ్డాయి. చివరకు గుజరాత్ భారీ ధరతో కివీస్ స్టార్‌ను కొన్నది. అనంతరం.. యుపి వారియర్స్ ఫ్రాంచైజీ ఆర్‌టిఎం ద్వారా దీప్తి శర్మను రూ.3.20కోట్లకు దక్కించుకుంది. ప్రపంచకప్‌లో రెండు శతకాలతో మెరిసిన దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వొల్వార్డ్ కూడా కోటి కొల్లగొట్టింది. టాపార్డర్ బ్యాటర్ అయిన లారాను ఢిల్లీ క్యాపిటల్స్ రూ.1.10 కోట్లకు హస్తగతం చేసుకుంది. మెగా వేలంలో భారత పేసర్ రేణుకా సింగ్ రూ.60 లక్షలకు గుజరాత్ జెయింట్స్ గూటికి చేరింది. సెమీఫైనల్లో టీమిండియాపై సెంచరీ బాదిన ఆస్ట్రేలియా అమ్మాయి ఫొబె లిచ్‌ఫీల్ రూ.1.20 కోట్లు పలికింది. అయితే.. అలీసా హీలీ, తంజిమ్ బ్రిట్స్ వంటి స్టార్ ప్లేయర్లను ఎవరూ కొనేందుకు ఆసక్తి చూపించలేదు. గత సీజన్‌లో ఢిల్లీని నడిపించిన మేగ్ లానింగ్‌ను రూ.1.9కోట్లకు యూపీ వారియర్స్ సొంతం చేసుకుంది. ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ సోఫీ ఎకిల్‌స్టోన్‌ను రూ.80 లక్షలకు యుపి తీసుకుంది. న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కేర్‌ను ముంబై ఇండియన్స్ రూ.3కోట్లకు తీసుకుంది.

## జనవరి 9 నుంచి మహిళల ప్రీమియర్ లీగ్



మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్‌కు ముహూర్తం ఖరారైంది. మెగా వేలం రోజునే టోర్నీ ఆరంభ తేదీని బిసిసిఐ వెల్లడించింది. ఊహించినట్టుగానే జనవరిలోనే నాలుగో సీజన్ ప్రారంభం కానుంది. అయితే.. ముందుగా వినిపించిన జనవరి 7న కాకుండా జనవరి 9 నుంచి సీజన్ మొదలవ్వనుందని డబ్ల్యుపిఎల్ చైర్మన్ జయేశ్ జార్జ్ పేర్కొన్నారు. పురుషుల టీ20 ప్రపంచ కప్ నేపథ్యంలో డబ్ల్యుపిఎల్ షెడ్యూల్‌ను ముందుకు జరిపిన విషయం తెలిసిందే. డబ్ల్యుపిఎల్ నాలుగో సీజన్ మ్యాచ్‌లకు ఈసారి రెండు వేదికలనే ఖరారు చేశారు. నవీ ముంబై, వడోదరలోనే అన్ని మ్యాచ్‌లు నిర్వహిస్తామని డబ్ల్యుపిఎల్ చైర్మన్ జయేశ్ జార్జ్ తెలిపారు. జనవరి 9న నవీ ముంబైలో టోర్నీ ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 5న వడోదరలో ఫైనల్ బిసిసిఐ తెలిపింది. త్వరలోనే పూర్తి షెడ్యూల్ విడుదల చేయనున్నారు. డబ్ల్యుపిఎల్ మూడో సీజన్ నాలుగు నగరాల్లో జరిగింది. ముంబై, బెంగళూరు, లక్నో, వడోదరలో మ్యాచ్‌లు నిర్వహించారు. అయితే.. కొన్ని కారణాల వల్ల ఈసారి రెండు నగరాలను మాత్రమే ఎంచుకున్నారు. ఇప్పటివరకూ జరిగిన మూడు సీజన్లలో ముంబై ఇండియన్స్ రెండు పర్యాయాలు, ఆర్సీబీడబ్ల్యుపిఎల్ ఒకసారి విజేతగా నిలిచాయి. దాంతో.. నాలుగో సీజన్‌లో ఛాంపియన్‌గా నిలిచేందుకు ఢిల్లీ సిద్ధమవుతుండగా.. తొలిసారి ట్రోఫీని ముద్దాడాలని యుపి వారియర్స్, గుజరాత్ జెయింట్స్ పట్టుదలతో ఉన్నాయి. నాలుగో ఎడిషన్ కోసం ఐదు ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకున్న క్రికెటర్లు వీళ్లే..

**ముంబై ఇండియన్స్ :** నాట్ సీవర్ బ్రంట్ (రూ.3.5 కోట్లు), హర్మన్‌ప్రీత్ కౌర్ (రూ.2.5 కోట్లు), హేలీ మాథ్యూస్(రూ.1.7కోట్లు), అమన్‌జోత్ కౌర్(రూ.1.0కోట్లు), జి. కమలిని(రూ.50 లక్షలు).

**ఢిల్లీ క్యాపిటల్స్ :** జెమీమా రోడ్రిగ్స్,(రూ.2.2 కోట్లు) షఫాలీ వర్మ(రూ.2.2 కోట్లు), మరినే కాప్(రూ.2.2 కోట్లు), అనాబెల్ సథర్‌లాండ్‌రూ.2.2 కోట్లు), నిక్కీ ప్రసాద్ అన్‌క్యాప్డ్‌రూ.50 లక్షలు).

**యుపి వారియర్స్ :** శ్వేతా షెరావత్ (రూ.50 లక్షలు).

**ఆర్సీబీ :** స్మృతి మంధాన(రూ.3.5 కోట్లు), రీచా ఘోష్(రూ.2.75కోట్లు), ఎలీసా పెర్రీ(రూ.2 కోట్లు), శ్రేయాంక పాటిల్ (రూ.60లక్షలు)లను మాత్రమే రీటైన్ చేసుకుంది.

**గుజరాత్ జెయింట్స్ :** బేత్ మూనీ(రూ.3.5కోట్లు), అష్ గార్డ్‌నర్(రూ.2.5కోట్లు).

## కోటి కొల్లగొట్టిన తెలుగమ్మాయి

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ మెగా వేలంలో ప్రతిభావంతులపై కోట్లు కుమ్మరిస్తున్నాయి ఫ్రాంచైజీలు. టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించిన స్పిన్నర్ శ్రీ చరణి కోటి కొల్లగొట్టింది. మ్యాచ్ విన్నర్ అయిన తెలుగమ్మాయిని రూ.1.30కోట్లకు ఢిల్లీ క్యాపిటల్స్ సొంతం చేసుకుంది. వన్డే ప్రపంచ కప్‌లో 14 వికెట్లతో రాణించిన శ్రీ చరణి కోసం ఫ్రాంచైజీలు పోటీపడ్డాయి. గత సీజన్‌లో రూ.55 లక్షలకే ఈ స్పిన్నర్‌ను తీసుకున్న ఢిల్లీ ఈసారి మెగా వేలంలో రూ.1.30 కోట్లు చెల్లించేందుకు సిద్ధమైంది. వరల్డ్ కప్‌లో భారత జట్టు విజయాల్లో కీలకమైన పేసర్ క్రాంతి గౌడ్ సైతం కోటిన్నర పలికింది. పవర్ ప్లేలో చెలరేగిపోయే ఈ స్పీడ్‌స్టర్‌ను యుపి వారియర్స్ ఆర్‌టిఎం ద్వారా రూ.50 లక్షలకు తీసుకుంది. నిరుడు ఢిల్లీకి ఆడిన రాధా యాదవ్‌ను ఈసారి మాజీ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు దక్కించుకుంది. వేలంలో ఈ ఆల్‌రౌండర్‌ను రూ.65 లక్షల కు సొంతం చేసుకుంది ఆర్సీబీ డబ్ల్యుపిఎల్ మూడో సీజన్లో ఆర్సీబీకి ఆడిన ఆశా శోభన వేలంలో భారీ ధర పలికింది. యుపి రూ.1.10కోట్లకు కొన్నది. ఇంగ్లాండ్ పేసర్ లారెన్ బెల్ కూడా వేలంలో కోటికి ముందర ఆగిపోయింది. లైన్ అండ్ లెంగ్త్‌తో బ్యాటర్లను ఇరుకున పెట్టే ఈ పేస్ గన్‌ను ఆర్సీబీ రూ.90 లక్షలకు దక్కించుకుంది.



# ఫోకస్




## 'చీకటి'లో వెలుగు రేఖ లిహువా





ఎలాంటి శారీరక వైకల్యం లేకపోయినా, ఎంతో మంది జీవితాలను నిరాశగా, నిస్సత్తువతో వెళ్లదీస్తుంటారు. అతి కొద్దిమంది మాత్రమే వైకల్యాలను అధిగమించి, సమాజంపై తమదైన ముద్ర వేస్తారు. అత్యంత ప్రతికూల పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకుండా, ఆశను, ధైర్యాన్ని, సేవాభావాన్ని వెలిగిస్తూ సమాజానికి మార్గదర్శకులుగా నిలుస్తారు. అలాంటి వారిలో చైనాలోని జెజియాంగ్ రాష్ట్రం, జియాసింగ్‌కు చెందిన జూ లిహువా ఒకరు. 1957లో జన్మించిన ఆమె, జీవితంలోని కీలక దశలో గ్రేడ్ 1 దృష్టి వైకల్యాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. కళ్లలో వెలుగు తగ్గినా, ఆమె హృదయంలోని వెలుగు మాత్రం మరింత ప్రకాశించింది. సాధారణంగా దృష్టి కోల్పోవడం అంటే జీవితమే చీకటిలో కలిసినట్లు అనిపిస్తుంది. కానీ, లిహువా దాన్ని శాపంగా కాక, సమాజానికి సేవ చేయాలనే సంకల్పంగా మార్చుకుంది. ఆమె స్వయంగా సంపూర్ణ దృష్టి లేకపోయినా, దృష్టివైకల్యంతో బాధపడుతున్న వేలాది మందికి వెలుగువంటి వ్యక్తిగా మారింది. ఇప్పుడు ఆమె జెజియాంగ్ అసోసియేషన్ ఆఫ్ ది బ్లైండ్ సంస్థ అధ్యక్షురాలు... జియాసింగ్ డిసేబుల్డ్ పీపుల్స్ ఫెడరేషన్ ప్రెసిడియం ఉపాధ్యక్షురాలు. చైనా ప్రభుత్వానికి సలహాలు, సూచనలు అందించే అత్యంత కీలకమైన 'చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కాన్స్టిట్యూటివ్ కాన్ఫరెన్స్' (సిపిపిసిసి) జియాసింగ్ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు.. 'లిహువా మసాజ్ ఇనిస్టిట్యూట్' స్థాపకురాలు. ఇన్ని పదవుల వెనుక ఆమె సేవాభావం, కష్టపడి పనిచేసే తత్వం, పనిపట్ల నిబద్ధత, ఇతరులకు మార్గదర్శకం చేయాలనే తపన ఉన్నాయి. అంగవైకల్యం ఉన్నప్పటికీ, తన జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దుకున్న రోల్‌మోడల్‌గా లిహువా గౌరవ మర్యాదలు అందుకుంటున్నది. జెజియాంగ్ రాష్ట్రంలోని అత్యంత ప్రభావవంతమైన వ్యక్తుల్లో ఆమెకు స్థానం దక్కింది. లిహువా స్థాపించిన మసాజ్ ఇనిస్టిట్యూట్ అనేది కేవలం చికిత్సా కేంద్రం మాత్రమే కాదు.. దృష్టివైకల్యం ఉన్న వ్యక్తులకు ఉపాధి, నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం అందించే ఆశాకిరణం. ఆమె శిక్షణనిచ్చిన అనేక మంది ఈరోజు తమ జీవితం స్వతంత్రంగా నిర్మించుకుంటున్నారు. మనోధైర్యం ఉండాలే గానీ, జీవితంలో అడ్డంకులు ఎదుర్కోవడానికి, ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వైకల్యాలు అడ్డుకావని ఆమె జీవితం పాఠాలు నేర్పుతుంది. చీకటిలో ఉన్నప్పుడు చాలామంది వెలుగును కోరుకుంటారు. కానీ కొందరు మాత్రం తామే వెలుగై ఇతరుల చీకట్లను తొలగిస్తారు. లిహువా అలాంటి అరుదైన వెలుగు. ఆమె జీవితం లక్షలాది మంది దివ్యాంకుల ధైర్యం.

## మలివయసు సమస్యలు..



మలివయసు వారిని ప్రతి నిత్యం ఇబ్బందికి గురిచేసే ముఖ్యమైన సమస్య మలబద్ధకం. తగినంత శారీరక శ్రమ లేకపోవటం, దానికి తోడు సరిగా నమల లేక పీచు పదార్థాలుకూరగాయల వంటివి బాగా తగ్గించి, నమలాల్సిన అవసరం అంతగా లేని తేలిగ్గా తినటానికి వీలైన శుద్ధి చేసిన (రిఫైన్డ్) పదార్థాలనే ఎక్కువగా తీసుకోవటం వల్ల ఈ సమస్య మరింతగా ముదురుతుంది. కాబట్టి దీనికి పరిష్కారమేమిటో మనకు తేలిగానే అర్థమవుతోంది. పీచు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు, ముడి ధాన్యాల వంటివి ఎక్కువగా తినాలి. నీరు సమృద్ధిగా తాగాలి. పీచు లేని, బాగా శుద్ధి చేసిన పదార్థాలు తగ్గించాలి. ముఖ్యంగా ప్రతిరోజూ మలవిసర్జన జరిగితేనే హాయిగా ఉంటుందన్న భావన నుంచి బయటపడటం అవసరం. మలవిసర్జన రోజుకు మూడు సార్ల నుంచీ వారానికి మూడు సార్ల వరకూ... సహజమే. కాబట్టి ప్రతి రోజూ విసర్జన జరగాల్సిందేనన్న భావనతో ఆలోచనలన్నీ దానిచుట్టూనే తిప్పుకోవటం అనవసరం. మలబద్ధకం ఇబ్బంది పెడుతున్నప్పుడు వైద్యులను సంప్రదిస్తే ఆహారపరమైన మార్పులతో పాటు అవసరాన్ని బట్టి సబ్జాగింజల పొట్టు వంటి సహజమైన, నీటిలో కలుపుకొని తాగే పొడి వంటివాటినీ సిఫార్సు చేస్తారు, వీటితో తేలికగానే బయటపడొచ్చు. ఇక కారణాలు వేరైనా మలివయసులో స్త్రీపురుషులు ఇవరువురినీ కూడా మూత్రం ఆపుకోలేని సమస్య ఇబ్బంది పెట్టొచ్చు. 50 ఏళ్లు దాటిన స్త్రీలకు కటి కండరాలు బలహీనపడటం వల్ల మూత్రం లీకవటం, ఆపుకోలేకపోవటం, తరచూ వెళ్లాల్సి వస్తుండటం వంటి బాధలు చాలా ఇబ్బంది పెడతాయి. అలాగే పురుషుల్లో ఈ వయసుకు వచ్చేసరికి ప్రోస్టేటు గ్రంథి ఉబ్బటం వల్ల మూత్రం ఆపుకోలేకపోవటం, బొట్టు బొట్లుగా రావటం, ఎంత వెళ్లినా ఇంకా పూర్తి విసర్జనకాని భావన కలగటం వంటి లక్షణాలు వేధిస్తుంటాయి. వీరు ఒక్కసారి వైద్యులకు చూపించుకుని సమస్యేమిటన్నది కచ్చితంగా నిర్ధారణ చేయించుకోవటం ముఖ్యం. ఎందుకంటే ఈ వయసులో కొన్నిరకాల క్యాన్సర్లలో కూడా ఇలాంటి లక్షణాలే కనబడొచ్చు. కాబట్టి వీటిని నిర్లక్ష్యం చెయ్యరాదు. మూత్రం ఆపుకోలేని సమస్యకు ఇప్పుడు స్త్రీపురుషులకు ఇరువురికీ కూడా చాలా రకాల చికిత్సా మార్గాలు, పరిష్కారాలు న్నాయి. కాబట్టి వీటి గురించి వైద్యులతో చర్చించటం ఉత్తమం.

ఈ మధ్యకాలంలో వయసుతో సంబంధం లేకుండా మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. మలివయసులో ఈ సమస్యలు అధికం. యుక్తవయసు నుంచీ ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించటం ద్వారా వీటిని సాధ్యమైనంత వరకూ దరిజేరకుండా చూసుకోవచ్చుగానీ అన్నిసార్లూ వీటిని పూర్తిగా తప్పించుకోలేకపోవచ్చు. వీటిని నిర్లక్ష్యం చేస్తే గుండెజబ్బులు, పక్షవాతం వంటి రకరకాల సమస్యలు వెంటాడతాయి. కాబట్టి తరచూ పరీ

### రక్తపోటు.. మధుమేహం సరేసరి

క్షలు చేయించుకుంటూ, చికిత్స కొనసాగిస్తూ వీటిని కచ్చితంగా అదుపులో ఉంచుకోవాలి. అలాగే మలివయసులో ఎదురయ్యే మరో పెద్ద సమస్య క్యాన్సర్. స్త్రీలలో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు, పురుషుల్లో ప్రోస్టేటు గ్రంథి క్యాన్సర్ల వంటివి ఎక్కువ. వూపిరితిత్తులు, పెద్దపేగు క్యాన్సర్ల వంటివి ఇద్దరిలోనూ కనబడుతుంటాయి. కాబట్టి ఒంట్లో ఎక్కడైనా గడ్డలు రావటం, వీడకుండా దగ్గు వేధించటం, మలవిసర్జన అలవాట్లు మారిపోవటం, రక్తం కనబడటం, బరువు తగ్గిపోవటం, పుండ్లు మానకపోవటం వంటి లక్షణాలేవైనా కనబడితే వాటిని ఏమాత్రం నిర్లక్ష్యం చెయ్యకుండా వైద్యుల దృష్టికి తీసుకువెళ్లాలి.


## సమస్యల పరిష్కారానికి పోరాడే వారిని ఆదరించండి

### సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మా పిలుపు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** సమస్యల పరిష్కారానికి పోరాడే వారిని ప్రజలు ఆదరించాలని, జిల్లాలో జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా పిలుపునిచ్చారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 50 గ్రామపంచాయతీల్లో సిపిఐ అభ్యర్థులు సర్పంచులుగా కొన్నిచోట్ల వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్నారని తెలిపారు. సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలరు కోరారు. సమావేశంలో సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన రాష్ట్ర ప్రచారజాతాకు నాయకత్వం వహించి జిల్లాకు విచ్చేసిన బాల్‌నర్సింహ్మాను సిపిఐ జిల్లాసమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించా రు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి, రాష్ట్ర సమితి సభ్యులు కేశవులుగౌడ్, జిల్లాకార్యవర్గ సభ్యులు ఈర్ల చంద్రమౌళి, ఆర్.ఇందిర, కొమ్ము భరత్, తుమ్మల శివుడు, ప్రేమ్‌కుమార్, కిరణ్‌కుమార్, గోపాల్, బండి లక్ష్మి పతి, సయ్యద్, ఖాజమైనోద్దిన్, కుతుబుద్దిన్, నరేష్, మధుగౌడ్ పాల్గొన్నారు.

## సిపిఐలో భారీ చేరికలు



**ప్రజాపక్షం/చింతకాని :** కమ్యునిస్టుల అవసరం నేటికాలంలో ప్రజలకు అవసరం ఉందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని బస్వాపురం గ్రామంలో పలు పార్టీల నుండి గురువారం జితేందర్‌రెడ్డి సమక్షంలో సిపిఐలో భారీగా చేరారు. జితేందర్‌రెడ్డి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బస్వాపురంలో జరిగిన సభలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ సామాన్య ప్రజలందరూ కమ్యునిస్టుల పాలన కోసం ఎదురు చూస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో కమ్యునిస్టులదేపై చేయి అవుతుందన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో బస్వాపురంలో సిపిఐ జెండా రెపరపలాడాలని ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు,పావులూరి మల్లిఖార్జునరావు, సిజిల్లా కౌన్సిల్ సభ్యులు రాసాల మోహనరావు మండల సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, నాయకులు కన్నెబోయిన విజయమ్మ, బొడ్డు కొండలరావు, ఆవుల నర్సింహారావు, బద్దల సైదులు, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు, పుల్ల వెంకయ్య, కుక్కల సైదులు, దొంతగాని రాంబాబు, తిరుమలరావు, శ్రీకాంత్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్

### వర్ధంతి సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు



**ప్రజాపక్షం/ఖమ్మం :** నిబద్ధత గల కమ్యూనిస్టు పోటు ప్రసాద్ అని, తుది శ్వాస వరకు పార్టీ విస్తరణకు, పేదల అభ్యున్నతికి కృషి చేశారని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన మహోన్నతుడు అన్నారు. సిపిఐ జిల్లా మాజీ కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభ గురువారం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హేమంతరావు మాట్లాడుతూ సాయుధ పోరాట వారోత్స కుటుంబంలో జన్మించిన పోటు ప్రసాద్ తుదిశ్వాస వరకు అదే పంథాను కొనసాగించారన్నారు. విద్యార్థి దశలో విద్యార్థి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యంగా ఖమ్మంలో పిజి కళాశాల సాధన కోసం జరిగిన విద్యార్థి ఉద్యమంలో పోటు ప్రసాద్ క్రియాశీలక భూమిక పోషించారని ఆయన తెలిపారు. కార్మిక సంఘ నాయకుడిగా పని చేసిన పోటు ప్రసాద్ సంఘటిత, అసంఘటిత రంగాలలో బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించారన్నారు. కమ్యూనిస్టు పార్టీ శత వసంత సంబురాలు ఖమ్మంలో జరగబోతున్నాయని ఈ సమయంలో పోటు ప్రసాద్‌లేని లోటు అడుగడుగునా కనిపిస్తుందన్నారు. జాతీయ మహాసభలను ఖమ్మంలో నిర్వహించాలని తలపెట్టిన ఆలోచనపరుడు ప్రసాద్ అని ఆయన వర్ధంతి సందర్భంగా ప్రసాద్ ఆలోచనలను, ఆశయాల ను ప్రజల్లోకి తీసుకు పోవడమే మనం ఆయనకు ఇచ్చే సరైన నివాళి అన్నారు. అభ్యుదయవాదిగా, నికార్సయిన కమ్యూనిస్టుగా జీవించిన ప్రసాద్ కమ్యూనిస్టు ఉద్యమం ఉన్నంత కాలం చిరస్థాయిగా నిలిచి ఉంటారని హేమంతరావు తెలిపారు. అంతకు ముందు పోటు ప్రసాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి సభలో రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, ఏపూరి లతాదేవి, సిద్దినేని కర్ణకుమార్, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్, సతీమణి నిర్మల, సోదరి పోటు కళావతి తదితరులు పాల్గొన్నారు.

**40వ డివిజన్‌లో...** సిపిఐ నాయకుడు పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతి సభను 40వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. డివిజన్ ఏర్పాటు చేసిన ప్రసాద్ స్మారక స్తూపం వద్ద పార్టీ పతాకాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ బిజి క్లెమెంట్ అధ్యక్షతన జరిగిన సభలో హేమంతరావు మాట్లాడుతూ 40వ డివిజన్‌లో పార్టీ శాఖ ఏర్పాటుకు పోటు ప్రసాద్ విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, పోటు కళావతి, తోట రామాంజనేయులు, గాదె లక్ష్మి నారాయణ, పోటు పూర్ణ, వరదా నర్సింహారావు, పోటు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరా నగర్ పైలాన్ వద్ద :** ఇందిరా నగర్ పైలాన్ వద్ద పోటు ప్రసాద్ ప్రథమ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ తనయుడు సాత్విక్ పోటు ప్రసాద్ స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు ఎస్‌కె జానిమియా, ఏపూరి లతాదేవి, పోటు కళావతి, పోటు నిర్మల, తాటి వెంకటేశ్వరరావు, పగడాల మల్లేష్, ఏనుగు గాంధీ, వరదా నర్సింహారావు, బండారుపల్లి నవీన్, సత్యనారాయణరెడ్డి, వెంకన్న, నాగేశ్వరరావు, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు నానబాల రామకృష్ణ, ఇటికాల రామకృష్ణ, ఆముదాల వెంకన్న, జాకీర్, తాటి నిర్మల, అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.





## 'ఎస్‌టియు' బలోపేతానికి కృషి

### ఎస్‌టియు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కిన నాయకులు

**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** ఎస్‌టియు రాష్ట్ర కార్యవర్గంలో హనుమకొండ జిల్లా నుంచి ముగ్గురికి చోటు లభించినట్లు సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కామగోని రాంబాబు, వేమునూరి రాంబాబు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నామాని సాంబయ్య, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా సూర రమేష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ మెంబర్‌గా మాలోత్ గణపతి నియామకం అయ్యారని వారు తెలిపారు. నామాని సాంబయ్య పరకాల మండలంలో పిజి హెచ్ఎంగా, సూర రమేష్ శాయంపేట మండలంలో స్కూల్ అసిస్టెంట్‌గా, మాలోత్ గణపతి సోమిడి ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా వారు రాష్ట్ర కార్యవర్గంలో చోటు దక్కిన సాంబయ్య, రమేష్, గణపతిలు మాట్లాడుతూ జిల్లాలో ఎస్‌టియు సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.







## కార్మికుల శ్రమ దోచుకుంటున్న కాంట్రాక్టర్లు

### మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి సురేష్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికుల శ్రమను ఏజెన్సీ కాంట్రాక్టర్లు దోచుకుంటున్నారని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ఆరోపించారు. వేతనాల పెంపు కోసం చేపట్టబోయే ఆందోళన డిమాండ్ నోటీసును మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి అడ్మినిస్ట్రేట్ అధికారి డాక్టర్ ప్రేరణకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కాల పరిమితి ముగిసిన పాత ఐహెచ్ఎఫ్ఎంఎస్ ఏజెన్సీ టెండర్లను రద్దు చేసి నూతన టెండర్లలో ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులకు కనీస వేతనం 26 వేలకు పెంచుతూ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 1 నుండి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన బాట పడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వ దవాఖానలో శానిటరీ భద్రత రోగి సంరక్షణ కోసం ప్రభుత్వం మూడు సంవత్సరాలకోసారి ఏజెన్సీలోని ఎంపిక చేస్తారని, 2022 సంవత్సరంలో ప్రభుత్వం ఐహెచ్ఎఫ్ఎంఎస్ టెండర్ల ద్వారా ప్రస్తుత ఏజెన్సీలను నియమించారని వాటి మూడు సంవత్సరాల కాలపరిమితి దాటి ఆరు నెలలు గడుస్తున్నాదని అయినా ఇప్పటికీ కొత్త ఏజెన్సీల ఏర్పాటు ప్రక్రియని ప్రభుత్వం ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత టెండర్లలో కొన్ని తప్పిదాల కారణంగా ఏజెన్సీ కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా కార్మికుల శ్రమను దోచుకున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలకు పెంచుతూ నూతన టెండర్ల నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీని కోసం డిసెంబర్ 1 నుంచి వివిధ రూపాలలో ఆందోళన కార్యక్రమాల కొనసాగించి ఐదున చలో హైదరాబాద్ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఒలు డాక్టర్ గణేష్, డా.శిరీష, డా.ఇషిన్ ముస్తాక్, ఆసుపత్రి బ్రాంచ్ యూనియన్, కార్మికులు రంగన్న, రామకృష్ణ, శ్రీను, అంజి, గంగాధర్, మల్లమ్మ, వరలక్ష్మి, జ్యోతి, నాగలక్ష్మి, సునిత, చంద్రకళ, లక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## రైతు భరోసా అందరికీ ఇవ్వాలి

ప్రజాపక్షం/ఉట్నూర్: యాసంగిలో శాటిలైట్ మ్యాపింగ్ ద్వారా సాగు విస్తీర్ణం లెక్కించి రబీ సీజన్‌లో పంటలు వేసిన వారికి మాత్రమే రైతు భరోసా అందించే ఆలోచన సరియైనది కాదని సామాజిక కార్యకర్త హెచ్.నరసింహా తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తమ శాఖకు నూటికి నూరుశాతం న్యాయం చేస్తున్నారని అన్నారు. కానీ రబీలో కేవలం సాగు భూమికి మాత్రమే రైతు భరోసా ఇస్తాం అనడం అన్యాయమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సాగునీరు లేక చాలా జిల్లాలో రైతులు వర్షం పై ఆధారపడి పంటలు వేస్తున్నారు. కావున వర్షాధార పంటలకు ఖరీఫ్ మరియు రబీ రెండు సీజన్‌లో రైతు భరోసా వేయాలని కోరారు. ఒక వేళ ప్రభుత్వానికి రైతు భరోసా ఇవ్వడానికి భారం అయితే భూమి వందల ఎకరాలు సాగు చేసిన కూడా కేవలం 5 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా పరిమితి పెట్టి 5 ఎకరాలకు రైతు భరోసా ఇవ్వాలని సూచించారు.

## నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి



ప్రజాపక్షం/ కొత్తకోట: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని సిఐటియు జిల్లా కోశాధికారి బొబ్బిలి నిక్సన్ ఆరోపించారు. గురువారం నాడు కొత్తకోట చౌరస్తాలో నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి 29 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడులను వెనక్కి తీసుకొని రద్దు చేసే వరకు పోరాటం చేస్తామని ఆరోపించారు.రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని ఉపాధి హామీ కార్మికులకు సంవత్సరానికి రూ. 200 రోజులు పని కల్పించాలని రోజువారిగా 800 రూపాయలు కూలి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షులు కె. కృపయ్య, కార్యదర్శి శివ , ఉపాధ్యక్షులు జె. శ్రీను, నో వేలు పెద్దరాజు. ప్రసాదు బాబు, బుచ్చన్న వెంకటస్వామి, మన్నెమ్మ, లక్ష్మి , మంజుల,స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ప్రజాపక్షం/ వనపర్తి టౌన్ :మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ముత్తూట్ ఫిన్ కార్ప్‌లో అందించే సేవలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలనీ ముత్తూట్ ఫిన్ కార్ప్ రీజనల్ మేనేజర్ శ్రీకాంత్ కొమ్మల అన్నారు. గురువారం వనపర్తి పట్టణ కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా అపోలో ఫార్మసీ పై ఉన్న ముత్తూట్ ఫిన్ కార్ప్ కు ముఖ్యఅతిథిగా విచ్చేసిన రీజనల్ మేనేజర్ శ్రీకాంత్ కొమ్మలకు బ్రాంచ్ మేనేజర్ నరసింహ బొకెతో స్వాగతం పలికారు. గత నెల అక్టోబర్ 15న కేతావత్ దేవిసింగ్ అనే కస్టమర్ గోల్డ్ లోన్ 100025 తీసుకున్నారు. ఆ వ్యక్తి పోటీల్లో గెలిచారని, వాషింగ్ మిషన్ ఇచ్చామని తెలిపారు. రీజనల్ మేనేజర్ శ్రీకాంత్ కొమ్మల మాట్లాడుతూ. ముత్తూట్ ఫిన్ కార్ప్ లో అందించే సేవల ను ప్రతి ఒక్కరూ తప్పకుండా వినియోగించుకోవాలని మహిళలు ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. బ్రాంచ్ మేనేజర్ నరసింహ మాట్లాడుతూ. పర్సనల్ యాక్సిడెంట్ ప్రీమియం కేవలం 79 రూపాయలకే ఒక సంవత్సరం లభిస్తుందని అన్నారు.రీజనల్ మేనేజర్ శ్రీకాంత్, కోమల, జోనల్ మార్కెటింగ్ మేనేజర్ కృష్ణ పవన్ ఇన్సూరెన్స్ జోనల్ మేనేజర్ ఇంతియాజ్, అరవింద్ ముత్తూట్ ఫిన్ కార్ప్ బ్రాంచ్ మేనేజర్ నరసింహ, బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ యాదగిరి, రాఘవ, సిల్మర్ధి ఆంజనేయులు, అంజలి, అరవింద్, హరిణి, ముత్తూట్ ఫిన్ కార్ప్ ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవిక్లబ్ ఆధ్వర్యంలో సేవలు



ప్రజాపక్షం/జడ్చర్ల: జడ్చర్ల వాసవి క్లబ్, వనిత క్లబ్ గవర్నర్ మిడిదొడ్డి రాధాకృష్ణ పర్యటన సందర్భంగా గురువారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు విశేషమైన సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయం శ్రీ వాసవి కన్యకా అమ్మవారిని దర్శించుకుని దేవాలయానికి 20 వేల రూపాయల మైక్ సెట్ ఇవ్వడం జరిగింది. తదుపరి అనురాగిణి బాలుర ఆశ్రమంలో నోటుబుక్స్, భోజనం ఏర్పాటుకు నగదు ఇవ్వడం జరిగింది. అనంతరం జడ్చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంచడం జరిగింది. ప్రస్తుత అధ్యక్షులు చిత్తనూరి రామకృష్ణ, వారి సభ్యులు గవర్నర్ గుడ్‌విల్ సందర్భంగా ఇక్కడ సందర్శన చేయించి ఇన్ని విశేష కార్యక్రమాలు చేపట్టడం పట్ల కుల ప్రముఖులు, అధ్యక్షులు అభినందనలు తెలిపారు.స్థానిక అధ్యక్షులు చిత్తనూరి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి నవీన్, గవర్నర్ రాధకృష్ణ, కాబినెట్ సెక్రెటరీ కండె కృష్ణ, వనిత వాసవి క్లబ్ అధ్యక్షురాలు చిత్తనూరి జ్యోతి, ప్రధాన కార్యదర్శురాలు చిగుళ్లపల్లి వసుధ రాజ్, జోన్ చైర్మన్ లాగిశెట్టి శేఖర్, మాజీ అధ్యక్షులు సత్యం శెట్టి,రాచమళ్ల ఆనంద్,ఆగేరు వీరేశం,జి.పి.ప్రవీణ్,దిలీప్,నరేష్‌పాల్గొన్నారు.

## సింగిల్ విండో డైరెక్టర్‌కు పరామర్శ

ప్రజాపక్షం/మక్తల్: నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ముసలయపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు సింగిల్ విండో డైరెక్టర్ పెద్ద లింగప్ప గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్‌రెడ్డి గ్రామానికి వెళ్లి పెద్ద లింగప్పను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పారేవుల మాజీ సర్పంచు వెంకటేశ్వర్‌రెడ్డి, పారేవుల మాజీ ఎంపీటీసీ ఆశిరెడ్డి, ముసలాయపల్లి బిఆర్ఎస్ మాజీ సర్పంచు కురువ వెంకటప్ప, గ్రామ పార్టీ అధ్యక్షులు ఎం.వెంకటేశ్, అభిరామ్, వార్డుమెంబర్ సాకలి వెంకటేశ్, కావాలి ఆంజనేయులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జ్యోతి బాపూలే వర్ధంతి

ప్రజాపక్షం/మక్తల్: నేడు మహాత్మా జ్యోతి బాపూలే 135వ వర్ధంతి సందర్భంగా ఉదయం 9.30 గంటలకు మహాత్మా పూలే చౌరస్తా, కన్యకాపరమేశ్వర గుడిదగ్గర, డా.బి.ఆర్.అంబేద్కర్ యువజన సంఘం మక్తల్ అధ్యక్షులు పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి బండారి కృష్ణ, ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. విద్య విప్లవకారుడు , మహిళా విద్యకు మూలపురుషుడు, మహాత్మా జ్యోతిబాపూలే 135వ వర్ధంతి కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు, ప్రజా స్వామికవాదులు, పూలేఅంబేద్కరిస్టులు, మీడియా ప్రతినిధులు, యువకులు పాల్గొననున్నారు.

## గుట్కా ప్యాకెట్ల పట్టివేత

### మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి



ప్రజాపక్షం/మక్తల్: మక్తల్ పట్టణ కేంద్రంలో ఆలంపల్లి రంగనాథ్ తండ్రి విజయ్ కుమార్ అనే వ్యక్తికి చెందిన కిరాణాషాపులో అంబర్ జర్దా గుట్కా ప్యాకెట్లను నిల్వ ఉంచి ప్రజలకు అమ్ముతున్నందున పక్క సమాచారంతో టాస్క్‌ఫోర్స్ మక్తల్ పోలీసులు దాడులు నిర్వహించి 31,470 రూపాయల విలువ గల గుట్కా, ప్యాకెట్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఆలంపల్లి రంగనాథ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు.

# నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి

### కలెక్టర్ బదావత్‌సంతోష్



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : మొదటివిడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, ఎన్నికల నిబంధనలను విధిగాపాటించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన 151 సర్పంచులు, 1326వార్డుమెంబర్ల స్థానాలకు నామినేషన్‌ప్రక్రియ నోటీస్ విడుదల చేసినట్లు తెలిపారు. గురువారం జిల్లా ఎన్నికల అథారిటి, కలెక్టర్ బదావత్‌సంతోష్ తాడూరు మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన తాడూరు గ్రామసర్పంచ్, 12వార్డులకు సంబంధించిన రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో చేపడుతున్న నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన అంశాలపై రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో చేపడుతున్న నామినేషన్ల ప్రక్రియ ఏర్పాట్లను తనిఖీచేశారు.కలెక్టర్ మాట్లాడుతూ మొదటివిడతలో ఎన్నికలు నిర్వహించాల్సిన గ్రామపంచాయతిల సర్పంచులు వార్డుసభ్యుల స్థానాలకు డి సెంబర్ 11న ఎన్నికలు నిర్వహించబడుతాయని తెలిపారు. తాడూరు, తెలకపల్లి, కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ, వంగూరు మండలాలని నామినేషన్ల ప్రక్రియకుఅవసరమైనఏర్పాట్లు పూర్తి అయ్యాయని వివరించారు. నేటి ఉదయం 10.30గంటలనుండి న వంబర్ 29వతేది సాయంత్రం 5గంటల వరకు నామినేషన్లు స్వీకరించబడుతాయని , పోటి చేయాలనుకునే అభ్యర్థులు ప్రతిపాదకుడి సాయం , నిర్ణిత రుసుము చెల్లించి నామినేషన్ దాఖలు చేయాలని సూచించారు.నవంబర్30నస్క్రూటిని నిర్వహించి సాయంత్రం 5గంటలకు చెల్లుబాటు అయ్యే నామినేషన్ల జాబితా ప్రకటించబడుతుందన్నారు.

**వరికొనుగోలు కేంద్రం పరిశీలన**

తాడూరు మండలపరిధిలోని ఐతోల్ గ్రా మంలో వరి కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ బదావత్‌సంతోష్ గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

## తొలిరోజు 25 నామినేషన్లు దాఖలు



ప్రజాపక్షం/కల్వకుర్తి : కల్వకుర్తి మండలపరిధిలోని 24 గ్రామపంచాయతీలకుగాను 8 క్లస్టర్లలో సర్పంచ్, వార్డుసభ్యులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాటుచేసిన ఆరో కార్యాలయంలో గురువారం ఆయా గ్రామాల సర్పంచ్ అభ్యర్థులు 25 నామినేషన్లు దాఖలు కావడం జరిగిందని, 24 గ్రామపంచాయతీలో గల 214 వార్డుసభ్యులకుగాను 17మంది ఆయా స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారని కల్వకుర్తి ఎంపిడిఓ వెంకట్‌రాములు తెలిపారు.

**గ్రామ అభివృద్ధికి కృషి**

తాండ్రగ్రామ అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానని, గ్రామ అభివృద్ధిధ్యేయంగా ముందుకు సాగుతానని తాండ్ర గ్రామసర్పంచ్ అభ్యర్థి ఆశాదీప్‌రెడ్డి తెలిపారు. తాండ్ర గ్రామంనుండి పలు వాహనాలలో ర్యాలీగా బయలుదేరి ఎల్లికల్ గ్రామంలో ఆర్‌డిఓ కార్యాలయంలో తాండ్ర గ్రామసర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు సాయిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాల తనిఖీ



ప్రజాపక్షం/వనపర్తి : గురువారం రోజు గ్రామపంచాయతీ సర్పంచ్ ఎన్నికల మొదటి విడత నామినేషన్ల దృష్ట్యా గోపాల్ పేట్, మండలంలోని గొపాల్ పేట్, తాడిపత్రి, గ్రామపంచాయతీలు, ఎదుల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎదుల గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన నామినేషన్, పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ ఆకస్మికంగా పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల్లో విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందితో ఎస్పీ ప్రత్యేకంగా మాట్లాడి, ఎన్నికల నియమావళి ప్రకారం నామినేషన్ ప్రక్రియ పూర్తిగా నిష్పక్షపాతంగా, శాంతియుతంగా జరుగేలా పని చేయాలని పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛిత పరిస్థితులు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు పారదర్శకమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత ప్రతి సిబ్బందిపైన ఉందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. ఎన్నికలలో శాంతిభద్రతలను కాపాటంలో ఎలాంటి రాజీ ఉండదు. ఎన్నికల ప్రక్రియను భంగపరచాలని చూస్తే కఠిన చట్టపరమైన చర్యలు తప్పవు'' అని స్పష్టం చేశారు. జిల్లాలోని సెన్సిటివ్ గ్రామాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ప్రతి పోలింగ్ కేంద్రంలో పకడ్బందీ బందోబస్తు, పెట్రోలింగ్, క్విక్ రెస్పాన్స్ టీంలను సిద్ధంగా ఉంచినట్లు ఎస్పీ తెలిపారు. అక్రమ డబ్బు, మద్యం పంపిణీ, బెదిరింపులు, అనైతిక ప్రలోభాలు వంటి తప్పిదాలు ఎక్కడైనా గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి, వెంకటేశ్వర్ రావు, కొనపర్తి సిఐ కృష్ణయ్య గోపాల్పేట్ ఎస్సై, నరేష్, రేవల్లి ఎస్సై, రజిత, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రైతుల గోస ఎవరికీ పట్టదా? : రాచాల

ప్రజాపక్షం/వనపర్తి టౌన్ : ఆరుగాలం శ్రమించి పండించిన పంట నెలరోజులకు పైగా కొనుగోలు కేంద్రాలలో మగ్గుతున్నా. రైతులు పడుతున్న గోస ఎవరికి పట్టడం లేదని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వనపర్తి మండలం అంకూర్ గ్రామంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించి ధాన్యం రాశులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో అధికారులు ప్రజా ప్రతినిధులు క్షేత్రస్థాయిలో పర్యటించిరైతులుపడుతున్న ఇబ్బందులను కళ్ళు తెరిచి చూడాలన్నారు. నెల రోజులకు పైగా కొనుగోలుకేంద్రానికిరైతులుతీసుకొచ్చినవరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడం వల్ల రైతులు పడిగాపులు కాస్తూ తీవ్ర సమస్యలతో అక్కడే ఉండాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ. లావు రకం వడ్లను దించుకోకుండా రైతులను ఇబ్బందులు పెడుతున్న వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ఇది మళ్ళీ పునరావృతం అయితే రోజుకో ఎపిసోడ్ మాదిరిగా అధికారుల లీలలు బయట పెట్టాల్సిన వస్తుందని హెచ్చరించారు.

## బిసిలకు అన్యాయం చేసిన వారిని నిలదీయండి

### బిజెపి అధికార ప్రతినిధి బాలవర్ధన్‌గౌడ్



ప్రజాపక్షం/జడ్చర్ల: కామారెడ్డి సభలో 42% రిజర్వేషన్‌ఇస్తామన్న రేవంత్ రెడ్డి మాట తప్పారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను, మంత్రులను నిలదీయాలని మహబూబ్‌నగర్ జిల్లా బిజెపి పార్టీ అధికార ప్రతినిధి ఎడ్ల బాలవర్ధన్‌గౌడ్ అన్నారు. రేవ ంత్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు గత ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని విమర్శించిన ఆయనే ఇప్పుడు బడుగు బలహీన వర్గాలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. గ్రామస్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రచారానికి వచ్చే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులను ప్రజలు నేరుగా ప్రశ్నించాలని ఆయన పిలుపునిచ్చారు. అధికారంలోకి రాకముందు మాయమాటలు చెప్పి అధికారం చేయెక్కించుకున్న తర్వాత బీసీలను ఈ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. బీసీల పక్షాన పోరాడుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేడు బడుగు బలహీన వర్గాలకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. తన స్వగ్రామమైన గొల్లపల్లి పంచాయితీలో వార్డు సభ్యుల రిజర్వేషన్లలో బీసీలకు భారీ అన్యాయం జరిగిందని, తక్కువ జనాభా ఉన్న ఎస్సీ , ఎస్టీలకు వరుసగా రెండు సీట్లు కేటాయించగా, అధిక జనాభా ఉన్న బీసీలకు మాత్రం ఒక్కటే సీటు ఇవ్వడం ఏం న్యాయమని ప్రశ్నించారు. బీసీల పై దగా చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి రాబోయే స్థనిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలని, బీసీల ఐక్యత శక్తి ఏంటో కాంగ్రెస్ నేతలకు తెలియజేయాల్సిన సమయం వచ్చిందని బాలవర్ధన్ గౌడ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఉన్న అన్ని బీసీ నాయకులు ఐక్యంగా కదిలి, బీసీ పిల్లలకు రిజర్వేషన్లు పెరిగేలా కట్టుబడి పనిచేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందని స్పష్టం చేశారు.

# మౌలిక వసతుల కల్పనకు భారీగా నిధులు

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:జామియా మజీద్,వక్స్ఎరహెమానియా ఈద్గా నిర్వాహణ నూతన కమిటీ సభ్యులు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ని వారి క్యాంపు కార్యాలయంలో కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జామియా మజీద్ అభివృద్ధికి మౌలిక వసతుల కల్పన కోసం రూ.1 కోటి 50 లక్షలు, అదే విధంగా ఈద్గా అభివృద్ధికి మరో రూ.1 కోటి 50 లక్షలు కేటాయించామని తెలిపారు. ప్రార్థనా స్థలాల అభివృద్ధి ద్వారా ఆధ్యాత్మిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. దేవుడిని ప్రార్థించే చోట అందరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో నూతన కమిటీలలో 90 శాతం కొత్తవారికి అవకాశం కల్పించామని, అందులో విద్యావంతులు, అనుభవజ్ఞులు, భక్తిశ్రద్ధలు కలిగిన వారిని ఎంపిక చేసి పూర్తిగా పారదర్శకవిధానంలో కమిటీ ఏర్పాటు జరిగిందన్నారు. డిసిసిప్రధానకార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, హస్పిటల్ డెవలప్‌మెంట్‌కమిటీసభ్యులు సాదుల్లా, ఈద్గా కమిటీ అధ్యక్షులు రిటైర్డ్ డిఎస్డిఓ మహ్మద్ బషీరుద్దీన్, ఉపాధ్యక్షులు ఖాజా ఖియాముద్దీన్, కార్యదర్శి అబ్దుల్ వహీద్‌ఖాన్ దురాని, సంయుక్త కార్యదర్శి మహ్మద్ జుల్ఫికర్ అలీ, కోశాధికారి ఖాదర్,మొహియోద్దీన్, సభ్యులు అబ్దుల్ మోసీన్, భాజా హస్నోద్దీన్, ఖాజాపాష, మహ్మద్ తాజుద్దీన్, డా.మీర్ ముజమీర్ అలీ, మహ్మద్ ఫరీద్‌లు జామీయ మజీద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అమీనుద్దీన్ ఖాద్రీ, ఉపాధ్యక్షులు ఫహీమ్ సిద్దిఖీ, కార్యదర్శి ఎం.ఎ.మజీద్, కోశాధికారి మజీద్ ఖాన్, సభ్యులు సయ్యద్, మసూద్, మొహియుద్దీన్, మహ్మద్ ముక్తార్ అహ్మద్, సయ్యద్ ఆఫ్జల్, సమీముద్దీన్ ఖాన్, ఫజలూర్ రహమాన్, జహంగీర్ పాష ఖాద్రీ, మహ్మద్, ముస్తాక్ పాల్గొన్నారు.

**లక్ష్యంతో శ్రమిస్తే విజయాలు**

మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినులకు ఉన్నత విద్యలో రాణించే అవకాశాలను మరింత చేరువ చేసేందుకు శ్రీనివాస్‌రెడ్డిముందడుగువేశారు. ఎప్సెట్,నీట్ వంటి ప్రతిష్టాత్మక ఎంట్రెన్స్ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్స్‌ను విద్యార్థినులకు అందజేసి వారి భవిష్యత్తుకు బలమైన మార్గదర్శనం అందించారు.ఆయన మాట్లాడుతూ విద్యే ఏ సమాజానికైనా పునాదిగా నిలుస్తుంది.

## శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ప్రజాపక్షం/మక్తల్: శాంతి భద్రతల పరిరక్షణకు మక్తల్ పట్టణ కేంద్రంలోని బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మైదానంలో మక్తల్ పోలీసులు, ప్రత్యేక సాయుధ బలగాలు కలిసి విస్తృత స్థాయిలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించామని అదనపు ఎస్పీ ఎండి.రియాజ్ హూల్ హక్ తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, ప్రజల శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా, పోలీసు సిబ్బందికి మాబ్ కంట్రోల్‌లో అనుసరించాల్సిన విధానాలు, కార్యాచరణ ప్రణాళికలు, గందరగోళ లేదా అత్యవసర పరిస్థితులు నెలకొన్నప్పుడు తక్షణ స్పందన సామర్థ్యం, ప్రజల ప్రాణ రక్షణకు చేపట్టాల్సిన జాగ్రత్తాలు వంటి అంశాలపై శిక్షణ ఇవ్వబడిందని ఆయన పేర్కొన్నారు. మాక్ డ్రిల్‌లో భాగంగా ఫుట్ ఫార్మేషన్, టీమ్ కోఆర్డినేషన్, హెచ్చరిక విధానాలు, చట్టపరమైన చర్యల అమలు పద్ధతులు వంటి అంశాలను సిబ్బంది ప్రాక్టికల్‌గా ప్రదర్శించారు. ఈ శిక్షణ ద్వారా పోలీసులు అనూహ్య పరిస్థితుల్లో మరింత చాకచక్యంగా, సురక్షితంగా ఎలా స్పందించాలో అవగాహన పొందారని అదనపు ఎస్పీ తెలిపారు. ప్రజల భద్రత పోలీసుల ప్రధాన బాధ్యత అని, ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణ, ప్రొఫెషనలిజం, సేవాభావంతో, మాబ్ కంట్రోల్ నిర్వహించగలగాలని తెలిపారు. ఇలాంటి మాక్ డ్రిల్లులు క్రమం తప్పకుండా నిర్వహించడం ద్వారా సిబ్బంది స్పందనా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తున్నామని ఆయన అన్నారు. ప్రత్యేక ఆకర్షణగా, సిబ్బందికి అవగాహన కల్పించేందుకు స్మోక్ గన్స్, ఫైర్ ఇంజన్ ద్వారా మాబ్ పై ఎలా ఫైర్ చేయాలిఅనే అంశాలను లైవ్‌గా డెమో చేసి చూపించారు. పోలీసు సిబ్బంది అనుభవం మరింత పెరిగిందని అధికారులు తెలిపారు. డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐ రామ్ లాల్, ఎస్సైలు భాగ్యలక్ష్మి రెడ్డి, ఎస్ఎం. నవీద్, అశోక్‌బాబు, రమేష్, రేవతి, ఆర్ఎస్ఐలు శివ శంకర్, మద్దయ్య, కానిస్టేబుళ్లుఉన్నారు.

## బాల్య వివాహాలను అరికట్టాల్సిందే

ప్రజాపక్షం/నారాయణపేట: జిల్లాలో బాల్య వివాహాలను సమూలంగా నివారించి బాల్య వివాహ రహిత జిల్లాగా నారాయణపేటను స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. గురువారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి అదనపు కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. చ బాలికలు తమ స్నేహితురాలలో తల్లిదండ్రుల ఒత్తిడిలో ఎవరైనా పెళ్లి చేసుకుంటున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, అలాగే చుట్టు పక్కన పరిసరాలలో లేదా ఎవరైనా తెలిసిన వాళ్లలో అలాంటి వివాహం జరుగుతున్నా సమాచారం ఇవ్వాలని, అలా సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎవరూ భయ పడవద్దని అదనపు కలెక్టర్ ధైర్యం చెప్పారు. ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. సతీసహగమనం లాంటి సామాజిక రుగ్మతను నిర్మూలించినట్లుగానే జిల్లాలో బాల్య వివాహాలను సంపూర్ణంగా నిషేధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం బాల్య వివాహ ముక్త్ భారత్ కార్యక్రమం ప్రారంభించి నేటికి ఏడాది పూర్తయిందని, మన దేశంలో చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో బలోడ్ జిల్లాను బాల్య వివాహరహిత జిల్లాగా ప్రకటించబడిందని, మన నారాయణపేట ను కూడా బాల్యవివాహ రహిత జిల్లాగా నిర్మించుకుందాం అన్నారు. చివరగా ఏసిడిపిఓ వెంకటమ్మ అందరితో బాల్య వివాహాలను అరికట్టేందుకు అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్తామని ప్రతిజ్ఞ చేయించారు.

## నామినేషన్ల ప్రక్రియలో తప్పులుండొద్దు : సీతాలక్ష్మి

ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా: జిల్లాలో గ్రామపంచాయితీ ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని నారాయణపేట జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకురాలు ఎ.సీతాలక్ష్మి అధికారులకు సూచించారు. గురువారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్‌కు వచ్చిన పరిశీలకురాలికి స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, కంట్రోల్ రూమ్ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొత్తపల్లి మండలం నిర్జింత, మద్దూరు మండలంలోని నాగిరెడ్డి పల్లి గ్రామ పంచాయితీలకు సంబంధించిన నామినేషన్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయితీల ఎన్నికలు సజావుగా నిర్వహించే క్రమంలో నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి తప్పులు, పొరపాట్లు లేకుండా చూడాలన్నారు.

## అయ్యప్పస్వామి మహా పడిపూజ

ప్రజాపక్షం/ కొత్తకోట : కొత్తకోట పట్టణం శ్రీ అయ్యప్ప సేవ సమితి కొత్తకోట, మదనాపురం బ్రహ్మ శ్రీ గోపి స్వామి , గురు స్వామి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా కన్నుల పండుగ అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి భక్తులు సాయంకాల సమయంలో కొత్తకోట మండల అయ్యప్ప స్వాములు ఈ పూజా కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుంత మౌనిక, మల్లేష్, పిఆర్ మోహన, మాజీ మార్కెట్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి , కృష్ణయ్య గౌడ్, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు..

### శాంతియుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### జిల్లా ఎస్పి డాక్టర్ వినీత్

ప్రజాపక్షం/నారాయణపేట: నారాయణపేట జిల్లా పరిధిలో జరగనున్న గ్రామపంచాయితీ ఎన్నికల నామినేషన్ దశను పూర్తిగా శాంతియుతంగా, నిష్పాక్షికంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, ఎన్నికల ప్రవర్తన నియమావళిని కఠినంగా అమలు చేస్తామని ఎస్పీ స్పష్టం చేశారు. నామినేషన్ల సమయంలో ఎలాంటి అశాంతి, అవకతవకలు చోటు చేసుకోకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది హై అలర్ట్‌లో ఉన్నట్టు తెలిపారు.

**నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు**

జిల్లాలోని నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రతి కేంద్రం వద్ద ఎస్ఐ, సిఐలు, డీఎస్పీ ప్రత్యక్ష పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. కేంద్రం చుట్టూ 100 మీటర్ల పరిధిలో 163 బియన్ఎస్ఎస్ సెక్షన్ అ మల్లో ఉంటుంది. అనుమతి పొందిన అభ్యర్థులు, వారి సహాయకులకు మాత్రమే ప్రవేశం. జనసమ్మర్దం, అనవసర గుంపులు, అతి ఉత్సాహ చర్యలపై కఠిన చర్యలు.

**ఎన్నికల నియమావళి కఠినంగా అమలు**

ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో కోడ్ అమలులోకి వచ్చినట్లు ఎస్పీ తెలిపారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, కార్యకర్తలు చట్టం ప్రకారం ప్రవర్తించవలెను.

**చెక్‌పోస్టులు, వాహన తనిఖీలు**

జిల్లా సరిహద్దులోబోర్డర్‌చెక్ పోస్ట్ వద్ద,ప్రధాన రహదారులపై తనిఖీలుబలోపేతం చేయడం జరిగిందని, అక్ర మ నగదు, మద్యం, నిషేధిత వస్తువులు రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు నగదు ఉండాలి.

## ఎన్నికల పరిశీలకుల నియామకం

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ జిల్లా గ్రామపంచాయతీల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం నాగర్‌కర్నూల్ జిల్లాకు ఎన్నికల పరిశీలకులను నియమించిందని కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు.సాధారణ పరిశీలకులుగా హైదరాబాద్ హెచ్ఎండిఎ జాయింట్ కలెక్టర్ రాజ్యలక్ష్మి ని, ఎన్నికల పరిశీలకులుగా గద్వాలజిల్లా ఆడిట్ అధికారి భీమ్లానాయక్‌నునియమించినట్లుపేర్కొన్నారు.గురువారం కలెక్టర్ బదావత్‌సంతోష్‌ను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. అనంతరం ఎన్నికల పరిశీలకులతో కలెక్టర్ సమావేశమయ్యారు.



# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## సబ్ ట్రెజరీ కార్యాలయ భవన నిర్మాణ పనులు పరిశీలన



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ పట్టణంలో సబ్ ట్రెజరీ కార్యాలయ భవన నిర్మాణాన్ని సహాయ కోశాధికారి (ఏటీవో) కడారు ప్రేమ్‌చంద్ గురువారం పరిశీలించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 4 సబ్ ట్రెజరీ కార్యాలయాలతో పాటు మిర్యాలగూడ సబ్ ట్రెజరీ కార్యాలయాన్ని సుమారు రూ.40లక్షల వ్యయంతో చేపట్టారు. నూతనంగా ఏటీవోగా బాధ్యతలు చేపట్టిన అనంతరం నిర్మాణాన్ని పరిశీలించి భవన నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్న రాష్ట్ర పోలీసు, హౌసింగ్, కార్పోరేషన్ ఏఈ గౌతంతో చర్చించారు. పాత భవనం కొంత భాగం రోడ్డు విస్తరణలో కూల్చి వేయాల్సి ఉంటుందని త్వరగా పూర్తి చేయాలని ఏటీవో కోరగా త్వరలో పూర్తి చేస్తామని ఏఈ అన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీవో ప్రమీల, సీనియర్ అసిస్టెంట్ మెహరున్నీసాబేగం, కాంట్రాక్టర్‌లు ఉన్నారు.



## సజావుగా నామినేషన్ స్వీకరణ ప్రక్రియ

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

ప్రజాపక్షం/నూతనకల్ : నామినేషన్ స్వీకరణ ప్రక్రియ సజావుగా జరిగేలా రిటర్నింగ్ అధికారులు చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం నూతనకల్ మండల కేంద్రంలోని ఎంఆర్‌సి భవనం, మిర్యాల, ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో మొదటి విడత గ్రామ పంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎస్‌పి కె నరసింహతో కలిసి ఆయన పరిశీలించారు. నూతనకల్ ఎంఆర్‌సి భవనంలో నూతనకల్, వెంకేపల్లి, యడవెల్లి, చిల్పకుంట్ల గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు నామినేషన్ స్వీకరించడం జరుగుతుందన్నారు. మిర్యాల గ్రామ పంచాయితీ కార్యాలయంలో మిర్యాల, అల్లునూరు, లింగంపల్లి, మాచనపల్లి గ్రామ పంచాయితీ సర్పంచులకు, వార్డు మెంబర్లుకు, ఏపూరు గ్రామ పంచాయితీ కార్యాలయంలో ఏపూరు, ఏపూరు తండ, బొప్పారం, కాశిగూడెం, మక్తకొత్తగూడెం, రామన్నగూడెం, మిద్దనపల్లి గ్రామ పంచాయితీ సర్పంచ్‌లకు, వార్డు సభ్యులకు నామినేషన్లు స్వీకరించడం జరుగుతుందని వివరించారు. అలాగే వాహనాలు 100 మీటర్ల దూరంలోనే ఆపేయాలని ఆదేశించారు. డిఎస్‌పి ప్రసన్నకుమార్, తహాశీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓలు సునీత, మహ్మద్ హసీం, ఆర్‌ఓలు ఉన్నారు.

## రైస్‌మిల్లులో ప్రమాదం

### నలుగురు కూలీలకు తీవ్రగాయాలు
### ఇద్దరి పరిస్థితి విషమం





ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : పార్‌బాయిల్డ్ రైస్‌మిల్‌లో ప్రమాదం జరిగి నలుగురు కూలీలకు గాయాలు కాగా అందులో ఇద్దరు కూలీల పరిస్థితి విషమించగా మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ప్రభుత్వ జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించిన సంఘటన గురువారం హుజూర్‌నగర్‌లో జరిగింది. సదరు కూలీలు తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డులోని సాయిబాలాజీ ఫార్‌బాయిల్డ్ రైస్ మిల్లులో కాలిన వరిపొట్టు బూడిద లారీలో లోడ్ చేస్తుండగా కాలిన బూడిద గుట్ట కూలీ ఒక్కసారిగా కూలీలపై పడడంతో నలుగురు కార్మికుల శరీరంపై పడి వారికి తీవ్రగాయాలు అయ్యాయి. 108 అంబులెన్స్‌లో హుజూర్‌నగర్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులంతా కోదాడలోని శ్రీరంగాపురం వాసులమని తెలిపారు. గాయపడిన వారిలో సాతినేని దుర్గ, షేక్ ఫిరోజ్‌లకు తీవ్రగాయాలు కావడంతో మెరుగైన చికిత్స కోసం సూర్యాపేట జిల్లా ఆసుపత్రికి తరలించారు. జాన్‌భి, షేక్ మదార్లకు హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సను అందిస్తున్నారు.

## చరిత్రలో గుర్తించుకోదగిన పవిత్రమైన రోజు దీక్షా దివస్

### మాజీ మంత్రి గుంతకండ్ల జగదీశ్ రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ : కెసిఆర్ సచ్చుడో తెలంగాణ వచ్చుడో అన్న నినాదంతో కెసిఆర్ బయలుదేరిన రోజు చరిత్రలో గుర్తించుకోదగిన పవిత్ర దినం దిక్షా దివాస్ అని మాజీ మంత్రి,సూర్యపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా బిఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దీక్షా దివాస్,లోకల్ బాడీ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కెసిఆర్ ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ సాధించేందుకు బయలు దేరిన రోజు నవంబర్ 29అని సమైక్య ఆంధ్రవాళ్ళు తెలంగాణను అడ్డుకుంటామని చెప్పిన వాళ్ళకు చెంపపెట్టులా నిలిచి రాష్ట్రం సాధించారని అన్నారు. అందుకే మనం వెలుగెత్తి చాటాలని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ తెలంగాణ వాళ్ళ దిష్టి తగిలి అక్కడి కోనసీమ చెట్లు ఎండి పోయాయి అంటున్నారని మీరు చెడిపోవాలని ఎప్పుడు మేము కోరుకోలేదన్నారు. తెలంగాణ జలాలు దోచుకునే కుట్రలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బిఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రవీంద్ర కుమార్,ఎమ్మెల్సీ కోటి రెడ్డి,మాజీ జడ్‌పి చైర్మన్ బండ నరేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు భూపాల్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య,కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,భాస్కర్ రావు,నోముల భగత్, తదితరులు పాల్గొన్నారు.

## ఆరు వార్డుల్లో బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మిర్యాలగూడ ఐసీడీఎస్ అర్బన్ ప్రాజెక్టు పరిధిలో గురువారం మిర్యాలగూడ పట్టణంలో సుమారు ఆరు వార్డుల్లో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని సీడీపీవో రేఖల మమత గురువారం తెలిపారు. కమిటీలో వార్డు ఆఫీసర్‌ను చైర్మన్‌గా ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌ను కన్వీనర్‌గా, ఏఎన్‌ఎం, సమభావన సభ్యులను, స్కూల్ హెడ్‌మాస్టర్‌ను, వార్డు పోలీసులను, మత పెద్దలను సభ్యులుగా 8.9,17,18, 24వార్డుల్లో ఎన్నుకోవడం జరిగిందన్నారు. కమిటీల ఏర్పాటుతో అక్రమ దత్తత, బాల్య వివాహాలను అడ్డుకోవడం, స్కూల్ డ్రాప్‌ఔట్‌ను నిర్మూలించడం భ్రూణహత్యలను నిర్మూలించే అంశాలపై ప్రతి నెలా మొదటి శుక్రవారం సమావేశాలను ఏర్పాటు చసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, లీలా కుమారి, నజీమాబేగం, పద్మ, వార్డు ఆఫీసర్లు రమ్య, శ్రీనునాయక్, స్కూల్ టీచర్లు కుర్ర కృష్ణకాంత్, శ్రీనివాస్, కరుణాకర్‌రెడ్డి, మహిళా సంఘాల సభ్యులు నిర్మల, పద్మ, గీత, సుహాసిని, మాదవి, వార్డు పోలీస్ ఆఫీసర్ శివ ప్రసాద్, బిక్కునాయక్, సయ్యద్ సమద్, మట్టయ్య, ఏఎన్‌ఎం భాగ్యమ్మ, ఉమారాణి, నాగమణి, కవిత, మత పెద్దలు అరుణోదయ, అంగన్‌వాడి టీచర్ నర్మద, చిన్నమ్మ, శ్రీదేవి, సరిత, ఝాన్సీరాణి, శారదా, కోమ పార్వతి, విజయలక్ష్మి , ఆశాలు పాల్గొన్నారు.

# నిష్పాక్షికంగా ఎన్నికల విధులు

### జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి కొర్రా లక్ష్మి
### రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిబంధనలను పాటించాలి
### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నార్కట్ పల్లి: స్థానిక సంస్థల ఎన్నికల విధులను అభ్యర్థుల పట్ల నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అధికారులు ఎన్నికల విధులను నిర్వహించాలని సాధారణ పరిశీలకురాలుగా నల్గొండ జిల్లాకు నియమితులైన రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కొర్రా లక్ష్మి సూచించారు. గురువారం గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా ఆమె మండలంలో మొదటి విడత నామినేషన్లు స్వీకరిస్తున్న నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌ను పరిశీలిస్తూ నామినేషన్లు వేసేందుకు వచ్చిన అభ్యర్థులకు ఇస్తున్న సూచనలు,సలహాలు,ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ నామినేషన్ల స్వీకరణ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నియమ నిబంధనలను పాటించాలన్నారు. స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య, ఆర్‌డిఓ వై .అశోక్ రెడ్డి జిల్లా అబ్జర్వర్ల నోడల్ అధికారి ,పశు సంవర్థక శాఖ అధికారి డాక్టర్ రమేష్ ఉన్నారు.

### నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

ప్రజాపక్షం/చిట్యాల: గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడత నామినేషన్లు స్వీకరించే నామినేషన్ కేంద్రాలను గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా సాధారణ పరిశీలకు రాలు రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ కొర్ర లక్ష్మి గురువారం ఆకస్మి కంగా తనిఖీ చేశారు. ముందుగా ఆమె నల్గొండ కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ని కలిసి జిల్లా కలెక్టర్ తో పాటు ,స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ నారాయణ అమిత్ లతో కలిసి చిట్యాల మండలం,వెలిమినేడు గ్రామపంచా యతీ కార్యాలయంలో వెలిమి నేడు క్లస్టర్‌కు సంబంధించి ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం నామినేషన్ల స్వీకరించే ఆర్‌ఓ గదిని, మెటీరియల్ ను, ఇతర ఏర్పాట్లను పరిశీలించి నామినేషన్ల స్వీకరణ సందర్భంగా అనుసరిస్తున్న ప్రక్రియను అడిగి తెలుసుకుని ఏర్పాట్ల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్,నల్లగొండ ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య ఉన్నారు.

## యువత స్వయం ఉపాధితో ఎదగాలి



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త మార్కెట్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎడిబుల్ టీ కప్పుల తయారీ పరిశ్రమ కేంద్రాన్ని ఆయన మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎండి ఫసియొద్దిన్‌తో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ రహిత సమాజం ఏర్పాటుకు వారివంతు ప్రయత్నంగా టీ తాగండి కప్పు తినండి కాన్సెప్ట్‌తో క్రంచీకప్స్ యూనిట్‌ను నెలకొల్పిన యాజమాన్యంను అభినందించారు. యువత ప్రైవేట్ రంగాల్లో అందివస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ, మరింత మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆ కాంక్షించారు. కాస్త చదువు, ఇంకాస్త సృజనాత్మకత తోడైతే ఎలాంటి విజయాలైనా సాధించవచ్చన్నారు.

## కొయ్యకాళ్లు కాలిస్తే భూమిలో జీవం హరిస్తుంది

ప్రజాపక్షం/అర్వపల్లి : వరి కొయ్యలు కాల్చడం ద్వారా అధిక నష్టాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీధర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని తిమ్మాపురం పంట పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలాల్లో వరి కొయ్యలు కాల్చడం వల్ల నేలకు పంటకి, ప్రజల ఆరోగ్యానికి భారీ నష్టం జరుగుతుందన్నారు. గడ్డి దహనం చేస్తే నేలలోని జీవాలను నాశనం చేసే మంటల ఉష్ణోగ్రత 300 700 సి వరకు పెరుగుతుందని వివరించారు. ఈ తీవ్ర వేడి వల్ల నేలలో సహజంగా ఉన్న నత్రజని కలిపే సూక్ష్మ జీవులు, నేలకు పుష్టి తెచ్చే బ్యాక్టీరియా, కార్బన్ నిల్వ చేసే జీవాలు అన్ని నాశనం అవుతాయని హెచ్చరించారు. పంట పెరుగుదలకు ప్రధాన ఆధారమైనవి నశిస్తే నేల బలహీనమై పండించే శక్తి తగ్గిపోతుందని తెలిపారు. నేల సేంద్రియ పదార్థం తగ్గిపోయి వరి గడ్డిలో సహజంగా ఉండే నత్రజని, ఫాస్పరస్, పొటాష్, కార్బన్ వంటి ముఖ్యమైన పోషకాలు తగలబెట్టే సమయంలో ఇవన్నీ పొగ రూపంలో ఎగిరిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గణేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు శోభారాణి, సత్యం, రైతులు పాల్గొన్నారు.

## బాలసాహిత్య భేరికి కోదాడ విద్యార్థి

ప్రజాపక్షం/ కోదాడ: ఉత్తర అమెరికా తెలుగు సంఘం(నాస) ప్రతిష్టత్మకంగా నవంబర్ 30న ఆన్‌లైన్‌లో నిర్వహించు బాలసాహిత్య భేరికి కోదాడ బాలుర ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి సోమ రమేష్ ఎంపికైన్నట్లు గురువారం హెచ్‌ఎం డి.మార్కండేయలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు విద్యార్థులకు కథ, వనచ కవిత్వం, గేయం, పద్యం విభాగాలలో పోటీలను నిర్వహించారు. కథ వచన విభాగంలో రమేష్ 3 నిమిషాల వ్యవధిలో తన కథను వినిపిస్తారని తెలిపారు. ఎంపికైన విద్యార్థికి మండల విద్యాధికారి ఎం.డి సలీంషరీఫ్, తెలుగు ఉపాధ్యాయులు వీరబ్రహ్మాచారి, ముక్కమాల జానకిరామ్, చిన్నప్ప, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# సూర్యాపేటలో మొదటిరోజు సర్పంచ్‌లకు 207..

### వార్డులకు 38.. నామినేషన్లు దాఖలు



ప్రజాపక్షం/సూర్యాపేట : పల్లెపోరు తొలిదశ ఎన్నికలకు పోటీచేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడం గురువారం షురువయ్యాయి. మొదటి విడుత జిల్లాలో తుంగతుర్తి, నాగారం, నూతనకల్, తిరుమలగిరి, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, సూర్యాపేట రూరల్, ఆత్మకూర్(ఎస్) మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మండలాల పరిధిలో మొత్తం 159 గ్రామ పంచాయితీలు ఉండగా, 1442 వార్డులు ఉన్నాయి. తుంగతుర్తి మండల పరిధిలో 24 గ్రామ పంచాయితీలు, 218 వార్డులు, నాగారం మండలంలో 14 గ్రామ పంచాయితీలు, 132 వార్డులు, నూతనకల్ మండలంలో 17 గ్రామ పంచాయితీలు ఉండగా 166 వార్డులు, తిరుమలగిరి మండలంలో 16 గ్రామ పంచాయితీలు 132 వార్డులు, జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామ పంచాయితీలు, 152 వార్డులు ఉన్నాయి. అలాగే మద్దిరాల మండలంలో 16 గ్రామ పంచాయితీలు 148 వార్డులు, సూర్యాపేట మండలంలో 25 గ్రామ పంచాయితీలు 220 వార్డులు, ఆత్మకూర్(ఎస్) మండలంలో 30 గ్రామ పంచాయితీలు 274 వార్డులు ఉన్నాయి.

మొదటిరోజు దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. తుంగతుర్తి మండల సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థులు 24 మంది నామినేషన్లు దాఖలు చేయగా వార్డు మెంబర్లుగా పోటీ చేసే వారు 09 మంది, నాగారం మండలంలో 30 సర్పంచ్ నామినేషన్లు, వార్డులకు 4 నామినేషన్లు, నూతనకల్ మండలంలో సర్పంచ్ పదవికి 34, వార్డులకు 8 నామినేషన్లు, తిరుమలగిరి మండలంలో సర్పంచ్ పదివికి 17 నామినేషన్లు దాఖలు చేయగా వార్డులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. జాజిరెడ్డిగూడెం మండలంలో సర్పంచ్ పదివికి 15, వార్డులకు 03 నామినేషన్లు దాఖలు అయ్యాయి. మద్దిరాల మండలంలో సర్పంచ్ పదవికి 17, వార్డులకు 2 నామినేషన్లు, సూర్యాపేట మండలంలో సర్పంచ్ పదవి కోసం 40, వార్డులకు 7 నామినేషన్లు దాఖలు చేశారు. ఆత్మకూర్(ఎస్) మండలంలో సర్పంచ్ పదవి కోసం 30, వార్డులకు 5 నామినేషన్లు దాఖలు అయినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ అధికారికంగా ప్రకటించారు.

# నల్లగొండలో మొదటి రోజు సర్పంచ్‌లకు 421

### వార్డు సభ్యులకు 234 దాఖలు
### మొదలైన పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ



ప్రజాపక్షం/నల్లగొండ: గ్రామపంచాయతీ ఎన్నికలలో భాగంగా మొదటి విడత ఎన్నికలు జరిగే నల్లగొండ,చండూరు డివిజన్లలో గురువారం మొదటి రోజు నామినేషన్లు ప్రక్రియ ప్రారంభమయ్యాయి.మొదటి రోజు నామినేషన్ వేయడానికి అభ్యర్థులు మక్కువ చూపకపోయినప్పటికీ నామినేష పత్రాలను తీసుకోవడంలో ముందున్నారు.గ్రామాలలో సర్పంచ్, వార్డ్ మెంబర్ల అభ్యర్డుల ఎంపికలో రాజకీయ పార్టీల నాయకులు బిజీగా ఉండడంతో అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయలేకపోయారు.జిల్లాలో మొదటి విడుత జరుగుతున్న గ్రామపంచాయతీలలో 318 సర్పంచ్‌లకు 421 నామినేషన్ దాఖలు చేశారు.అదేవిధంగా 2870వార్డు లకు గాను కేవలం 234 నామినేషన్ల దాఖలు చేశారు. మండలాల వారిగా చండూర్ మండలంలో 19గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌కి29, వార్డు మెంబర్‌కు166గాను 21 నామినేషన్ల, చిట్యాల 18 పంచాయతీలకు సర్పంచ్‌కి 29,వార్డు మెంబర్‌కు 180గాను 21నామినేషన్ల,గట్టుప్పల్ 7 పంచాయతీలకు సర్పంచ్‌కి10,వార్డు మెంబర్‌కు 68 గాను 4నామినేషన్ల,కనగల్ 31పంచాయతీలకు 44,వార్డు మెంబర్‌కు262గాను 7 నామినేషన్ల,కట్టంగూర్ 22 పంచాయతీలకు 23,వార్డు మెంబర్‌కు206గాను 21నామినేషన్ల,కేతేపల్లి 16 పంచాయతీలకు 31,వార్డు మెంబర్‌కు160 గాను 10నామినేషన్ల,మర్రిగూడ 18పంచాయతీలకు 2,170వార్డు మెంబర్‌కు గాను 9 నామినేషన్ల, మునుగోడు 28 పంచాయతీలకు 33,వార్డు మెంబర్‌కు244గాను 20 నామినేషన్ల,నకిరేకల్ 17పంచాయతీలకు 21,160వార్డు మెంబర్‌కుగాను 11నామినేషన్ల,నల్లగొండ 31పంచాయతీలకు 25,వార్డు మెంబర్‌కు 270గాను 16 నామినేషన్ల,నాంపల్లి 32పంచాయతీలకు 27,వార్డు మెంబర్‌కు276 గాను 16 నామినేషన్ల, నార్కెట్‌పల్లి 29పంచాయతీలకు 47,వార్డు 262మెంబర్‌కు గాను 43 నామినేషన్ల,శాలిగౌరారం 24పంచాయతీలకు 34,వార్డు మెంబర్‌కు 230 గాను 10 నామినేషన్ల, తిప్పర్తి 26పంచాయతీలకు47,వార్డు మెంబర్‌కు 216గాను 25 నామినేషన్ల దాఖలు చేశారు.

# బాల్యవివాహాలను అరికడదాం

### నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నల్లగొండ డిఎస్‌పి శివరాం రెడ్డి పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిభా పూలే బాలికల విద్యాలయంలో మహాత్మా జ్యోతిభా పూలే బాలికల విద్యాలయంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జరిగిన బాల్య వివాహ విముక్త భారత్ ప్రథమ వార్షికోత్సవం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగడంతో ముఖ్యంగా ఆడ పిల్లలకే ఎక్కువ నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. మొదట చదువు కొనసాగించాడు కష్టమైపోతుందని, కుటుంబానికి బానిసలా సేవలు చేయాల్సి వస్తుందని, చిన్న తనంలోనే సంతానం కలుగడంతో, సహజ ప్రసవానికి అవకాశం లేకుండా ఆపరేషన్ చేయాల్సి వస్తుందని, దీంతో ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. భారత ప్రభుత్వం 2030 నాటికి బాల్య వివాహరహిత దేశంగా తయారు చేయడానికి గత సంవత్సరం కేంద్ర మంత్రి అన్నపూర్ణ దేవి చేతులు మీదుగా ప్రారంభమై నేటికీ ఒక సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లోవన్ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సిడబ్ల్యూసి చైర్మన్ కృష్ణయ్య,ఐసిడిఎస్ ఇంచార్జి గణేష్, ఎహెచ్‌టియు కృష్ణారెడ్డి,సోనీ,ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటర్ ఎం శోభారాణి,సఖి కౌన్సిలర్ సునిత,మహాత్మా జ్యోతిభా పూలే బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్య,ఉమెన్ హబ్ రాణి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్, విద్యార్థులు పాల్గొన్నారు.



## బిసి అభ్యర్థులకు టిఆర్‌పి మద్దతు

ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : సర్పంచ్‌గా పోటీ చేసే బీసీ అభ్యర్థులకు టిఆర్పి పూర్తి స్థాయి మద్దతు అందిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు.గురువారం నల్లగొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్లపై 50 సీలింగ్ రాజ్యాంగంలో ఎక్కడా లేదని,అది కేవలం సుప్రీంకోర్టు తీర్పు మాత్రమే అన్నారు. బీసీలకు అన్యాయం జరుగుతోందని కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ఇచ్చి స్థానిక సంస్థల్లో 17 రిజర్వేషన్ మాత్రమే ఇవ్వడం అనేది మోసమని విమర్శించారు.బీసీల కోసం పోరాడుతున్న ఏకైక నాయకుడు తీన్మార్ మల్లన్ననే నని ఏ బీసీ అభ్యర్థి అయినా సర్పంచ్,వార్డ్ మెంబర్ గా పోటీ చేయాలనుకుంటే,ఉమ్మడి నల్లగొండలో టిఆర్‌పి నాయకులను సంప్రదించి సహాయం పొందవచ్చు అని సూచించారు. బీసీ బిడ్డ పున్న కైలాస్ నేతను తొలగించామని మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి సిఎం రేవంత్ రెడ్డికి లేఖ రాయడం హాస్యాస్పదాయకం అన్నారు.



# ఎన్నికలు శాంతియుతంగా జరపాలి

### జనరల్ పరిశీలకులు రవి



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : పంచాయతీ ఎన్నికలు నిష్పక్షపాతంగా, శాంతియుత వాతావరణంలో జరుపాలని జనరల్ పరిశీలకులు రవి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని కలెక్టర్ విసి ఛాంబర్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె నరసింహ తో కలిసి ఆయన గ్రామ పంచాయితీ ఎన్నికల నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఓటర్లకు అవగాహన కల్పించి తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకొని ప్రశాంతంగా పోలింగ్ ప్రక్రియలో పాల్గొనేలా చూడాలన్నారు. ఓటర్ స్లిప్స్ పంపిణీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలపై వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో నిజ నిర్ధారణ చేసిన తర్వాతనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉద్యోగులు ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు తెలిపినా, ప్రచారంలో పాల్గొన్నా ఎన్నికల కమిషన్ అట్టి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ మొదటి విడతలో సూర్యాపేట, ఆత్మకూర్(ఎస్), తుంగతుర్తి, తిరుమలగిరి, మద్దిరాల, నాగారం, నూతనకల్, జాజిరెడ్డిగూడెం మండలాలలోని 159 గ్రామ పంచాయితీలకు, 1442 వా ర్డులకు ఎన్నికలు జరగనున్నాయన్నారు. రెండవ విడతలో చివ్వెంల, పెన్‌పహాడ్, కోదాడ, మునగాల, అనంతగిరి, నడిగూడెం, మోతె, చిలుకూరు మండలాలలోని 181 గ్రామ పంచాయితీలకు, 1628 వార్డులకు అలాగే మూడవ విడత హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్ళచెర్వు, చింతలపాలెం, పాలకీడు, నేరేడుచర్ల, గరిడేపల్లి మండలాల్లోని 146 గ్రామ పంచాయితీలకు, 1318 వార్డులకు ఎన్నికలు జరుగుతున్నాయని మొత్తం ఓటర్లు 6,94,815 మంది ఉన్నట్లు వివరించారు. నామినేషన్ స్వీకరణ కేంద్రాలు మొదటి విడతలో 44, రెండవ విడతలో 49, మూడవ విడతలో 38 ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామని అభ్యర్థుల ఖర్చులు లెక్కించుటకు 23 ఫ్లయింగ్ స్క్వాడ్లు, 4 స్టాటిక్ టీమ్‌లు నిరంతరం పర్యవేక్షణ చేస్తాయన్నారు.

జిల్లా ఎస్‌పి కె నరసింహ మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ సాఫీగా సాగేందుకు పోలీస్ శాఖ నామినేషన్ కేంద్రాల వద్ద, పోలింగ్ కేంద్రాలలో భద్రత కొరకు బలగాలను ఏర్పాటు చేశామన్నారు. సోషల్ మీడియాలో రాజకీయ ప్రచారం, అసత్య ప్రచారం, ద్వేష పూరిత పోస్టులు, ఓటర్లను ప్రభావితం చేసే సందేశాలు, ఉద్రిక్తతలను రేకెత్తించే వ్యాఖ్యలు కఠినంగా నిషేధించబడిందని జాగ్రత్తగా పర్యవేక్షించాలని సూచించారు. ఎన్నికల సంబంధిత ఫిర్యాదులు, సూచనలు స్వీకరించి చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయబడిందని ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు వంటి అంశాలపై వెంటనే 6281492368 కు ఫిర్యాదు చేయవచ్చని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్వపల్లి గ్రామ పంచాయితీ కార్యాలయంలో అర్వపల్లి, కాసరాబాద్ గ్రామ సర్పంచ్‌లకు, వార్డు సభ్యుల ఎన్నిక నిమిత్తం ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశములో జిల్లా అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిఎస్‌పి రవీందర్ రెడ్డి, జడ్‌పి సిఈఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎల్‌పిఓలు నారాయణరెడ్డి, పార్థసారధి, నోడల్ అధికారులు హాజరైనారు.

# రీల్




## అనిల్ రావిపూడి చేతుల మీదుగా 'అన్నగారు వస్తారు' టీజర్

స్టార్ హీరో కార్తి నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'వా వాతియార్' తెలుగు ప్రేక్షకుల ముందుకు 'అన్నగారు వస్తారు' టైటిల్ తో రాబోతోంది. ఈ సినిమా డిసెంబర్ లో వరల్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. 'అన్నగారు వస్తారు' చిత్రాన్ని ప్రెస్టీజియస్ ప్రొడక్షన్ హౌస్ స్టూడియో గ్రీన్ బ్యానర్ లో కె.ఇ. జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. యాక్షన్ కామెడీ కథతో దర్శకుడు నలన్ కుమారస్వామి రూపొందిస్తున్నారు. కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. ఈ నెల 28న సాయంత్రం 5.04 నిమిషాలకు బ్లాక్ బస్టర్ డైరెక్టర్ అనిల్ రావిపూడి చేతుల మీదుగా 'అన్నగారు వస్తారు' సినిమా టీజర్ ను రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా హీరో కార్తి నటిస్తున్న 'అన్నగారు వస్తారు' సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. కార్తి కెరీర్ లో ఈ సినిమా మరో బ్లాక్ బస్టర్ అవుతుందనే ఎక్స్ పెక్టేషన్స్ ఏర్పడుతున్నాయి.కార్తి, కృతి శెట్టి, సత్యరాజ్, మధుర్ మిట్టల్, ఆనంద రాజ్, రాజ్ కిరణ్, శిల్పా మంజునాథ్, కరుణాకరణ్, తదితరులు నటిస్తున్నారు.

## 'వనజీవి రామయ్య'గా బ్రహ్మాజీ



ప్రముఖ నటుడు బ్రహ్మాజీ హీరోగా నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. సమాజంలో చెట్లను పెంచాలనే ఉద్దేశంతో జీవిత కాలం పని చేసిన వనజీవి రామయ్య జీవిత చరిత్రను తెరకెక్కిస్తున్నారు. వనజీవి రామయ్య పాత్రను నటుడు బ్రహ్మాజీ నటిస్తున్నారు. ఖమ్మం బల్లేపల్లిలో జరిగిన షూటింగ్ ప్రారంభోత్సవంలో ఐ ఎఫ్ ఎస్ అధికారి విక్రమ్ సింగ్ క్లాప్ కొట్టారు. మేయర్ నీరజ కెమెరా స్విచాన్ చేశారు. డివిజన్ కార్పొరేటర్లు హుస్సేన్, మలీదు వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు నరిపూడి సతీష్, మట్ట సతీష్ , వనజీవి రామయ్య ఫ్యామిలీ మెంబర్స్ అతిథులుగా హాజరయ్యారు. బ్రహ్మాజీ సరసన నటి రాజీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సమాజానికి ఒక మంచి సందేశం ఇచ్చేలా ఈ సినిమాను రూపొందిస్తున్నామని దర్శకుడు వేముగంటి తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాత లింగంపల్లి చంద్రశేఖర్ రావు , సినిమాటోగ్రఫీ తోట వి రమణ ,సంగీతం బల్లేపల్లి మోహన్ , రచన డాక్టర్ కళారంగ, రచన సహకారం జి. రాంబాబు, సాహిత్యం ఘనయాది, లైన్ ప్రొడ్యూసర్ డి.రవీంద్రనాథ్ , ఎడిటర్ దాము పని చేస్తున్నారు.

## 70 మిలియన్లు దాటిన మీసాలపిల్ల పాట




మెగాస్టార్ చిరంజీవి, నయనతారా హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా మన శంకర వరప్రసాద్ గారు. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలోని మీసాల పిల్ల అనే పాటను ఇటీవల విడుదల చేశారు. భీమ్స్ సంగీతం అందించగా, ఈ పాటను భాస్కర భట్ల రవికుమార్ రాశారు. అయితే ఈ సినిమా పాట విడుదల రోజు నుంచి ఇప్పటి వరకు 70 మిలియన్ల వ్యూస్ దాటినట్టు సినిమా వర్గాలు తెలిపాయి. సోషల్ మీడియాలో టాప్ ట్రేండింగ్‌లో ఈ సాంగ్ ఉన్నట్టు మ్యూజిక్ ఇండస్ట్రీ చెబుతోంది. ఈ సినిమా షూటింగ్ రెగ్యులర్‌గా జరుగుతోంది. ఇటీవలే ఈ పాటను చిరంజీవి, నయనతారలపై చిత్రీకరించారు. చిరంజీవితో పాటు చిత్రంలోని ఇతర తారాగణంపై కీలకమైన సన్నివేశాలను కూడా చిత్రీకరించారు. కొంత భాగం మినహా ఈ చిత్రం షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చింది. అన్ని పనులు పూర్తి చేసి వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారు. హీరో వెంకటేష్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. వెంకటేష్ కు సంబదించిన సన్నివేశాలను కూడా చిత్రీకరించారు. క్యాథరిన్ థెరిసా కూడా ఇందులో మంచి క్యారెక్ట్ లో కనిపిస్తోంది. చిరంజీవి కుమార్తె సుష్మిత కొణిదల, సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ ఎస్. కృష్ణ ఎగ్జి క్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

## కామెడీ క్రైం సినిమా 'రివాల్వర్ రీటా'



నేషనల్ అవార్డ్ విన్నింగ్ హీరోయిన్ కీర్తి సురేష్ టైటిల్ రోల్ లో నటిస్తున్న క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ 'రివాల్వర్ రీటా'. జేకే చంద్రు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని సుధన్ సుందరం , జగదీష్ పళనిసామి నిర్మించారు. రాధికా శరత్కుమార్, అజయ్ ఘోష్, కీలక పాత్రలు పోషించారు. నవంబర్ 28న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు. హీరోయిన్ కీర్తి సురేష్ మాట్లాడుతూ. అజయ్ ఘోష్ తో వర్క్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది. అలాగే ఇందులో సునీల్ చాలా డిఫరెంట్ రోల్ చేశారు. మీరందరూ చాలా ఎంజాయ్ చేస్తారు. ఇందులో రాధిక చాలా చక్కని పాత్ర చేశారు. మా ఇద్దరికి కెమిస్ట్రీ చాలా బాగుంటుంది. ఇది పర్ఫెక్ట్ డార్క్ కామెడీ ఫిలిం. ఇప్పటివరకు చాలా డార్క్ కామెడీ సినిమాలు చూసుంటారు. కానీ ఇది ఫిమేల్ లీడ్ చేస్తున్న డార్క్ కామెడీ ఫిలిం. తప్పకుండా మీరందరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నాను. ఇది ఒక్క రోజులో జరిగే కథ. చాలా అద్భుతమైన పాత్రలు ఉన్నాయి. 28న రిలీజ్ అవుతుంది. తప్పకుండా అందరూ చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను.అజయ్ ఘోష్ మాట్లాడుతూ రంగస్థలం పుష్ప తర్వాత అంత ఆనందంగా అనిపించిన సినిమా ఇది. మహానటి సావిత్రి పాత్రలో నవరసాలు పండించిన కీర్తి సురేష్ గారితో కలిసి సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. సమంత గారు కీర్తి సురేష్ వీళ్ళిద్దరే నాకు ఇండస్ట్రీలో ఇష్టమైన హీరోయిన్స్. కీర్తి ఎంతో నమ్రతతో ఉంటారు. షూటింగ్ చివరి రోజు స్వయంగా ఆమెనే పిలిచి ఫోటోలు తీసుకున్నారు. ఇది చాలా గొప్ప విషయం. ఈ సినిమా చాలా అద్భుతమైన కథ. డైరెక్టర్ చంద్రు గారు చాలా అద్భుతంగా సినిమాను తీశారు. ఈ సినిమాలో కీర్తి యాక్షన్ మీరు డెఫినెట్గా ఎంజాయ్ చేస్తారు. ఇందులో ఒక కొత్త సునీల్ ని చూస్తారు. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటున్నాను. డిస్ట్రిబ్యూటర్ కుమార్ కూడా పాల్గొన్నారు.

## వనవాసం సాంగ్ రిలీజ్



బుల్లమ్‌తో పరిచయం అయిన యాంకర్ సుమ కొడుకు హీరో రోషన్ కనకాల తన సెకండ్ మూవీ 'మోగ్లీ 2025' తో వస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత, కలర్ ఫోటో ఫేమ్ సందీప్ రాజ్ దర్శకత్వంలో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టిజి విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన మోగ్లీ 2025 అడవి నేపథ్యంలో యూనిక్ రొమాంటిక్ గా సాగే యాక్షన్ డ్రామా. ఈ సినిమా గ్లింప్స్, టీజర్కు అద్భుతమైన స్పందన వచ్చింది. ఫస్ట్ సింగిల్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. ఈ నేపథ్యంలో సెకండ్ సింగిల్ వనవాసం పాటను రిలీజ్ చేశారు.కాల భైరవ స్వరపరిచిన ఈ పాటకు కళ్యాణ్ చక్రవర్తి సాహిత్యం అందించారు. ఇతిహాస వైభవాన్ని, ఆధునిక ప్రేమసంఘర్షణ కథను అద్భుతంగా మేళవిస్తూ కవితాత్మకంగా రాశారు. శ్రీరాముడు సీతమ్మ వారిని రక్షించేందుకు యుద్ధానికి వెళ్లినట్లే& హీరో కూడా తన ప్రేమను కాపాడేందుకు సిద్ధం అవుతున్నాడనే భావనను జోడించి పాట రాశారు. రోషన్, సాక్షి మడోల్కర్ కెమిస్ట్రీ అందంగా కనిపిస్తుంది. బండి సరోజ్ కుమార్ పవర్ ఫుల్ విలన్ గా కనిపించగా, వైవా హర్ష హీరో మిత్రుడిగా వినోదాన్ని పంచుతున్నారు.సినిమాటోగ్రాఫర్ రామ మారుతి ఎం విజువల్స్ అందించారు. ఎడిటింగ్ను కోదాటి పవన్ కళ్యాణ్ పర్యవేక్షించారు. కిరణ్ మామిడి ప్రొడక్షన్ డిజైనర్, నటరాజ్ మాదిగొండ యాక్షన్ కొరియోగ్రాఫ్ గా చేశారు. ఈ చిత్రం డిసెంబర్ 12న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది.

## ఘట్టమనేని జయకృష్ణ సినిమా 'శ్రీనివాస మంగాపురం'




సూపర్ స్టార్ దివంగత కృష్ణ మనవడు, దివంగత రమేష్ బాబు కుమారుడు ఘట్టమనేని జయకృష్ణ హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్ రెగ్యులర్ గా జరుగుతోంది. ఆర్ ఎక్స్ 100, మంగళవారం వంటి సక్సెస్ ఫుల్ సినిమాలు తెరకెక్కించిన అజయ్ భూపతి దర్శకత్వంలో జయకృష్ణ హీరోగా పరిచయం అవుతున్నారు. అయితే ఈ సినిమాకు ''శ్రీనివాస్ మంగాపురం'' అనే టైటిల్ ను ఖరారు చేసినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం ఈ టైటిల్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ గా చక్కర్లు కొడుతోంది. రెండు జీవితాలు, ఒకటే ప్రయాణం రెండు చేతులు, ఒకటే ప్రమాణంరెండు మనసులు, ఒకటే విధి అనేదే ఈ సినిమా కథగా తెరకెక్కిస్తున్నారు. ప్రేమ కథలను తెరకెక్కించడంలో తనదైన శైలిని చూపిస్తున్న అజయ్ భూపతి ఈ సినిమాను చాలా గ్రాండ్ లెవల్లో రూపొందిస్తున్నట్టు ఇండస్ట్రీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అశ్విని దత్ సమర్పణలో ఈ సినిమా నిర్మాణం జరుగుతోంది. జయకృష్ణ సరసన రాషా తడని హీరోయిన్ గా నటిస్తోంది.


## నరేష్ అగస్త్య హీరోగా కొత్త చిత్రం ప్రారంభం



నరేష్ అగస్త్య హీరోగా చైతన్య గండికోట దర్శకత్వంలో డా.ఎం రాజేంద్ర నిర్మాణంలో ఓ కొత్త చిత్రం రూపొందుతోంది. శ్రేయ రుక్మిణి హీరోయిన్ గా నటిస్తున్నారు. జెన్ ఈ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ 1గా రూపొందుతున్న కొత్త చిత్రం పూజా కార్యక్రమాలతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అయ్యింది. ఈ షూటింగ్ ముహూర్త కార్యక్రమంలో మాజీ ఐఏఎస్ సునీల్ శర్మ, ఆయన భార్య షాలిని శర్మ దర్శక నిర్మాతలకు స్క్రిప్ట్ అందించారు. హీరో శ్రీవిష్ణు క్లాప్ కొట్టారు. రఘుబాబు కెమరా స్విచాన్ చేయగా, డైరెక్టర్ బి. గోపాల్ ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకు మిక్కి జె మేయర్ మ్యూజిక్ అందిస్తున్నారు. విద్యాసాగర్ చింతా డీవోపీగా పని చేస్తున్నారు. కోటగిరి వెంకటేశ్వరరావు ఎడిటర్. ప్రముఖ రచయిత లక్ష్మీ భూపాల ఈ చిత్రానికి డైలాగ్స్ అందిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.

# లేబర్ కోడ్స్ అమలు చేసేదిలేదు

- కేరళ మంత్రి శివన్‌కుట్టి స్పష్టీకరణ
- రాష్ట్రంలో లేబర్ కోడ్స్ చట్టాలకు ఆలోచన
- దేశంలో కార్మికశాఖల మంత్రులు,సంఘాలతో
- వచ్చేనెల 19న కేరళలో ప్రత్యేక సమావేశం



**తిరువనంతపురం:** కార్మికులను అణచివేతకు గురిచేసే కేంద్ర ప్రభుత్వ 'లేబర్ కోడ్స్'ను రాష్ట్రంలో అమలు చేయబోమని కేరళ కార్మికశాఖామంత్రి వి.శివన్‌కుట్టి స్పష్టం చేశారు. ఈ నాలుగు లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని అడగాలని కార్మిక సంఘాల సమావేశం తీర్మానం చేసినట్లు చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాల కార్మికశాఖామంత్రులు, కేంద్ర కార్మిక సంఘాల నాయకులను కేరళకు ఆహ్వానించి లేబర్ కోడ్స్ ఉపసంహరణపై డిసెంబరు 19వ తేదీన రోజంతా చర్చల సమాలోచన చేయాలని కూడా తీర్మానించినట్లు చెప్పారు. దేశంలోని అనేక రాష్ట్రాలు లేబర్ కోడ్స్‌ను అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటకీ కేరళలో మాత్రం అమలు చేసేదిలేదని గురువారం తిరువనంతపురంలో పాత్రికేయులకు మంత్రి శివన్‌కుట్టి చెప్పారు. దేశవ్యాప్తంగా నవంబరు 21వ తేదీ నుండి నాలుగు కొత్త లేబర్ కోడ్స్ అమలులోకి తెచ్చినట్లు నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రకటించింది. అనేక దశాబ్దాలుగా కార్మికులు పోరాటాల ద్వారా దశలవారీగా సంపాదించుకున్న హక్కులు 29 చట్టాలుగా ఉన్నాయి. కానీ యాజమాన్యాలకు అనుకూలంగా మార్చేందుకు ఈ చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా సంక్షిప్తీకరించి కేంద్రం చట్టరూపంలోకి తీసుకువచ్చింది. కేరళమంత్రి శివన్‌కుట్టి గురువారం మధ్యాహ్నం నుండి వివిధ కార్మిక సంఘాల నాయకులతో లేబర్ కోడ్స్ అమలుపై సమావేశం నిర్వహించారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని సమావేశంలో ఒక తీర్మానం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎవరినీ సంప్రదించకుండా, కార్మిక సంఘాలతో సమగ్ర చర్చలు జరపకుండా,దేశంలో కార్మికుల సమస్యలను సరిగ్గా అర్థం చేసుకోకుండా ఏకపక్షంగా లేబర్ కోడ్స్‌ను చట్టరూపంలో కి తీసుకువచ్చిందని, అందువల్ల వీటిని ఉపసంహరించుకోవాలని కేంద్రాన్ని అడగాలని కార్మిక సంఘాల సమావేశం తీర్మానం చేసినట్లు మంత్రి చెప్పారు.''వచ్చేనెల 19న కేరళలో జరిగే సమాలోచన చర్చల్లో దాదాపు 100 మంది పైగా పాల్గొంటారని ఆశిస్తున్నాం, ఈ సమావేశం లో విస్తారంగా చర్చలు జరుగుతాయి, కేంద్రంతో సంబం ధం లేకుండా రాష్ట్రాలు ప్రత్యేకంగా లేబర్ కోడ్స్‌ను తయా రు చేసి చట్టరూపం ఇవ్వవచ్చా? ఈ సమస్యకు ఎలాంటి పరిష్కారం సాధించగలం? అనే విషయాలను ఈ సమావేశంలో క్షుణ్ణంగా చర్చిస్తామని చెప్పారు. కార్మికుల విషయాలన్నీ రాష్ట్రాలలోని ప్రభుత్వాలకు సంబంధించినవని, అందువల్ల దీనిపై రాష్ట్రాలలో అధికారంలో ఉన్న ప్ర భుత్వాలు జోక్యం చేసుకోవచ్చునని శివన్‌కుట్టి చెప్పారు. ''న్యాయ,కార్మికరంగ నిపుణులు కూడా వచ్చేనెల జరిగే సమావేశంలో పాల్గొంటారు, వారి అభిప్రాయాలు కూడా తీసుకుంటాం, వారిని సంప్రదించి సలహాలు తీసుకుం టాం'' అని మంత్రి చెప్పారు. బుధవారం (నవంబరు 26) దేశవ్యాప్తంగా జరిగిన నిరసన ప్రదర్శనల్లో చేతికి న ల్లబ్యాడ్జీలు ధరించి పాల్గొన్న వారి పేర్లు ఏమిటో వివరా లు తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వం ఆరా తీస్తోందని చెప్పారు. ఈ విధమైన చర్యలు కార్మికులను భయపెట్టి వారిపై తీవ్రమైన ఒత్తిడి తీసుకురావడంకోసమేనని,ఈ వి ధమైన చర్యలను కేరళలో ఉన్న వామపక్ష ప్రభుత్వం అ నుమతించబోదని, వాటిని సాగనివ్వబోమని స్పష్టం చేశా రు. 2021లోని లేబర్‌కోడ్స్‌కు సంబంధించి రాష్ట్రాలు తయారు చేస్తున్న ముసాయిదా లేబర్ కోడ్స్ గురించి పా త్రికేయులు ప్రశ్నించగా, ఇది కేవలం ఒక ముసాయిదా మాత్రమేనని, తదుపరి నిర్ణయాలు జరిగే వరకూ అది అలాగే ఉంటుందని చెప్పారు. నాలుగు లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి ఒక ఈ మెయిల్ సందేశం పంపించామని, డిసెంబరు 19న దేశవ్యాప్తంగా కార్మిక శాఖల మంత్రులు, కేంద్ర కార్మిక సంఘాల నాయకులతో చర్చల తర్వాత ఆ నిర్ణయాలకు అనుగుణంగా తాము వ్యక్తిగతంగా కేంద్ర నాయకులను కలిసి అన్ని విషయాలు వివరిస్తామని చెప్పారు. గతనెలలో కేంద్ర కార్మికమంత్రిత్వ శాఖ ఒక సమావేశానికి పిలిచిందని, ఈ సమావేశంలో లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించుకోవాల్సిందిగా తాము కేరళ ప్రభుత్వం తరపున చాలా స్పష్టంగా తెలియజేశామని తొలుత మంత్రి చెప్పారు. ఈ లేబర్ కోడ్స్ అమలుపై తమ వైఖరిని కూడా తెలియజేశామన్నారు. రాష్ట్రం ప్రత్యేకించి లేబర్ కోడ్స్ ముసాయిదా ను తయారు చేయడంపై కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే తీవ్రమైన ఒత్తిడిని రాష్ట్ర ప్రభుత్వం తట్టుకుని నిలబడుతుందా? లేక అందుకు తలొగ్గుతుందా? అని పాత్రికేయు లు ప్రశ్నించగా అలాంటిదేమీ ఉండదన్నారు. ''ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ఒత్తిడికి మేం తలొగ్గేటట్లయితే, కేంద్రం కోరుకున్నవిధంగా మేం వారికి ఒక అంగీకార లేఖనే అం దజేసి ఉండేవాళ్ళమని, కానీ లేబర్ కోడ్స్ అమలుకు తా ము సిద్ధంగా లేమని, అందుకు వామపక్ష ప్రభుత్వం అం గీకరించబోదని సమాధానం చెప్పారు. 2021 డిసెంబరు 14వ తేదీన రాష్ట్రంలో ఈ ముసాయిదా తీర్మానానికి ఆ మోదం లభించింది. ఈ తీర్మానాన్ని రహస్యంగా తయారు చేయలేదని, చాలా బహిరంగంగానే ఈ తీర్మానాన్ని తయారు చేశామని చెప్పారు. దీనిపై ప్రజల అభిప్రాయాన్ని కోరామన్నారు. ఐతే తదుపరి చర్యలన్నింటినీ ఆపేశామన్నారు. దీనికి సంబంధించి తడచిన మూడు సంవత్సరాలుగా తాము ఎలాంటి చర్యలూ తీసుకోలేదనీ, అందువల్ల ఆ విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే నాలుగు లేబర్‌కోడ్‌లను అధికారికంగా నోటిఫై చేసింది. దేశంలోని కా ర్మిక చట్టాలలో యాజమాన్యాలకు అనుకూలంగా భారీ సంస్కరణలు తెచ్చేందుకు ఉద్దేశించిన ఈ లేబర్ కోడ్స్ 2020 నుండి కేంద్రం వద్ద అపరిష్కృతంగా ఉన్నాయి. గిగ్ వర్కర్స్‌కు సార్వత్రిక సామాజిక భద్రత, కార్మికులందరికీ అనివార్యంగా చట్టబద్ధమైన నియామక పత్రాలు, చట్టబద్ధమైన కనీస వేతనాలు, సకాలంలో వేతనాల చెల్లింపులు వంటి అనేక అంశాలు ఇందులో ఉన్నాయి. ఈ లేబర్ కోడ్స్‌ను అమలు చేసి కేరళ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా ఎలాంటి చర్యలూ తీసుకోబోదని ముందురోజు బుధవారం మంత్రి శివన్‌కుట్టి చెప్పారు.

## అభివృద్ధే టార్గెట్

(మొదటి పేజీ తరువాయి)

రూరల్ అగ్రికల్చర్ రీజియన్ ఎకానమీ ( రేర్) గా మూడు రీజియన్లను విభజించుకోవాలని సూచించారు. ఈ మూడు రీజియన్లలో ఎక్కడెక్కడ ఎలాంటి అభివృద్ధి ఉండాలో డాక్యుమెంట్‌లో పొందుపరచాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండదని చాటి చెప్పేలా తెలంగాణ రైసింగ్ పాలసీ డాక్యుమెంట్ ఉండాలన్నారు. వాస్తవిక దృక్పథం కనిపించేలా డిజైన్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2025'పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, మహ్మద్ అజారుద్దీన్, సీతక్క ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ చైనా, జపాన్‌ల స్థాయి అభివృద్ధే టార్గెట్ అని, ప్రపంచంతోనే పోటీపడే విధంగా స్కిల్ యూత్ ఉండాలన్నారు. కొత్త రంగాల్లో, కొంగొత్త మార్గాల అన్వేషణ జరగాలన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, టెక్నాలజీ, జిసిసిలు, ఫార్మా, అగ్రికల్చర్.. తో పాటు వివిధ రంగాల్లో ఎక్కడెక్కడ ఏయె రంగం అభివృద్ధి ఉండాలో ప్రణాళిక రూపొందించాలన్నారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రోడ్, పోర్ట్, కనెక్టివిటీ ముఖ్యమైనవన్నారు. సంక్షేమం, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, ఎనర్జీ డిపార్ట్ మెంట్.. ఇలా ప్రతీ రంగానికి సంబంధించి పాలసీ డాక్యుమెంట్ లో స్పష్టత ఉండాలన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలన్నారు. కొత్తగా ఏర్పాటయ్యే ఎయిర్ పోర్టులలో ప్రయాణీకులతో పాటు కార్గో సర్వీసెస్ కూడా అందుబాటులో ఉంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. హైదరాబాద్ కోర్ అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణ తెలంగాణను మూడు జోన్లుగా అభివృద్ధి సమతుల్యత సాధించాలని ప్రభుత్వం భావిస్తోంది. అదేసమయంలో గ్రామీణ ఆర్థికవ్యవస్థ బలోపేతం చేసేందుకు రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేలా వ్యవసాయ కార్యాచరణ కూడా విజన్ డాక్యుమెంట్ లో భాగమౌతోందన్నారు.

## సోదరభావం ప్రదర్శించండి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన విదేశీ పర్యటనకు వెళ్లారు. టర్కీలోని ఇజ్నిక్ నగరంలో పురాతన కౌన్సిల్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన వెళ్ళారు. ఈ సందర్భంగా రాజధాని అంకారాలో పోప్‌కు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు శాంతి సందేశం పం చిపెట్టారు. ప్రపంచంలో ప్రజలు అందరూ నిజమైన సోదరీ, సోదరులుగా ప్రవర్తించాలని, శాంతి మార్గాన్ని అనుసరించాలని కోరారు. భిన్న మతాలు, ఆచారాలు, నమ్మకాలు, వైరుధ్యాలు ఉన్నప్పటికీ ప్రజలు సోదరభావంతో మెలగాలని పిలుపు ఇచ్చారు. టర్కీలో పురాతన నగరం నైసియా ఉన్న ప్రదేశంలోని ఇజ్నిక్‌లో 1700 సంవత్సరాల క్రితం పురాతన క్రిస్టియన్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఆ సందర్భాన్ని స్మరించుకుంటూ పోప్‌తోపాటు ఇతర క్రైస్తవ గురువులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. క్రీస్తుశకం 325 ఎ.డి (ఎన్నో డెమినీ)లో ఈ ప్రాంతంలో జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఇతర పలు నిర్ణయాలతోపాటు ''యేసు దైవ కుమారుడు'' అని నిర్ధారిస్తూ ఒక తీర్మానం చేశారు. ఆ తర్వాత దీనిని ''నైసీడ్ క్రీడ్'' అని పిలుస్తున్నారు. అదేవిధంగా గతంలో టర్కీని సందర్శించిన పూర్వ పోప్‌లు పోప్ ఫ్రాన్సిస్, పోప్ బెనెడిక్ట్–16లు చేసిన విధంగానే పోప్ లియో–14 ఈ ప్రాంతంలో ఉన్న బ్లూ మసీదును కూడా సందర్శిస్తారు. టర్కీ పర్యటన తర్వాత ఆయన లెబనాన్‌కు బయలుదేరి వెళతారు. రాధాని బీరూట్‌పై ఇజ్రాయెల్ బాంబు దాడులు చేసిన తర్వాత కొద్ది రోజులకే పోప్ లియో లెబనాన్‌లో పర్యటనకు వెళుతున్నారు. వాస్తవానికి ఇంతకుముందు వాటికన్‌సిటీ అధిపతి పోప్ ఫ్రాన్సిస్ టర్కీ,లెబనాన్‌లలో పర్యటించేందుకు కార్యక్రమాన్ని నిర్దేశించారు. కానీ అనారోగ్యం వల్ల ఆయన మరణించారు. ఆయన పర్యటన కార్యక్రమాల కొనసాగింపులో భాగంగా పోప్ లియో టర్కీ,లెబనాన్‌లను సందర్శిస్తున్నారు.

## 'స్కైరూట్' వాహకనౌక

(మొదటి పేజీ తరువాయి)

ఆర్బిటల్ రాకెట్ విక్రమ్–1 వాహకనౌకకు అంతరిక్షంలోకి ఉపగ్రహాలను ప్రవేశపెట్టగల శక్తిసామర్థ్యాలు ఉన్నాయి.దేశంలో రోజు రోజుకూ గొప్ప ఆవిష్కరణలతో పురోగతి సాధిస్తున్న జనరేషన్–జెడ్‌పై ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రశంసల వర్షం కురిపించారు. జనరేషన్–జెడ్ ఇంజనీర్లు, జనరేషన్–జెడ్ డిజైనర్లు, జనరేషన్–జెడ్ కోడర్స్, జనరేషన్–జెడ్ సైంటిస్టులు దేశంకోసం కొత్త కొత్త సాంకేతికతలను సృష్టిస్తున్నారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం చరిత్రాత్మకమైన రీతిలో అంతరిక్షరంగ సంస్కరణలు ప్రారంభించిందని, ప్రైవేటు నిర్వాహకులకోసం దేశ అంతరిక్ష రంగ తలుపులు బార్లా తెరచి ఆహ్వానించిందన్నారు. తత్ఫలితంగా స్కైరూట్ సహా ఇతర అనేక అంకుర సంస్థలు ముందుకు వచ్చాయన్నారు. దేశంలో ఈనాడు 300కు పైగా అంతరిక్ష అంకుర సంస్థలు కొత్త ఆవిష్కరణల కోసం, రోదసీ అన్వేషణలకోసం అభివృద్ధి చెందుతున్నాయన్నారు. హైదరాబాద్ కేంద్రంగా రూపుదిద్దుకున్న ''ద ఇన్ఫినిటీ క్యాంపస్ సరికొత్త ఆలోచనలను ప్రతిబింబిస్తోందని, నవీన ఆవిష్కరణలకు అవకాశం ఇస్తోందని, అత్యంత భారీస్థాయిలో యువశక్తికి ఊపిరిలూదుతోందన్నారు. అపాయాలను కూడా శక్తిసామర్థ్యాలతో దాటుకుని ముందుకు వెళ్ళే ఔత్సాహిక సంస్థలు సరికొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాయన్నారు. భారతదేశంలో ప్రైవేటురంగంలోని నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా తనదైన సొంత గుర్తింపు సాధించుకుంటున్నదన్నారు. భారత అంతరిక్ష రంగం ఈనాడు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులకు ఎంతో ఆకర్షణీయమైన ఒక కేంద్రంగా మారిందన్నారు. భారతదేశం మొదటిసారి తన అంతరిక్ష యాత్రను చాలా తక్కువ వనరులతో ప్రారంభించి ఈనాడు సమున్నతస్థానాలకు చేరుకుంటున్నదని, మన తొలి రాకెట్‌ను సైకిలుమీద మోసుకుని తీసుకువెళ్ళామని, ఈనాడు రోదసీ అన్వేషణకు సమాయత్తమయ్యామని చెప్పారు. మన ప్రయాణం చాలా తక్కువ వనరులతో ప్రారంభం కావచ్చు, కానీ మన వృద్ధి మన కృతనిశ్చయాన్ని రుజువుచేస్తుంది, అదే మన కలలను సాకారం చేస్తుంది అన్నారు. స్కైరూట్ క్యాంపస్‌ను రెండు లక్షల అడుగు విస్తీర్ణంలో కార్యకలాపాల నిర్వహణకు సిద్ధం చేశారు. దేశంలోని స్పేస్ కంపెనీలలో స్కైరూట్ ఎంతో అగ్రస్థానంలో ఉన్న కేంద్రంగా రూపొందింది. ఇస్రోలో పనిచేసిన మాజీ శాస్త్రవేత్తలు, ఐఐటి పూర్వ విద్యార్థులు భరత్ దాకా, పవన్ చందన ఇద్దరూ ఈ స్కైరూట్ కంపెనీని స్థాపించారు. 2022 నవంబరులో స్కైరూట్ తన మొదటి అనుబంధ రాకెట్ విక్రమ్–ఎస్‌ను ప్రయోగించింది.

### భవిష్యత్‌లో రూ.1000 కోట్లు స్కైరూట్ పెట్టుబడులు : భరత్

రాబోయే కాలంలో స్కైరూట్ కంపెనీ అంతరిక్ష రంగంలో రూ.1000 కోట్ల మేరకు పెట్టుబడులు సమకూర్చాలనే లక్ష్యంతో ఉందని కంపెనీ సహ వ్యవస్థాపకుడు నాగ భరత్ దాకా చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారంనాడు దృశ్యమాధ్యమ విధానం ద్వారా స్కైరూట్ క్యాంపస్‌ను, దానికి సంబంధించిన మొట్టమొదటి వాహకనౌక విక్రమ్–1ను ప్రారంభించి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్ దాకా మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్ణయాత్మకంగా అంతరిక్షరంగ సంస్కరణలు చేస్తున్నారని, ప్రైవేటు రంగానికి తలుపులు బార్లా తెరిచారని అన్నారు. ఈనాడు స్కైరూట్ 0000కు పైగా హైటెక్ ఉద్యోగాలను సృష్టించిందని, సమీప భవిష్యత్తులో రూ.1000 కోట్లు పైగా పెట్టుబడులను సమకూర్చనున్నదని చెప్పారు. అదేవిధంగా స్కైరూట్ సిఇఓ, సహ వ్యవస్థాపకులు పవన్ కుమార్ చందన మాట్లాడుతూ, విక్రమ్–1 భారతదేశ ప్రైవేటు రంగంలో తయారైన మొట్టమొదటి వాహకనౌక అన్నారు. దీనిని ప్రధానమంత్రి మోదీ గురువారంనాడు ఆవిష్కరించారని చెప్పారు. విక్రమ్–1ను స్కైరూట్ నాలుగు సంవత్సరాలు కష్టపడి తయారు చేసిందన్నారు. పూర్తిగా కార్బన్ ఫైబర్‌తో ఈ వాహనాన్ని తయారు చేశామన్నారు. శక్తిసామర్థ్యం,పటిష్టత,పనితీరులో ఎంతో గొప్పతనం ఉంటుందని, త్రీ డీ ప్రింటింగ్ హైపర్‌గోలిక్ ఇంజనర్లతో ఇది పనిచేస్తుందన్నారు.

## చేశాయ్

(మొదటి పేజీ తరువాయి)

సాక్ష్యాలుగా చూపించి ఈ దేశాల్లో సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం జరిగిందని విమర్శించింది. భారత్‌లోని ''రిపబ్లికన్ టీవీ' గుర్తు తెలియని అఫ్ఘనిస్థాన్ సోషల్ మీడియా వనరులపై ఆధారపడి దుష్ప్రచారం ప్రారంభించిందని, ఆదిలియా జైలులోకి పిటిఐ కార్యకర్తలు దూసుకువెళ్ళారంటూ పాకిస్థాన్‌లో అశాంతి రెచ్చగొట్టేందుకు పదే పదే ప్రచారం చేశారని, ఆ తర్వాత ఇతర మీడియా కూడా ఎలాంటి క్రాస్ చెకింగ్ లేకుండా దుష్ప్రచారం కొనసాగించాయని మంత్రిత్వ శాఖ ఆరోపణలు చేసింది. ఇదిలా ఉండగా ఇమ్రాన్‌ఖాన్ క్షేమంగా ఉన్నారని పాకిస్థాన్ రావల్పిండి జైలు అధికారులు వివరణ ఇచ్చారు. జైలు నుండి ఆయనను బయటకు తరలించారంటూ వచ్చిన వార్తల్లో నిజం లేదు, ఆయన పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు, ఆయనకు వైద్య సహాయం అందుతోంది అని అధికారులు పేర్కొన్నారు. పాకిస్థాన్ రక్షణమంత్రి ఆసిఫ్ కూడా ఇదేవిధమైన ప్రకటన చేశారు. ఇమ్రాన్‌ఖాన్‌ను ఆత్మీయ కుటుంబ సభ్యులుకూడా చూడనివ్వకుండా జైలు అధికారులు నెలరోజులుగా నిషేధం అమలు చేస్తున్నారని బుధవారం మధ్యాహ్నం వార్తలు వెలువడ్డాయి. ఆయన ముగ్గురు సోదరీమణులు నూరుల్ ఖాన్, అలీమాఖాన్, ఉజ్మాఖాన్‌లు సహా పార్టీ మద్దతుదారులు జైలు వెలుపల శాంతియుతంగా కూర్చుని నినాదాలు చేస్తుండగా జైలు సిబ్బంది వారిని కొట్టి తరిమేశారని వార్తలు వచ్చాయి. ఇమ్రాన్‌ఖాన్ ఎక్కడ ఉన్నారో భౌతికంగా తమకు చూపించాలని జైలు అధికారులను డిమాండ్ చేస్తున్నారనీ, కానీ అధికారులు ఆయనను చూపించేందుకు నిరాకరిస్తున్నారనీ వార్తలు వచ్చాయి. ఇమ్రాన్‌ఖాన్ 2023 నుండీ రావల్పిండి అడియాలా జైలులో శిక్ష అనుభవిస్తున్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com